# క్రాంతి


**లోపలి పేజీల్లో...**

సింగరేణి ఓపెన్‌కాస్టు... ..........13
లాల్‌గఢ్ ప్రతిఘటన ..........18
ఒబామా ఎన్నిక ..........21
దిద్దుబాటు ఉద్యమం........మధ్య పేజీలో
ప్రేమోన్మాద దాడి ..........29
సముద్రపు దొంగలు ..........31
సింగారం హత్యాకాండ ..........33
జైళ్లలోని పరిస్థితులు ..........36
పోరాట వార్తలు ..........38



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 33 సంచిక: 1 జనవరి - ఫిబ్రవరి 2009 వెల: ఐదు రూపాయలు


## ఆంధ్రప్రదేశ్ ఉద్యమాన్ని పునరుద్ధరించేందుకు తమ నెత్తుటిని ధారపోసిన


## కామ్రేడ్స్ ఎం.ఆర్., ఆర్.సి., ప్రసన్న, ప్రభాకర్, సరిత, అశోక్‌లకు జోహార్లు

**అమరుల త్యాగాలను సమున్నతంగా ఎత్తిపడుదాం! వారి ఆశయసాధనకు మరింత కసితో ముందుకు సాగుదాం!!**

### అతను

వికసించని మొగ్గ పరిమళం
ముక్కుపుటల స్పర్శించదు
విప్పారిన పువ్వు పరిమళం
మనసును ముద్దాడి
భావ ఘర్షణను స్వాగతించింది
పువ్వు విత్తనాన్ని వాగ్దానం చేస్తే
విత్తనం వనమై వట వృక్షమై...
జ్ఞాపకాల శిఖల్లో ఆయన...
వనాల సుందర సుదూర దృశ్యం
వికసించిన పూల పరిమళం
నునువెచ్చని భావనల్లో చిత్తరువై అతను
ఎత్తుపల్లాల ఒడిదుడుకుల గాయాలలో
నిండుగా నిటారుగా ఎదురుగా అతను

– అసిధార



కామ్రేడ్ మస్తాన్ రావు

2008, అక్టోబర్ 27న పోలీసులు అల్లిన అబద్ధాల బూటకపు ఎన్‌కౌంటర్లో అమరులైన విలువైన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ మస్తాన్‌రావు (58) మొదటగా చెప్పుకోవల్సిన వ్యక్తి. నూతన సమాజ నిర్మాణం కొరకు మూడు దశాబ్దాలపాటు అవిశ్రాంతంగా పోరాడిన విప్లవకారుడాయన. అణగారిన వర్గంలో పుట్టి చైతన్యవంతమైన కార్యాచరణతో అత్యున్నత మానవుడిగా రూపొందాడాయన. అణగారిన ప్రజల చేతికి ఆధునిక ప్రపంచాన్ని అందించడం కోసం అత్యంత ప్రయాసతో కూడిన ప్రయాణాన్ని అలవోకగా చేశాడాయన.

# ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రలో విలువైన అధ్యాయాన్ని రచించిన కామ్రేడ్ మస్తాన్‌రావు

ఆంధ్రప్రదేశ్ ఉద్యమానికి మరొకసారి తీవ్రమైన నష్టం వాటిల్లింది. మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్ -9వ కాంగ్రెస్ పిలుపుమేరకు రాష్ట్రంలో ఉద్యమాన్ని పునరుద్ధరింప చేయడానికి చేస్తున్న ప్రయత్నానికి తీవ్ర విఘాతం కల్గింది. రాష్ట్రంలో ఉద్యమాన్ని అణచడం కోసమూ, ఉద్యమం పునరుద్ధరింపబడకుండా ఉండడం కోసమూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. ఆ తీవ్ర నిర్బంధం నడుమనే, అడుగడుగునా విస్తరించిన పద్మవ్యూహం వంటి శత్రు సమాచార (ఇన్ఫర్మేషన్) వ్యవస్థ నడుమనే ఎ.పి.లో ఉద్యమాన్ని పోటెత్తించాలనే అత్యంత సాహసోపేతమైన కర్తవ్యాన్ని దృఢదీక్షతో స్వీకరించి, ఆ కర్తవ్య నిర్వహణలో తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి కామ్రేడ్ వెంకట్రావు (మస్తాన్‌రావు-ఎం.ఆర్), కామ్రేడ్ గంగాధర్ (రాంచందర్-ఆర్.సి), కామ్రేడ్ అరుణ (జయ, సరిత, శశి), కామ్రేడ్ రాఘవేంద్రరావు (అశోక్, ప్రసన్న), కామ్రేడ్ ప్రభాకర్ (వెంకటేష్), కామ్రేడ్ జానా బాబూరావు (అశోక్)లు ఆంధ్రప్రదేశ్ ఉద్యమ త్యాగాల వారసత్వాన్ని సగర్వంగా కొనసాగించారు.

ఎ.పి.లో ఉద్యమాన్ని పునరుద్ధరించడం కొరకు ముగ్గురితో ఏర్పడిన ఎ.పి. స్పెషల్ కమిటీ సభ్యులందరినీ శత్రువు ఇంటెలిజెన్స్ విభాగం పట్టుకోగల్గింది. స్పెషల్ కమిటీ కార్యదర్శి అయిన కామ్రేడ్ మస్తాన్ రావును కామ్రేడ్ ప్రసన్నతో, మరొక సభ్యుడు ఆర్.సి.ని ఆయన సహచరి కామ్రేడ్ సరితతో, మరొకచోట ఇంకొక కామ్రేడ్ జోగాల్‌ను పట్టుకున్నారు. వీరందర్నీ ఒక రోజంతా తీవ్రంగా చిత్రహింసలు పెట్టి 2008, అక్టోబర్ 27వ తేదీ తెల్లవారుజామున కామ్రేడ్స్ ఎం.ఆర్, ప్రసన్నలను విజయనగరం జిల్లాలోని పార్వతీపురం మండలం, రావికోన కొత్తవలస వద్ద దారుణంగా కాల్చి చంపారు. అదేవిధంగా కామ్రేడ్స్ ఆర్.సి., సరితలను గుంటూరు జిల్లా బొల్లాపల్లి మండలం రావులపల్లి అటవీ ప్రాంతంలో హత్య చేశారు. కామ్రేడ్ జోగాల్‌ను మాత్రం కోర్టులో హాజరుపర్చారు. ఇదే పరంపరలో గుంటూరు జిల్లా ఉద్యమంలో సుదీర్ఘకాలం పాటు కీలకపాత్ర వహించిన కామ్రేడ్ ప్రభాకర్‌ను పట్టుకొని నవంబర్ 5న గుంటూరు జిల్లా బొల్లాపల్లి అడవుల్లో కాల్చి చంపారు. అలాగే నల్లమల డివిజన్ పుల్లల చెరువు వద్ద 2009, జనవరి 15వ తేదీన కామ్రేడ్ అశోక్‌ను కాల్చి చంపారు. ఇలా పట్టుకుని కాల్చి చంపిన ఘటనలన్నింటినీ ఎన్‌కౌంటర్లని చెప్పి పోలీసులు పాతపాటే పాడారు.

ప్రస్తుతం ఉద్యమం, ప్రత్యేకించి ఎ.పి. ఉద్యమం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల నేపథ్యంలో కీలకమైన పాత్రను పోషిస్తున్న ఇంతమంది విలువైన కామ్రేడ్స్‌ను వెంట వెంటనే కోల్పోవడం దేశవ్యాప్త ఉద్యమానికీ, ప్రత్యేకించి ఎ.పి. ఉద్యమానికి తీవ్రమైన నష్టం. అయినప్పటికీ ఈ అమరత్వాలు ఏవీ వృథా పోవనీ, ఈ అమరత్వాల స్ఫూర్తి విప్లవ పురోగమనానికి చోదక శక్తిగా పని చేస్తుందనీ, అది దోపిడీ వర్గాలకు గోరీ కడుతుందని చాటుతూ, ఈ కామ్రేడ్సందరికీ వినమ్రంగా జోహార్లర్పిద్దాం. వాళ్ల ఆశయ జ్వాలను మరింతగా ప్రజ్వలింప చేద్దాం.

2008, అక్టోబర్ 27న పోలీసులు అల్లిన అబద్ధాల బూటకపు ఎన్‌కౌంటర్లో అమరులైన విలువైన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ మస్తాన్‌రావు (58) మొదటగా చెప్పుకోవల్సిన వ్యక్తి. నూతన సమాజ నిర్మాణం కొరకు మూడు దశాబ్దాలపాటు అవిశ్రాంతంగా పోరాడిన విప్లవకారుడాయన. అణగారిన వర్గంలో పుట్టి చైతన్యవంతమైన కార్యాచరణతో అత్యున్నత మానవుడిగా రూపొందాడాయన. అణగారిన ప్రజల చేతికి ఆధునిక ప్రపంచాన్ని అందించడం కోసం అత్యంత ప్రయాసతో కూడిన ప్రయాణాన్ని అలవోకగా చేశాడాయన. పల్నాడులో మొదలైన ఆయన ప్రయాణం రాయలసీమకు విస్తరించి, ఉత్తర కోస్తాను అందుకొని, సరిహద్దులు దాటుకొని ఒరిస్సాను చేరుకొంది. తన సుదీర్ఘ ప్రయాణంలో పార్టీకి వైవిధ్యభరిత అనుభవాలనందించిన కామ్రేడ్ మస్తాన్‌రావు అమరుడయ్యే నాటికి ఎ.పి. స్పెషల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

కామ్రేడ్ మస్తాన్‌రావు, ఎం.ఆర్. అనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా సుపరిచితుడు. ఆయన అసలు పేరు వెంకట్రావు. గుంటూరు పట్టణంలోని సంగడిగుంట ఆయన నివాస స్థలం. విప్లవోద్యమంలో గుంటూరు జిల్లాకు ఒక విశిష్టమైన స్థానం వుంది. నాటి తెలంగాణా, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట పిలుపులన్నింటికీ గుంటూరు జిల్లా ప్రతిస్పందించింది. ఆ పోరాటాలకు అన్ని రకాలుగా అండదండలను అందించింది. తన ముద్దు బిడ్డలను పోరాటాలకు పయనం కట్టించింది. అటువంటి పోరాట ప్రభావమున్న ప్రాంతంలో శ్రామిక వర్గంలో పుట్టిన కామ్రేడ్ ఎం.ఆర్. ప్రాథమిక విద్యతోనే సరిపెట్టుకోవల్సి వచ్చింది. ఆ చదువుతోఒక కాలేజీలో ల్యాబ్ బాయ్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఆ సమయంలో అంటే 1975లో ఆయనకు గురవయ్యసార్ ద్వారా విప్లవోద్యమం పరిచయమైంది.

అప్పటికి నక్సల్బరీ, శ్రీకాకుళ విప్లవోద్యమాలు వెనుకంజ వేయగా, పార్టీ చాలా దెబ్బతినిపోయిన స్థితిలో, 'గతాన్ని

సమీక్షించుకొని సాయుధ పోరాటాన్ని పురోగమింపజేసేందుకు' అప్పటి ఆంధ్ర రాష్ట్ర కమిటీ రూపొందించిన 'ఆత్మవిమర్శనా రిపోర్ట్' ఆంధ్ర రాష్ట్రంలో నిజమైన విప్లవ శక్తులను 'ప్రజాపంథా' మీద ఆధారపడి విప్లవోద్యమాన్ని పునర్నిర్మించేందుకు ముందుకు నడిపించింది. ఆవిధంగా ముందుకు నడిచిన వారిలో కా. మస్తాన్‌రావు ఒకరు. అప్పటికే ఆయనకు వివాహం అయింది. అయినా ఏమాత్రం సంకోచించకుండా విప్లవోద్యమంలో భాగమయ్యాడు.

## గుంటూరు జిల్లా ఉద్యమంతో పెనవేసుకున్న కామ్రేడ్ ఎం.ఆర్. జీవితం

1977లో కామ్రేడ్ ఎం.ఆర్. పార్టీ సభ్యుడయ్యాడు. 1978లో ఆయన జె.ఎస్.ఎం.లో పని చేశాడు. ప్రజలను ఉత్తేజపరిచే ఎన్నో కళా ప్రదర్శనలకు ఆయన నాయకత్వం వహించాడు, స్వయంగా ప్రదర్శించాడు. 1980 నుండి ఆయన కార్మికరంగంలో పని చేశాడు. గుంటూరు పట్టణంలో కార్మిక నాయకుడిగా ప్రసిద్ధి చెందాడు. 1982లో పూర్తికాలం కార్యకర్తగా మారి గుంటూరు పక్కనే వున్న పేరేచర్ల పారిశ్రామిక ప్రాంతంలో పని చేశాడు. అదే సమయంలో పేరేచర్లకు పక్కనే వున్న సత్తెనపల్లితో ఆయన సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. సత్తెనపల్లి దేశ విముక్తి కోసం తమ విలువైన ప్రాణాలను అర్పించిన వీరులను కన్న గడ్డ. అక్కడ ఆయన రైతాంగాన్ని పోరాటాల్లోకి సమీకరించాడు. ఆ సమయంలో కార్మిక కర్షక మైత్రికి ఒక నిజమైన ప్రతినిధిగా ఆయన కార్యాచరణ వుండేది. 1983-84లలో రాజయ్య పేరుతో కేంద్ర ఆర్గనైజర్‌గా సత్తెనపల్లి ప్రాంతంలోనే కేంద్రీకరించి పని చేశాడు.

ఈ ప్రాంతం రివిజనిస్టులకు కంచుకోటగా వుండేది. పీడిత ప్రజానీకంతో ప్రత్యేకించి దళిత ప్రజానీకంతో మమేకమవుతూ భూస్వాములకు, అగ్రకులాలకు వూడిగం చేసే రివిజనిస్టుల వర్గసంకర రాజకీయాలను ఎండగట్టేందుకు తీవ్రంగా కృషి చేశాడు. ఆనాడు విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించడం కొరకు కూడా కార్మికవర్గంపై ఆధిపత్యం వహిస్తోన్న రివిజనిస్టులకు, సి.పి.ఐ.(ఎం.ఎల్) మితవాద అవకాశవాద శక్తులకు వ్యతిరేకంగా ఆయన దృఢమైన పోరాటం చేశాడు.

పార్టీ నల్లమల పర్‌స్పెక్టివ్‌ను తీసుకున్నప్పుడు, అందులో భాగంగా గుంటూరు జిల్లా ఉద్యమం నల్లమల అటవీ ప్రాంతానికీ, సత్తెనపల్లికి ఆనుకొని వున్న బెల్లంకొండ అటవీ ప్రాంతానికి విస్తరించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. అయితే 1987 వరకూ ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు. ఈ ప్రయత్నాలను సఫలం చేయడం కోసం అప్పటి డి.సి.ఎం. అమరుడు కా. ఏసన్న నాయకత్వంలో నల్లమల అటవీ ప్రాంతానికి సర్వే కోసం ఒక దళం వెళ్లింది. ఈ దళం చేసిన ప్రయత్నాలు, బెల్లంకొండకు ఆనుకొని వున్న సత్తెనపల్లిలో కా. ఎం.ఆర్. నాయకత్వంలోని పోరాటాల ప్రభావం, మొత్తంగా పల్నాడు ఏరియాలో పార్టీ చేసిన కృషి నల్లమల పర్‌స్పెక్టివ్‌ను సాకారం చేశాయి.

1987లో జరిగిన జిల్లా ప్లీనంలో ఆయన జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. నల్లమల పర్‌స్పెక్టివ్‌ను ఆచరణలోకి తీసుకెళ్లేందుకు మస్తాన్‌రావు పేరుతో వినుకొండ ఏరియా బాధ్యతలు చేపట్టాడు. వినుకొండ తాలూకాలోని బొల్లాపల్లి మండలాన్నీ పల్నాడు ప్రాంతంలోని దుర్గి మండలాన్నీ కేంద్రాలుగా చేసుకొని నల్లమలలో విప్లవోద్యమాన్ని రాజేయటంలో తన వంతు పాత్ర నిర్వర్తించాడు.

1989లో బొల్లపల్లి, పుల్లల చెరువు ప్రాంతంలో తునికాకు కూలీ రేటు పోరాటాన్ని విజయవంతంగా నడిపించి నల్లమల్లలో విప్లవోద్యమానికి బీజాలు వేశాడు. అనంతరం ఫారెస్ట్ అధికారుల క్రూరమైన దోపిడి పీడనలకు వ్యతిరేకంగా ఆయన నేతృత్వంలో పల్నాడు వ్యాప్తంగా జరిగిన చర్యల ఫలితంగా ఫారెస్ట్ అధికార్లు అడవుల నుంచి పరుగులు తీశారు. దీంతో పల్నాటి రైతాంగం, ఆదివాసీలకు ఫారెస్ట్ అధికార్ల పీడ విరగడయ్యింది.

1990 నుంచి మూడు సంవత్సరాల పాటు వరుసగా సారా రేటు తగ్గింపు పోరాటం, అనంతరం సారానిషేధ పోరాటం గుంటూరు జిల్లా ఉద్యమాన్ని ఒక మలుపు తిప్పింది. కోట్లకు పడగలెత్తిన సారా 'రాజు'ల దోపిడి నుంచి ప్రజలను విముక్తి చేయటం కోసం ఈ పోరాటాలను కా. ఎం.ఆర్. చేపట్టాడు.

మొత్తం పల్నాడు, ఎగువ వినుకొండ, బెల్లంకొండ ప్రాంతాలలో విప్లవోద్యమం వేళ్లూనుకోవడాన్ని సహించలేని ప్రభుత్వం 1991లో ఎస్.పి. మీనా నేతృత్వంలో దాడిని తీవ్రతరం చేసింది. ఈ దాడిని తిప్పికొడుతూనే కామ్రేడ్ ఎం.ఆర్. ఉద్యమాన్ని ముందుకు నడిపించాడు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కట్టిన తర్వాత ఎగువపల్నాడు, బొల్లాపల్లి ప్రాంతాలు శాశ్వత కరువు పీడిత ప్రాంతాలుగా మారిపోయాయి. ఇక్కడ ప్రజల గోడుపట్టించుకునేవారే లేకుండా పోయారు. 1989 నుంచి సాగిన తునికాకు, సారా పోరాటాలు, అటవీ భూముల ఆక్రమణ పోరాటాలతో పెరిగిన ప్రజాపునాదిని ఆసరా చేసుకొని 1992 నిర్బంధాన్ని తిప్పికొట్టడానికి కరువు వ్యతిరేక పోరాటం ఆరంభించేందుకు కా. ఎం.ఆర్. ఎంతో సృజనాత్మకంగా, చొరవగా కేడర్‌కు నేతృత్వం వహించి, కరువు వ్యతిరేక ఉద్యమాన్ని

నిర్మించాడు. బొల్లపల్లి మండలంలో పమిడిపాడు లాంటి ఎర్రగ్రామాల్ని రగిలించడంలో ఎంతో నేర్పుతో కృషి చేశాడు.

1994లో వేలాది ఎకరాల దేవుడి మాన్యం భూములను భూస్వాముల కబంధ హస్తాల నుంచి విడిపించి భూమిలేని వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు పంపిణీ చేసే పోరాటాలను ఆరంభించటంలో కా. ఎం.ఆర్. సరియైన నేతృత్వాన్ని అందించాడు. జిల్లాలో వర్గపోరాటాలు బద్దలయ్యేందుకు ముఖ్యమైన భూమికను పోషించాడు.

కృష్ణా నది ఒడ్డున ఉండే దాచేపల్లి, బెల్లంకొండ ప్రాంతాలలో ఓడ రేవులన్నీ అన్ని భూస్వాముల, పెత్తందార్ల చేతిలో వుండేవి. వీటి నుంచి లక్షలాది రూపాయల ఆదాయం వీళ్ల పరం అయ్యేవి. పడవలు వీళ్ల చేతిలోనే వుండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో పడవ వేయమంటే, దురహంకారంతో నిరాకరించటం వల్ల అనారోగ్యం పాలైనవారు, గర్భవతి మహిళలు తీవ్ర ఇబ్బందులపాలయ్యేవారు. ప్రజలలో భూస్వాములపట్ల వున్న కసిని ఆధారంగా చేసుకొని ప్రజలను సంఘటితపరిచి ఓడ రేవులను ప్రజలపరం చేసేందుకు కా. ఎం.ఆర్. నేతృత్వంలోనే పడవ స్వాధీన పోరాటాలు జరిగాయి. ఇవి విజయవంతం కావటంతో ఈ ప్రాంతంలో భూపోరాటాలకు పునాది ఏర్పడింది.

88 తాళ్లూరు గ్రామంలో సి.పి.ఎం. ఫాసిస్టు గూండాల దాడిని ఎదుర్కొంటూ పెద్ద ఉద్యమంలాగా నిర్వహించిన అమరవీరుల స్మారకసభ, ప్రజాయుద్ధ సందేశం ప్రతి ఇంటికీ చేరేందుకు ఎంతో తోడ్పడింది.

**దళితులకు రామాపురం మార్గం చూపిన కామ్రేడ్ ఎం.ఆర్:** దాచేపల్లి ఏరియాలో రామాపురం గ్రామం విప్లవోద్యమానికి బలమైన కేంద్రంగా ఉండేది. దళితవాడను కేంద్రంగా చేసుకొని గ్రామంలో పీడిత వర్గ, కుల ప్రజలను రైతుకూలి సంఘంలో సంఘటితం చేయటంలో, అక్కడి సి.పి.ఐ. రివిజనిస్టు భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని అభివృద్ధి చేయటంలో మన పార్టీ ఫలితాలు సాధించింది. అయితే పెరిగిన ప్రభుత్వ దాడిని వినియోగించుకొని రివిజనిస్టు భూస్వాములు సంఘాన్ని ముక్కలు చేసి, చివరికి దళితవాడనే బూడిద చేయాలని కుట్ర చేశారు. ఈ కుట్రను భగ్నం చేయటం కోసం, కా. ఎం.ఆర్. నేతృత్వంలో రామాపురం భూస్వాములపై సాహసోపేతంగా దాడి జరిగింది. వారిని ఖతం చేసి దళితవాడను రక్షించటమేగాక, అగ్రకుల భూస్వాముల అత్యాచారాలకు రామాపురం పోరాట మార్గమే విరుగుడుగా కామ్రేడ్ ఎం.ఆర్. చాటి చెప్పాడు.

ఆనాటికి గుంటూరు జిల్లాలో ఇదే మొట్ట మొదటి 'ఖతం' కార్యక్రమం కావటంతో ఇది 'దుస్సాహసిక చర్య' అనే అపవాదును తుత్తునియలు చేయటంకోసం, ఈ దాడి అనంతరం విస్తరించిన ప్రజా పునాదిని, ప్రజా పోరాటాలనే కా. ఎం.ఆర్. నిదర్శనంగా చూపాడు.

రామాపురం చర్య తర్వాత ఆ గ్రామంలో, విప్లవోద్యమానికి మరో బలమైన కేంద్రమైన భట్రుపాలెం అనే గ్రామంలో పోలీసు క్యాంపులు వేయించి దాచేపల్లి ప్రాంతంలో విప్లవోద్యమాన్ని పూర్తిగా దెబ్బతీయడానికి భూస్వాములు చేయని కుట్రలేదు. వాటన్నింటినీ తిప్పికొడుతూ, దాచేపల్లి ప్రాంతానికి దన్నుగా బెల్లంకొండ ప్రాంతానికి విప్లవోద్యమాన్ని విస్తరింపచేసి, దాచేపల్లి ప్రాంతంలో విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయటంలో కా. ఎం.ఆర్. కృషి చెప్పుకోదగినది.

ఈ కాలంలో పోలీసు నిర్బంధం తీవ్రతరమై అనేక మంది సంఘ కార్యకర్తలను జైళ్లలో నిర్బంధించారు. దీనికితోడు ఎస్.పి. మీనా నేతృత్వంలో జరిగిన చంద్రవంక ఎన్‌కౌంటర్‌లో డి.సి.ఎం. కామ్రేడ్ ఏసన్న, దళకమాండర్ కా. రామకృష్ణ, దళసభ్యురాలు కామ్రేడ్ శాంతిలతోపాటు నలుగురు జాలర్లు అమరులయి జిల్లాలో తీవ్రమైన అననుకూల వాతావరణం ఏర్పడింది. ఈ స్థితిలో క్యాడర్‌కు విశ్వాసం కల్పిస్తూ, ప్రజలను అంటిపెట్టుకొని వుంటూ ఎగువ పల్నాడులో కరువు వ్యతిరేక పోరాటాన్ని, బెల్లంకొండ ప్రాంతంలో పెత్తందార్ల వ్యతిరేక పోరాటాలను తిరిగి ఆరంభించడంలో కామ్రేడ్ ఎం.ఆర్. కృషి కీలకమైనది.

ఇలా కామ్రేడ్ ఎం.ఆర్. జీవితం గుంటూరు జిల్లా ఉద్యమంతో పెనవేసుకుపోయింది. ఉద్యమంతో, ప్రజలతో మమేకం కావడం ద్వారా ఆయన పొందిన అనుభవం ఆయన ఉద్యమ సమర్థతలను విస్తృతం చేసింది. ఫలితంగా 1990 నాటికి గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. ఆ తర్వాత దక్షిణ కోస్తా, రాయలసీమ ఉమ్మడి రీజనల్ కమిటీలో సభ్యుడయ్యాడు. 1995లో రీజనల్ కమిటీ కార్యదర్శిగానూ, రాష్ట్ర కమిటీ సభ్యుడిగానూ ఎన్నికయ్యాడు. అలా రాష్ట్ర వ్యాప్తంగా క్యాడర్‌కూ, ప్రజలకూ సుపరిచితుడయ్యాడు. తన పార్టీ పేరు మస్తాన్‌రావు అయినప్పటికీ ఎం.ఆర్.గానే ఆయన ప్రసిద్ధిగాంచాడు. ఆయన మస్తాన్‌రావు అని పేరు పెట్టుకోవడానికి ఒక నేపథ్యం వుంది. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో నల్గొండకు ఆనుకొని బెల్లంకొండ అటవీ ప్రాంతం పోరాటకారులకు ఒక బేస్ ఏరియాగా వుండేది. అక్కడ విప్లవకారులకు మిలటరీ తర్ఫీదు ఇచ్చేవాళ్లు. మస్తాన్‌రావు అనే ఆయన విప్లవకారులకు మిలటరీ శిక్షణ ఇవ్వటమేగాక, అచ్చంపేట

పోలీస్ స్టేషన్ మీద రెయిడ్ చేసి ఆయుధాల స్వాధీనానికి నేతృత్వం వహించాడు. ఈయన గతంలో మిలటరీలో పనిచేశాడు. అనంతరం కమ్యూనిస్టు పార్టీలో చేరి మిలటరీ దళాలకు నేతృత్వం వహించాడు. ఈయన స్ఫూర్తితో కా. వెంకట్రావు మస్తాన్‌రావు పేరు పెట్టుకొని గుంటూరు జిల్లా విప్లవోద్యమం, మొత్తం ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో ఎం.ఆర్.గా శాశ్వతంగా నిలిచిపోయాడు.

## రాయలసీమ రణం నేత

శత్రు నిర్బంధంలో రాయలసీమకు నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్ రెడ్డప్ప, జనార్దన్‌లు అమరులైనపుడు ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి పార్టీ కామ్రేడ్ ఎం.ఆర్.ను ఆ ప్రాంతానికి పంపింది. తనకు పరిచయం లేని ప్రాంతమైనప్పటికీ ఉద్యమావసరాల రీత్యా ఆ బాధ్యతలను స్వీకరించాడు. కా. ఎం.ఆర్. రాయలసీమకు వెళ్లి అక్కడి పని విధానాన్ని చక్కదిద్దాడు. 1999లో ఎ.పి.ఎస్.సి. ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన దిద్దుబాటు ఉద్యమంలో భాగంగా రాయలసీమలో దిద్దుబాటును నిర్వహించి ఉద్యమానికి ప్రేరణనిచ్చాడు. సరైన నేతృత్వాన్ని అందించడం ద్వారా ఆయన రాయలసీమ క్యాడర్ విశ్వాసాన్ని గణనీయంగా పొందాడు. రాయలసీమ పర్‌స్పెక్టివ్‌ను రాయాలనే పార్టీముందున్న కర్తవ్యాన్ని స్వీకరించి, నెరవేర్చాడు. అనంతపూర్‌లోని రాయగిరి, పెన్నహొబిళం ఏరియాలలో విస్తృతంగా తిరిగి ప్రజల్లో, కేడర్లో విశ్వాసాన్ని నింపడంతోపాటు ఫ్యాక్షన్ రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసి పర్‌స్పెక్టివ్‌ను శక్తివంతంగా రాశాడు.

## ఎ.ఒ.బి. ఉద్యమ నేత

రాష్ట్రంలో శత్రుదాడి పెరిగిన నేపథ్యంలో కొన్ని శక్తులను ఇతర ప్రాంతాలకు పంపాలనే పార్టీ నిర్ణయం ప్రకారం మరికొందరు కామ్రేడ్స్‌తోపాటు ఎ.పి. రాష్ట్ర కమిటీ సెక్రటేరియట్ సభ్యుడిగా వున్న కామ్రేడ్ ఎం.ఆర్.ను కూడా రిలీవ్ చేసింది. ఆయన 2005లో ఎ.ఒ.బి.లో కైలాసం పేరుతో అడుగుపెట్టాడు. ఎ.ఒ.బి.లో సెక్రటేరియట్‌లో భాగమయి కొద్దికాలం పాటు ఈస్ట్ డివిజన్ వుద్యమానికి నేతృత్వం అందించాడు. 2005 చివర్లో జరిగిన మహాసభ కోరాపుట్‌లో ఉద్యమాన్ని బలోపేతం చేసి దాన్ని ఒక డివిజన్‌గా రూపొందించాలన్న కర్తవ్యాన్ని చేపట్టింది. ఆ కర్తవ్యాన్ని నెరవేర్చే బాధ్యతను స్వీకరించి కా. ఎం.ఆర్. కోరాపుట్‌కు వెళ్లాడు. ఏ నిర్మాణమూ లేని ప్రాంతంలో కొద్దిమంది స్వీయాత్మక శక్తులపైనే ఆధారపడి ఆయన అక్కడ ఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేశాడు. ఈస్ట్ డివిజన్ అయినా, కోరాపుట్ ప్రాంతం అయినా ఎత్తయిన కొండల ప్రాంతం, తనకేమాత్రం తెలియని ప్రజల సంస్కృతి, భాష, జీవన విధానం. 58 ఏళ్ల వయసులో అనారోగ్యంతో ఆ కష్టమైన టెర్రయిన్‌లో తిరుగుతూ ప్రజల సమస్యలను అర్థం చేసుకుంటూ వారిని పోరాటాల్లోకి సమీకరించాడు. ముఖ్యంగా కోరాపుట్ ప్రాంతంలో భూస్వాములకూ, కాంట్రాక్టర్లకూ, వడ్డీ వ్యాపారస్తులకూ, సారా వ్యాపారులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలను నిర్వహించి అది ఒక డివిజన్‌గా ఆవిర్భవించడంలో కీలకమైన పాత్ర పోషించాడు. ఆ పోరాటాలు దోపిడీవర్గాల్లో వణుకు పుట్టించాయి. ఫలితంగా అనతి కాలంలోనే కోరాపుట్ డివిజన్ శత్రువుకు లక్ష్యంగా మారింది.

ఈస్ట్ డివిజన్‌లోనూ, కోరాపుట్‌లోనూ తీవ్రమైన నిర్బంధంలో పని చేశాడాయన. రెండు మూడుసార్లు శత్రు దాడికి గురై ఎన్‌కౌంటర్లు జరిగాయి. తీవ్రమైన దాడి నుండి ఆయన చాకచక్యంగా తప్పించుకున్నాడు. మరో రెండు సందర్భాల్లో ఎన్‌కౌంటర్లు తృటిలో తప్పిపోయాయి. నిత్య నిర్బంధంలో, తీవ్రమైన కూంబింగ్స్ నడుమనే ఉద్యమాన్ని పురోగమింప చేయడానికి, శత్రు దాడులకు అడ్డుకట్ట వేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేశాడు.

## ఎ.పి. స్పెషల్ కమిటీ సారథి

ఎ.పి.లో ఉద్యమాన్ని పునరుద్ధరింప చేయడంకోసం ముగ్గురితో ఏర్పాటు చేసిన స్పెషల్ కమిటీకి కామ్రేడ్ ఎం.ఆర్. 2008లో కార్యదర్శి బాధ్యతలను స్వీకరించాడు. రాష్ట్ర ఉద్యమంతో తనకున్న సుదీర్ఘమైన సంబంధం, రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితిపై ఆయనకు వున్న అధ్యయనం మూలంగా పార్టీ కా. ఎం.ఆర్.కు ఆ బాధ్యతలను అప్పగించింది. సుదీర్ఘమైన రాష్ట్ర ఉద్యమ అనుభవంతో, తగిన సమర్థతలతో అక్కడ ఎన్నో మంచి ఫలితాలను అందించాల్సిన సమయంలో శత్రు చేతికి చిక్కి అమరుడయ్యాడు.

## నిరంతర అధ్యయనశీలి

గుంటూరు జిల్లాలో బలంగా వేళ్లూనుకున్న రివిజనిజం, మితవాద అవకాశవాదాలతో పోరాడ్డం కామ్రేడ్ ఎం.ఆర్.కు తన ఉద్యమ ప్రారంభ దశ నుండి తప్పనిసరి అయింది. దానికోసం ఆయన నిరంతరం మార్క్సిజాన్ని అధ్యయనం చేయాల్సి వచ్చింది. బూర్జువా బడిలో ప్రాథమికంగానే చదువుకున్నప్పటికీ పార్టీలో అవసరమైన సైద్ధాంతిక అధ్యయనాన్ని ఎంతో కృషితో కొనసాగించాడు. ఎంతో మానసిక శ్రమతో తన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నాడు. అమరులు కామ్రేడ్ గురవయ్య (గుంటూరు, ప్రకాశం జిల్లాల విప్లవోద్యమ నాయకుడు), కా. సూర్యం (ఎ.పి. రాష్ట్ర విప్లవోద్యమ నాయకుడు)లతో ఏర్పడిన సాన్నిహిత్యం. ఆయన సైద్ధాంతిక కృషికి ఎంతగానో దోహదపడింది. తనలోని సైద్ధాంతిక

➡

# ఆంధ్రప్రదేశ్ ఉద్యమ కేతనం కామ్రేడ్ రాంచందర్ అమర్ రహే!

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ మస్తాన్‌రావునే కాక, కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాంచందర్‌ను కూడా కోల్పోవడం ఎంతో దు:ఖకరం. దాదాపు పాతికేళ్లపాటు రాష్ట్ర ఉద్యమంతో పెనవేసుకుపోయిన కామ్రేడ్ రాంచందర్‌ను కోల్పోవడం తీవ్రమైన నష్టం.

కామ్రేడ్ రాంచందర్ **(44)** ఆర్.సి.గా ప్రసిద్ధుడు. రాము, ఏసన్న, చంద్రన్న అనే పేర్లతోనూ పరిచితుడైన ఆయన అసలు పేరు గంగాధర్. గుంటూరు జిల్లా మంగళగిరి ఆయనది. హైస్కూలు విద్యను పూర్తి చేశాడు. జీవనం కోసం చిన్న వయసులోనే అనేక ప్రాంతాలు తిరుగుతూ విశాఖ నగరానికి చేరాడు. అక్కడ జరిగిన విరసం సాహిత్య సభకు హాజరై పార్టీ సంబంధాలు కావాలని అడిగాడు. మీ ప్రాంతంలోనే పార్టీ వుంది ప్రయత్నించమని సలహా ఇస్తే అలా వెతుక్కుంటూ వచ్చి 1982లో పార్టీని చేరుకున్నాడు. ఆ తర్వాత అంచెలంచెలుగా పలు స్థాయిల్లో, పలు రంగాల్లో, పలు ప్రాంతాల్లో పనిచేసి పార్టీకి విలువైన అనుభవాలనిచ్చాడు.

మొదట గార్డుగా కామ్రేడ్ ఆర్.సి. ఉద్యమ జీవితం పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి ప్రాంతంలో ప్రారంభమైంది. అప్పుడు ఆయన పేరు రాము. ఆనాటికి అక్కడ రైతాంగ ఆర్గనైజర్‌గా పని చేస్తున్న కామ్రేడ్‌కు గార్డుగా బాధ్యతలు నిర్వర్తించాడు. కొద్ది రోజులు కొరియర్‌గానూ పని చేశాడు. అక్కడే తన జ్ఞానాన్నీ, ఉద్యమ అనుభవాన్నీ పెంచుకుంటూ ఆర్గనైజర్‌గానూ, జిల్లా కమిటీ సభ్యుడిగానూ ఎదిగాడు. 1982 నుండి పీపుల్స్‌వార్ ఉద్యమంలో భాగమైన పెదవేగి రైతాంగ పోరాట చరిత్రకు ఆ తదుపరి కష్టకాలంలో సారథ్యం వహించాడు. పెదవేగి భూస్వాముల గూండాల దాడులను ఎదిరించి రైతాంగానికి అండగా నిలిచి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాడు. రైతాంగ పోరాటాల్లో మంచి అనుభవాన్ని సంపాదించిన కా. రాము కార్మికరంగానికీ బాధ్యత వహించాడు. ఏలూరు జూట్‌మిల్లు కార్మికులతో మిలిటెంట్ పోరాటాలు చేయించి యాజమాన్యపు మెడలు వంచి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశాడు. దృఢదీక్ష, పట్టుదల, విశ్వాసం, ఓర్పు గల రాము గార్డుగా, కొరియర్‌గా, ఆర్గనైజర్‌గా జిల్లా నాయకుడిగా ఆ జిల్లా ఉద్యమంపై తన ప్రభావాన్ని వేశాడు. అటవీ, మైదాన ప్రాంతాలనూ, రైతాంగ, కార్మిక ఉద్యమాలనూ సమన్వయించి తన సమర్థతలను నిరూపించుకున్నాడు. ఉద్యమాన్ని విస్తరింపచేయడంలో, సంబంధాలను పునరుద్ధరించి నిలబెట్టుకోవడంలో, సమన్వయం చేయడంలో ఓర్పునూ, నేర్పునూ ప్రదర్శించి ఈనాటికీ ఆ సంబంధాలను సజీవంగా నిలబెట్టి ఉపయోగించాడు.

1993లో కామ్రేడ్ ఆర్.సి. ఏసన్న పేరుతో నల్లమల డివిజన్‌కు వచ్చాడు. డివిజనల్ కమిటీ సభ్యుడిగా వెలిగొండ ఏరియాకు బాధ్యత వహించాడు. అక్కడ బలహీనంగా వున్న ఉద్యమాన్ని పురోగమింపచేయడానికి తీవ్రంగా కృషి చేశాడు. అక్కడి ఉద్యమానికి ఆటంకంగా వున్న ప్రజా వ్యతిరేక శక్తులను శిక్షింపచేశాడు.

1997లో ఆయనను పార్టీ చిత్తూరు-కడప ఉమ్మడి జిల్లాకు బదిలీ చేసింది. చంద్రన్న పేరుతో అక్కడి పార్టీ పని విధానాన్ని మెరుగుపరచడంలోతగిన కృషి చేసి క్యాడర్ విశ్వాసాన్ని చూరగొన్నాడు. భూపోరాటాలను బలోపేతం చేయడానికి తీవ్రంగా

➡

దృఢత్వం వల్లనే పార్టీలో వచ్చిన రెండు సంక్షోభాల్లో సరైన పంథావైపు నిలబడ్డాడు. నిరంతరం ఒక విద్యార్థివలె అధ్యయనం కొనసాగిస్తూనే క్యాడర్‌కు, ప్రజలకు మంచి వుపాధ్యాయుడిగా వుండేవాడు. అవసరమైన సందర్భాల్లో రాజకీయ తరగతులను బోధించి విద్యార్థులను మెప్పించేవాడు. కామ్రేడ్ ఎం.ఆర్. క్యాడర్లో రాజకీయ జిజ్ఞాసను పెంచడానికి చర్చలను ప్రోత్సహించేవాడు. తానూ చర్చల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడు. ఆయనకు సాహిత్యం పట్ల మంచి అభిరుచి వుండేది. కథలూ, నవలలూ చదివి చర్చించేవాడు, విమర్శించేవాడు. తీవ్రమైన అనారోగ్యం ఉన్నప్పటికీ, ఆ వయసులోనూ క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజ్‌చేసి అందరినీ వుత్తేజపరిచేవాడు.

కామ్రేడ్ ఎం.ఆర్. మూడు దశాబ్దాలపాటు ప్రజల పక్షాన దృఢంగా నిలబడి పోరాడిన యోధుడు. ఎదురుపడిన అవాంతరాలనూ, అననుకూల పరిస్థితులనూ కమ్యూనిస్టు దృఢ చిత్తంతో ఎదుర్కొని ముందుకు నడిచిన ధీశాలి. దృఢ విశ్వాసానికీ, తొలి తరం ఆదర్శాలకు ప్రతినిధి. ఎందరికో రాజకీయాలు బోధించి నాయకులుగా తీర్చిదిద్దిన రాజకీయ గురువు.

ఇంతటి అనుభవాలగనిని కోల్పోవడం ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ఉద్యమానికి తీవ్రమైన నష్టం. తనలోని ఆదర్శాలను, దృఢ విశ్వాసాన్నీ, పట్టుదలనూ, విలువలనూ వారసత్వంగా స్వీకరించి ఆయన ఆశయాల పరిపూర్తికై ముందుకు సాగుదాం. ఇదే కామ్రేడ్ ఎం.ఆర్.కు మనం ఇవ్వగల్గిన నివాళి. ★

కృషి చేశాడు. ఆనాడు చిత్తూరు జిల్లాలోని కార్మికరంగంలో బలమైన నిర్మాణాలు వుండి ఉత్తేజకరమైన పోరాటాలు జరిగాయి. ఆ పోరాటాల నిర్వహణలో కామ్రేడ్ ఆర్.సి. తగిన పాత్రను పోషించాడు. క్రమంగా అక్కడి ఉద్యమంలో తన పాత్రను పెంచుకుంటూ, క్యాడర్, ప్రజల విశ్వాసాన్ని చూరగొని 1999లో ఉమ్మడి జిల్లాకు కార్యదర్శి అయ్యాడు. ఆ సమయంలో జిల్లాలో జరిగిన దిద్దుబాటు ఉద్యమంలో చురుకైనా పాత్ర పోషించాడు.

2000లో పార్టీ నిర్ణయం మేరకు నల్లమల డివిజన్ కార్యదర్శి బాధ్యతలను చేపట్టాడు. రాంచందర్ పేరుతో డివిజన్ బాధ్యతలను చేపట్టిన ఆయనను అందరూ ఆర్.సి. అని పిలిచేవారు. ఇక అప్పటి నుండీ ఆయనకు ఆర్.సి. పేరే స్థిరపడిపోయింది. డివిజన్‌లోని అన్ని రంగాలనూ సమన్వయిస్తూ మహిళా రంగానికి ప్రత్యక్షంగా బాధ్యత వహించాడు. ఆ సమయంలో కర్నూల్ జిల్లాలో విస్తృతంగా జరిగిన మహిళా పోరాటాల వెనుక తన కృషి ప్రధానమైనది.

ఇదే సమయంలో కర్నూలు జిల్లా శ్రీశైలం (సున్నిపెంట), ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లపై పి.ఎల్.జి.ఎ. దాడులకు, మరికొన్ని చర్యలకు పథకాలు రచించడంలో ముఖ్యపాత్ర వహించాడు.

2003లో జరిగిన రాష్ట్ర ప్లీనంలో కామ్రేడ్ ఆర్.సి. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత ఆయన రాష్ట్రంలోని ప్రజా ఉద్యమాలనూ, పట్టణోద్యమాన్ని సమన్వయించే బాధ్యతను స్వీకరించాడు. ఆయన ఉద్యమ జీవితంలో ఈ కృషి చాలా కీలకమైనది, కత్తిమీది సామువంటిది. అప్పటికే రాష్ట్రంలో నిర్బంధం హెచ్చుస్థాయిలో వుంది. ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా దళాలతోపాటు మైదాన, పట్టణాల్లోని ప్రజా ఉద్యమాలపైనా నిర్బంధం విరుచుకుపడుతున్న కాలం. పోలీసుల వేధింపులు ప్రజా ఉద్యమకారులకు నిత్యకృత్యమయ్యాయి. వీటితోపాటు నల్లదండు ముఠాల పేరుతో కోబ్రాల పేరుతో ప్రజా ఉద్యమ కార్యకర్తలను, నాయకులను బెదిరించీ, దాడులు చేసీ, ఆఖరికి హత్యలూ చేసి ఒక భయోత్పాత వాతావరణాన్ని సృష్టించింది ప్రభుత్వం. ఉద్యమ నాయకులను రాజీనామాలు చేయాలని బెదిరించింది. అలిపిరి దాడి తర్వాత ప్రజా ఉద్యమంపై వత్తిడి మరింత పెరిగింది. ఆ తర్వాత వై.ఎస్.ఆర్. అధికారంలోకి వచ్చి చర్చల నాటకం ముగిసిన తర్వాత నిర్బంధం మునుపెన్నడూలేని స్థాయిలో విరుచుకుపడింది. కొన్ని ప్రజాసంఘాలు నిషేధానికి సైతం గురయ్యాయి. ఈ బీభత్స వాతావరణం నడుమనే ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించే బాధ్యతను కామ్రేడ్ ఆర్.సి. స్వీకరించాడు. తీవ్ర నిర్బంధం నడుమనే ఉద్యమాలకు అండగా నిలబడి కార్యకర్తల్లో విశ్వాసాన్ని నింపాడు. దెబ్బతిన్న ఉద్యమాలను తిరిగి సంఘటితం చేయడానికి తీవ్రంగా కృషి చేశాడు. అవి క్రియాశీలకంగా పని చేయడానికి కృషి చేశాడు. నూతన రంగాల్లోకి ఉద్యమాన్ని విస్తరింపచేశాడు. ఈ క్రమంలో పార్టీకి విలువైన అనుభవాలనిచ్చాడు. ఉద్యమం దెబ్బతినిపోయివున్న స్థితిలో మిగిలివున్న కొద్దిమంది క్యాడర్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. వారి శక్తి, సమర్థతలను పెంచాడు.

తన కృషి, తాను పార్టీకి అందించిన అనుభవాలు, విశ్వాసం నేపథ్యంలో ఆ కృషిని మరింత విస్తృతం చేయడం కోసం, నిత్య నిర్బంధం నడుమనే ఉద్యమాన్ని విస్తరింపచేసే లక్ష్యంతో పార్టీ, ఎ.పి. స్పెషల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీలో ఒక సభ్యుడిగా వుండి తన కృషిని కొనసాగిస్తున్న సమయంలో కామ్రేడ్ ఆర్.సి. తన సహచరితో పాటు శత్రువు చేతికి చిక్కి అమరుడయ్యాడు.

కామ్రేడ్ ఆర్.సి.కి 90లలో కా. నాగమణితో వివాహం జరిగింది. వాళ్లిద్దరి జంట ప్రేమగా, అన్యోన్యంగా వుండేది. ఆమె బలహీనతలను అర్థం చేసుకుంటూ, ఆ బలహీనతల నుండి బయటపడ్డానికి అన్ని విధాలుగా సహకరిస్తూ, ఆమెను దృఢమైన విప్లవకారిణిగా తీర్చిదిద్దడంలో కా. ఆర్.సి. ఆదర్శవంతమైన పాత్ర వహించాడు. 2003లో జరిగిన ఒక గ్రేహౌండ్స్ దాడిలో కా. నాగమణి అమరురాలయింది. ఆ వియోగాన్ని దృఢ చిత్తంతో భరించి, కన్నీళ్లను కసిగా మార్చుకొని మరింత ముందుకు సాగాడు. 2006లో కామ్రేడ్ సరితతో తన జీవితాన్ని పంచుకున్నాడు. జిల్లా కమిటీ సభ్యురాలి స్థాయిలో పనిచేస్తున్న ఆమెకు స్వయంగా పోరు నేతృత్వాన్ని కూడా అందించాడు. నిత్య నిర్బంధంలో ఉద్యమాన్ని విస్తరింప చేయడంలో వారిద్దరి జంట ఆదర్శవంతమైన పాత్ర వహించింది.

కా. ఆర్.సి. ఏ విషయాన్నయినా లోతుగా అధ్యయనం చేసేవాడు. పలు సందర్భాల్లో జరిగిన అధ్యయన తరగతుల్లో చురుగ్గా చర్చిస్తూ, ప్రశ్నలను లేవనెత్తుతూ అందరినీ ఆలోచింప చేస్తూ తన జ్ఞానాన్ని పెంచుకునేవాడు. 2007 జనవరి-ఫిబ్రవరిలో జరిగిన 9వ ఐక్యతా కాంగ్రెస్‌లో పాల్గొని, చర్చించి తన అవగాహనను విస్తృతం చేసుకున్నాడు.

కామ్రేడ్ ఆర్.సి. మంచి కవి కూడా. బహుశా చాలా తక్కువ మందికే ఆయనలోని కవి పరిచయమై వుండవచ్చు. రాశిలో తక్కువే అయినప్పటికీ 'నీలకంఠం' పేరుతో తను రాసిన కవితలు రాజకీయపరంగానూ, సాహితీపరంగానూ విలువైనవి. క్యాడర్ చేసిన రచనలను చదివి మంచి చెడులను చర్చించేవాడు, ప్రోత్సహించేవాడు.తనలో చెప్పుకోదగిన మరో సుగుణం, ఆయనలోని స్నేహశీలత, ఆయన మాటలోనూ, పలకరింపులోనూ

➡

# ఉద్యమానికి నికార్సయిన రహస్య సైనికుడు కామ్రేడ్ రాఘవేంద్రరావు

కామ్రేడ్ ఎం.ఆర్.తోపాటు పోలీసులు పాశవికంగా కాల్చి చంపిన మరో కామ్రేడ్ పేరు రాఘవేంద్రరావు. ఈ కామ్రేడ్‌కు మూడు దశాబ్దాల విప్లవోద్యమ అనుభవం వుంది. ఈయన ప్రసన్న పేరుతో ఎక్కువ మందికి పరిచితుడు.

కామ్రేడ్ ప్రసన్న (50) విశాఖ పట్నంలో పుట్టి పెరిగాడు. డిగ్రీ చదివాడు. రైల్వే ఉద్యోగం వస్తే దాన్ని వదులుకొని రాడికల్ వుద్యమ నేత అయ్యాడు. అటవీ దళాల్లోనూ పని చేశాడు. అనంతగిరి దళంలో సభ్యుడిగా పని చేశాడు. క్రమంగా విశాఖ జిల్లా కమిటీ సభ్యుడయ్యాడు. అదే సమయంలో ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధానికి నిరసనగా బస్‌ను తగులబెట్టే క్రమంలో తీవ్రంగా ఒళ్లు కాలిపోయి, చావుతో పోరాడి గెలిచాడు. కానీ అతని వినికిడి శక్తి దెబ్బతిన్నది.

1986 వరకూ విశాఖలో పని చేసిన కామ్రేడ్ ప్రసన్న ఆ తర్వాత గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యాడు. గుంటూరు జిల్లాలో క్రిష్ణానదీ తీరంలో కా. ఎం.ఆర్. గైడెన్స్‌లో ఆర్గనైజర్‌గా పని చేశాడు. ప్రజల్లో మంచి విశ్వాసాన్ని పొందాడు. అక్కడ అయిదేళ్లు పనిచేసిన తర్వాత వినికిడి శక్తి పూర్తిగా క్షీణించి ఇక గ్రామీణ ప్రాంతాల్లో తిరగలేని పరిస్థితి వచ్చింది. దానితో టెక్నికల్ రంగానికి మారి వివిధ కవర్లలో వుంటూ 18 ఏళ్లు పని చేశాడు. పలు ఉద్యమ బాధ్యతలనూ, నాయకత్వ రక్షణ బాధ్యతలనూ నిర్వర్తించాడు.

కామ్రేడ్ ప్రసన్న ప్రజలపట్ల, ఉద్యమం పట్ల దృఢమైన విశ్వాసం కలిగి వుండేవాడు. ఆ విశ్వాసం వల్లే విశాఖ కమిటీలో వచ్చిన సంక్షోభాన్ని ఎదుర్కొన్నాడు. ఆ సంక్షోభంలో మిగితా కమిటీ సభ్యులు పార్టీని వీడి వెళ్లినా తను మాత్రం చెక్కు చెదరని దృఢ విశ్వాసంతో ఉద్యమాన్ని అంటిపెట్టుకొని వున్నాడు. ఉద్యమ పురోగమనాన్నీ, ఆటుపోట్లనూ అర్థం చేసుకొని రాజకీయ పరిణితిని సాధించాడు. చెవులు వినబడకపోయినా 23 ఏళ్లపాటు పార్టీ ఇచ్చిన ప్రతి పనినీ శ్రద్ధగా చేశాడు.

ఆయన మంచి నిర్వహణా దక్షుడు. ఆ దక్షత మూలంగా 1999లో గుంటూరు జిల్లా కాన్ఫరెన్స్‌లో అధ్యక్షవర్గంలో వున్నాడు. చాలా తీవ్రమైన వాదోపవాదాలు జరిగిన ఆ కాన్ఫరెన్స్‌ను ఎంతో సమర్థవంతంగా నిర్వహించి అందిరి మెప్పునూ పొందాడు.

ఆయన రాజకీయాలను లోతుగా అధ్యయనం చేశాడు. బాగా చర్చించేవాడు. రాసేవాడు. మంచి కవి కూడా. నవ్య పేరుతో పలు రచనలు చేశాడు. అతను స్నేహశీలి. పైకి ఎంత గంభీరంగా కనబడుతాడో, అంత బోలాగా వుండేవాడు. అతని పసి మనసు అందరినీ ఆకర్షించి తనకు సన్నిహితం చేసేది. చిన్నప్పుడు ఇంటి దగ్గర పరిస్థితులు, నిరాదరణ తనపై వేసిన ముద్రల గురించి గుంటూరు జిల్లా కేడర్‌తో పంచుకున్న సందర్భంలో కంటతడిపెట్టాడు. 25 సంవత్సరాల తర్వాత ఇప్పుడు వెళ్లి కూడా సనాతన బ్రాహ్మణ సాంప్రదాయం తనను ఇంటిలోకి కూడా రాకుండా చేసిన పరిస్థితికి బాధపడ్డాడు. ఆ బాధల్ని మరిపించిన ఉద్యమానికి తాను నికార్సయిన రహస్య సైనికుడయ్యాడు.

అతని సహచరికున్న అనారోగ్య సమస్యలను, అవగాహనా సమస్యలను ఓపిగ్గా అర్థం చేసుకొని, పరిష్కరిస్తూ సహకరించేవాడు. ఆమెను విప్లవోద్యమంలో ఎదిగించాడు.

కామ్రేడ్ ఎం.ఆర్.తో కామ్రేడ్ ప్రసన్నకు 23 ఏళ్ల అనుబంధం వుంది. ఇంత సుదీర్ఘ అనుబంధం వున్న ఇద్దర్నీ ఒకేచోట పట్టుకొని, తీవ్ర చిత్రహింసలు పెట్టి ఒకేచోట కాల్చి చంపి నరహంతక పోలీసులు ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు.

ఎన్ని సమస్యలు వచ్చినా, ఎన్ని కష్టాలు ఎదురైనా మూడు దశాబ్దాల పాటు ఉద్యమాన్ని అంటిపెట్టుకొని, ఉద్యమం కోసమే తన ప్రాణాలను అర్పించిన కామ్రేడ్ ప్రసన్న జీవితం ఎంతో ఆదర్శవంతమైనది. ఆయనలోని అన్ని ఆదర్శాలనూ అలవర్చుకుందాం. ఆయన ఆశయ సాధనలో ముందుకు నడుద్దాం. ★

---

➡

ఆత్మీయత తొణికిసలాడేది. క్యాడర్‌తో సన్నిహితంగా మెదులుతూ, వారికి అవసరమైన సహకారాన్ని అందించేవాడు. అదే సమయంలో సూటిగా వారిలోని లోపాలను ఎత్తిచూపేవాడు.

ఇలా నమ్మిన రాజకీయ విశ్వాసాలకు దృఢంగా కట్టుబడి, వ్యక్తిగత జీవితంలోనూ ఉక్కు క్రమశిక్షణతో రాష్ట్ర ఉద్యమంపైనా, క్యాడర్లో, ప్రజల్లో తనదైన ముద్రను వేసుకున్న కామ్రేడ్ ఆర్.సి. అమరత్వం ఉద్యమానికి తీవ్రమైన నష్టం. ఆయన మనకు భౌతికంగా దూరమైనా నిత్య నిర్బంధంలోనూ నీళ్లలో చేపలా కల్సిపోయి, వుద్యమాన్ని విస్తరింపచేయడానికి తను అందించిన విలువైన అనుభవాలు మన దగ్గర పదిలంగానే వున్నాయి. ఆ అనుభవాలనే ఆయుధంగా మలుచుకొని తనలోని పట్టుదలనూ, దృఢ దీక్షనూ, క్రమశిక్షణనూ అలవర్చుకొని వుద్యమానికి పునరంకితమవుదాం. కామ్రేడ్ ఆర్.సి. ఆశయాలకు మరణం లేదని చాటుదాం. ★

# పల్నాడు ప్రజాపోరులో చెరిగిపోని ముద్ర కామ్రేడ్ ప్రభాకర్

2008, నవంబర్ 5న గుంటూరు జిల్లా బొల్లాపల్లి అడవుల్లో గుంటూరు జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ మీసాల ప్రభాకర్ (వెంకటేష్)(40)ను కాల్చిచంపారు. గుంటూరు ఉద్యమ చరిత్రపై తన రెండు దశాబ్దాల విప్లవాచరణ ద్వారా చెరిగిపోని ముద్రను వేశాడాయన.

ఆయనది గుంటూరు జిల్లా బొల్లాపల్లి మండలం పమిడిపాడు గ్రామం. దళితుడిగా పుట్టిన కా. ప్రభాకర్ మొదటి నుండీ వ్యవసాయ పనులే చేశాడు. 1990లో తనకు పార్టీ పరిచయం అయింది. మొదట ఆర్.వై.ఎల్.లో పని చేశాడు. తర్వాత రైతుకూలీ సంఘంలో పని చేశాడు. తన చురుకైన ఆచరణ ద్వారా పార్టీ సభ్యుడై, ఆ తర్వాత గ్రామ సెల్ కార్యదర్శి అయ్యాడు. పది సంవత్సరాల పాటు గ్రామంలోనే వుంటూ గ్రామ రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషించాడు.

ప్రజల్లో నీళ్లల్లో చేపలా కలిసిపోతూ వారి విశ్వాసాన్ని చూరగొంటూ ప్రజా నాయకుడిగా ఎదిగి ప్రజలను పోరాటాల్లోకి విస్తృతంగా కదిలించాడు. తన నాయకత్వంలో అనేక పోరాటాలు విజయవంతం అయ్యాయి.

1992లో 100 ఎకరాల అటవీ భూమి ఆక్రమణ పోరాటానికి నాయకత్వం వహించాడు. ఈ భూమిని దళిత, వెనకబడిన తరగతులకు చెందిన 200 కుటుంబాలు పంచుకున్నాయి. అలాగే గ్రామంలోని 60 ఎకరాల దేవుని మాన్యం భూమిని కూడా ప్రజలు ఆక్రమించుకున్నారు. గుమ్మనంపాడు, మేళ్లవాగు, లాలిపురం తండా, రేమిడిచర్ల, వెంకటరెడ్డిపాలెం, చెంచుపాతర మొదలైన గ్రామాల్లో జరిగిన భూపోరాటాలకు సైతం కామ్రేడ్ ప్రభాకర్ నాయకత్వం వహించాడు. ఫారెస్టు గార్డ్‌కు వ్యతిరేకంగా జరిగిన పుల్లరి వ్యతిరేక పోరాటానికీ, 1992-93లో మహిళలు విస్తృతంగా కదిలిన సారా వ్యతిరేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించాడు. 1995లో దొమ్మర్లగొంది లిఫ్ట్ ఇరిగేషన్ కోసం మాచర్లకు ప్రజల్ని తరలించాడు. ఆయన నాయకత్వంలో 1996లో కరువుకు వ్యతిరేకంగా వినుకొండలో ప్రదర్శన చేశారు. 1997 గిట్టుబాటు ధరల కోసం పిడుగురాళ్ల, దాచేపల్లిల్లో ప్రదర్శనలు జరిగాయి.

పలు మిలిటరీ చర్యలకు సైతం ఆయన నాయకత్వం వహించాడు, స్వయంగా పాల్గొన్నాడు. ఆయన నాయకత్వంలో ప్రజా వ్యతిరేకుడైన కాకరగడ్డ సర్పంచ్ వీరయ్య కాళ్లు విరగ్గొట్టారు. 1993లో కామ్రేడ్ పులి అంజన్నను పోలీసులు పాశవికంగా హత్య చేసినపుడు బొల్లాపల్లి ఎం.ఆర్.ఓ. ఆఫీసును పేల్చివేసి ప్రజలు తమ కసిని వ్యక్తం చేశారు. కామ్రేడ్ జయపాల్ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా పిడుగురాళ్ల ఎం.ఆర్.ఓ. ఆఫీసును పేల్చివేశారు. ఇలాగే వివిధ సందర్భాల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈపూరు ఎం.ఆర్.ఓ. ఆఫీసును, మేళ్లవాగు ఫారెస్ట్ గెస్ట్ హౌజ్‌నూ, మేళ్లవాగు వద్ద బ్రిడ్జినీ పేల్చివేశారు.

అంతేకాదు గ్రామంలోని పలువురిని సంఘంలోకి కూడగట్టి సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేశాడు. పలువురిని దళాల్లోకి రిక్రూట్ చేశాడు. నిరుపేద కుటుంబంలో పుట్టినందువల్ల అతను 2వ తరగతి మాత్రమే చదువుకోగల్గాడు. తను సంఘంలోకి వచ్చిన తర్వాత వూళ్లో రాత్రి బడి ఏర్పాటు చేశాడు. తను కూడా బడికి వెళ్లి తన చదువును అభివృద్ధి చేసుకున్నాడు. రాజకీయాలు అధ్యయనం చేస్తూ ప్రజలకు చెప్పేవాడు. మరెన్నో పంచాయితీలకు నాయకత్వం వహించి పేద ప్రజల, మహిళల సమస్యల్ని పరిష్కరించాడు. కామ్రేడ్ ప్రభాకర్‌కు పెళ్లయింది. ఇద్దరు కూతుళ్లు కూడా వున్నారు. అయినప్పటికీ కుటుంబం గురించి ఆలోచించకుండా అనునిత్యం ప్రజల గురించే ఆలోచించేవాడు, ప్రజా పోరాటాల్లోనే మునిగిపోయేవాడు.

కామ్రేడ్ ప్రభాకర్ ఇలా చురుగ్గా విస్తృతమైన పోరాటాలకు నాయకత్వం వహించడం వలన అతనిపై పోలీసుల వత్తిడి పెరిగింది. అరెస్ట్ చేసి కేసులు పెట్టి జైల్లో పెట్టారు. అతని సోదరులమీదా, బంధుమిత్రుల మీదా నిర్బంధం పెరిగింది. ఒక సందర్భంలో తనతోపాటు 90 మందిపైన కేసుపెట్టారు. నష్టపరిహారం చెల్లించమన్నారు. మరొక కేసు 10 సంవత్సరాలు నడిచింది. వీటితోపాటు తనను లొంగిపొమ్మని అతని కుటుంబంపై వత్తిడి కూడా పెరిగింది. అయినప్పటికీ కామ్రేడ్ ప్రభాకర్ దేనికీ తలవంచలేదు.

వృత్తి విప్లవకారుడిగా 2001లో రహస్య జీవితంలోకి వచ్చాడు. అప్పటి నుండి వెంకటేష్ అనే పేరు స్థిరపడిపోయింది. కొన్నాళ్లు ఏరియా ఆర్గనైజర్‌గా పని చేశాడు. తర్వాత ఎల్.జి.ఎస్‌లో పని చేశాడు. 2003లో ఏ.సి. సభ్యుడయ్యాడు. 2007లో జిల్లా కమిటీ సభ్యుడయ్యాడు. ఈ కాలంలో పలు ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించాడు. ప్రజా వ్యతిరేకులకు శిక్షలు విధించాడు. పలు ప్రభుత్వ వ్యతిరేక చర్యల్లో పాల్గొన్నాడు.

2004లో సన్నిగళ్లు, గుత్తికొండ, జూలకల్లు, మర్రివేముల,

నరమాలపాడు, అడిగొప్పుల, గుమ్మనంపాడు, అరివేముల, పమిడిపాడు, షోలాయ్‌పాలెం, రావులాపురం గ్రామాల్లో భూపోరాటాలను నడిపి, భూపంపకానికి నాయకత్వం వహించాడు. 2005లో శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను ఉద్యమింపచేసి యాజమాన్యం మెడలు వంచి వేతనాలు పెరిగేట్టు చేశాడు.

2001లో రేమిడిచర్ల డెలిబరేట్ ఆంబుష్‌లో 10 మంది పోలీసులను మట్టికరిపించిన ఘటనలో తను పాల్గొన్నాడు. అదే సంవత్సరం నర్సరావుపేట కాలేజీలో తుపాకులను స్వాధీనం చేసుకున్న ఘటనలోనూ వున్నాడు. 2003లో బండ్లమోటు దగ్గర ఒకేరోజు రెండు ఆంబుష్‌లు జరిగాయి. రెండింట్లోనూ ఇద్దరు పోలీసులు హతమయ్యారు. పలువురు పోలీసులు గాయపడ్డారు. ఈ రెండు సంఘటనల్లోనూ కామ్రేడ్ ప్రభాకర్ పాల్గొన్నాడు. 2004లో అద్దంకి పోలీస్ స్టేషన్‌పైనా, 2005లో చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌పైనా జరిగిన దాడుల్లో పాల్గొన్నాడు. బండ్లమోటు వద్ద రాకెట్ లాంఛర్లు వేసిన దాడిలోనూ పాల్గొన్నాడు. సొరంగాలు తవ్వి మందుపాతరలు పెట్టడంలో మంచి నైపుణ్యం కల్గి వుండేవాడు. 2005లో జరిగిన మర్రివేముల ఎన్‌కౌంటర్లోనూ, 2006లో జరిగిన నకిరేకల్ ఎన్‌కౌంటర్‌లోనూ కామ్రేడ్ ప్రభాకర్ వున్నాడు. శత్రువుపైకి కాల్పులు జరుపుతూ తప్పుకున్నాడు. పెత్తందారు, రేపిస్టు అయిన నరమాలపాడు భూస్వామిని, జాలకల్లులో రేపిస్టుని, షోలాయ్‌పాలెంలో ఇన్‌ఫార్మర్‌ను, పుల్లల చెరువులో ప్రజాశత్రువును, పమిడిపాడులో ఇద్దరు ఇన్ఫార్మర్లను ఖతం చేయడంలో కామ్రేడ్ ప్రభాకర్ చురుకైన పాత్ర వహించాడు. ఇంకా నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రభుత్వ ఆస్తులనూ ప్రజావ్యతిరేకుల ఆస్తులను ధ్వంసం చేయడంలో, ప్రజా వ్యతిరేకులకు భౌతిక శిక్షలను విధించడంలో కా. ప్రభాకర్ చురుకైన భాగస్వామ్యం వహించాడు.

విప్లవకారులను చంపి వారి స్మృతి చిహ్నాలను నిర్మించుకోవడాన్ని కూడా నిషేధిస్తున్న నేటి పరిస్థితిలో అమరుల స్థూప నిర్మాణాలు చేయాలంటే పెద్ద పోరాటానికి సిద్ధపడాల్సి వస్తోంది. అలా ప్రజలను కదిలించి గండి గనుమల, బోడిపాలెం తండా, జాలకల్లు, గుడిపాటి చెరువు, అడిగొప్పులలో స్థూప నిర్మాణాలకు నాయకత్వం వహించాడు. పలుచోట్ల జరిగిన బహిరంగ సభలకు ప్రజలను విస్తృతంగా కదిలించాడు.

ఇలా ప్రజాపోరాటాలే ఊపిరిగా బతికిన కా. ప్రభాకర్ తాను విప్లవోద్యమంలో దృఢంగా నిలబడ్డమేగాక తాను రిక్రూట్ చేసిన వారినీ, తన సహచరులనూ తనతోపాటు సంఘంలో పనిచేసిన వారినీ దృఢంగా నిలబెట్టాడు. ఈ కారణంగా ఎంత నిర్బంధం వచ్చినా ఆ గ్రామం నుండి ఎవరూ లొంగిపోలేదు.

ఎ.పి.లో ఉద్యమం దెబ్బతినిపోయి చాలా మందిని జిల్లా నుండీ, మొత్తంగా రాష్ట్రం నుండే ఇతర ప్రాంతాలకు పంపించడంతో కొద్దిమందే మిగిలిన పరిస్థితి. వారిలోనూ కొందరు అమరులు కావడం, కొందరు అరెస్టులు కావడం, కొందరు దిగజారడంతో పార్టీతో ఆయనకున్న సంబంధాలు తెగిపోయాయి. ఈ విషయం శత్రువుకు తెల్సి లొంగిపొమ్మని వత్తిడి చేశాడు. కుటుంబంపై కూడా వత్తిడి పెంచాడు. అయినప్పటికీ ఎంతమాత్రం ఊగిసలాటకు గురికాకుండా విప్లవోద్యమాన్నీ, ప్రజలనూ దృఢంగా అంటిపెట్టుకున్నాడు. ఏ ఆశయం కోసం తన జీవితాన్ని అంకితం చేశాడో ఆ ఆశయాన్ని వీడలేదు. అమరుల ఆశయ సాధనకై ముందుకే నడిచాడు.

ఇలా 18 సంవత్సరాలపాటు విప్లవోద్యమంతో దృఢంగా నడిచిన కామ్రేడ్ ప్రభాకర్‌ను శత్రువు పట్టుకొని పాశవికంగా హత్య చేశాడు.

తనలోని కర్తవ్య దీక్షనూ, అంకిత భావాన్నీ, వర్గ కసినీ, దృఢ విశ్వాసాన్ని ఎత్తిపడుదాం. ఆయన ఆశయసాధనకై ప్రతిజ్ఞ చేద్దాం. నూతన సమాజాన్ని నిర్మిద్దాం. ★

*(...11వ పేజీ తరువాయి)*

పొందింది. ఆ తర్వాత ఆమె వివాహం మరొకరితో జరిగింది. కానీ అతను ఉద్యమాన్ని వీడి శత్రువు ముందు మోకరిల్లాడు. అయినప్పటికీ కామ్రేడ్ సరిత ప్రయాణం నిబ్బరంగా ముందుకే సాగింది. 2006లో కా. ఆర్.సి.తో తన జీవితాన్ని పంచుకుంది. వారిద్దరి జంట ఎ.పి. ఉద్యమానికి విలువైన అనుభవాలను అందించింది.

అలా మొదటి నుండీ నమ్మిన రాజకీయ విశ్వాసాల కోసం దృఢంగా నిలబడి, పరిస్థితులతో ఎదురీది, ఎ.పి. ఉద్యమంలో తనదంటూ ఒక ముద్రను వేసిన కామ్రేడ్ సరితను, ఆమె సహచరుడు కా. ఆర్.సి.తో పాటు పట్టుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి పోలీసులు హత్య చేశారు.

డి.కె.లోనూ, ఎ.ఒ.బి.లోనూ గడిపి సహచరులకు ప్రేమనూ, ఆప్యాయతను పంచి ఎ.పి. ఉద్యమం పట్ల అందరిలో ఆశలను చిగురింపజేసి తిరిగి వెళ్లిన నెల రోజులకే ఆ ప్రేమమూర్తిని కోల్పోయామని తెల్సి సహచరులంతా తల్లడిల్లిపోయారు.

కామ్రేడ్ సరితలోని గుండె నిబ్బరత్వాన్నీ, పరిస్థితులకు ఎదిరీదే పోరాట తత్వాన్నీ, ప్రేమాస్పద స్వభావాన్ని అలవర్చుకుందాం. ఆమె ఆశయ సాధనలో దృఢంగా నడుద్దాం. తన రక్తంతో తడిసిన ఆంధ్రప్రదేశ్ గడ్డపై ఉద్యమాలను రగిలింపచేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

# ఆంధ్రప్రదేశ్ ఉద్యమ వారసత్వానికి సగర్వమైన కొనసాగింపు కామ్రేడ్ సరిత

ఆంధ్రప్రదేశ్ ఉద్యమాన్ని పునరుద్ధరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన వారిలో కామ్రేడ్ సరిత గురించి కూడా ప్రముఖంగా చెప్పుకోవాలి. ఆమెను కోల్పోవడం ప్రస్తుత పరిస్థితిలో తీవ్రమైన నష్టం.

కామ్రేడ్ సరిత (35)ది మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామం. ఆమె అసలు పేరు జయ. 7వ తరగతి వరకూ చదువుకుంది. వాళ్లది ఉద్యమ ప్రభావం బాగా వున్న ఊరు. 1994లో ఆమె వ్యక్తిగత సమస్యతో దళాన్ని కల్సింది. ప్రేమించానని చెప్పి పెళ్లికి నిరాకరిస్తున్న వ్యక్తికి బుద్ధి చెప్పి తమ పెళ్లి జరిగేలా చూడమనే అభ్యర్థనను ఆమె దళం ముందుంచింది. దళం నచ్చజెప్పడంతో అతను పెళ్లికి సిద్ధపడ్డాడు. కానీ దళంతో ఏర్పడిన సాన్నిహిత్యంవల్లా, దళం చెప్పిన రాజకీయాల వల్లా కా. సరిత తన వ్యక్తిగత సమస్యను సామాజిక కోణం నుంచి అర్థం చేసుకుంది, తాను కూడా ఇటువంటి సమస్యలను పరిష్కరించే సామాజిక కృషిలో భాగం కావాలని నిర్ణయించుకుంది. కాబట్టి అతను కూడా పార్టీలోకి వస్తే పెళ్లి చేసుకుంటాననీ, లేకుంటే ఎవరి దారి వారిదని తేల్చి చెప్పింది. అతను పార్టీలోకి రావడానికి సిద్ధపడలేదు. దానితో కామ్రేడ్ సరిత తాను నమ్మిన విశ్వాసాలకు కట్టుబడి ఉండడం కోసం అతనితో పెళ్లి ఆలోచనను విరమించుకుని దళంలో చేరింది.

మొదట నర్సాపూర్ దళంలో దాదాపు మూడేళ్లు పని చేసింది. మెదక్ జిల్లాలో, నిత్య నిర్బంధంలో చురుగ్గా, దృఢంగా పని చేసిందామె. 1998లో ఇందూప్రియల్ దళానికి బదిలీ అయింది. బదిలీ అయిన కొద్ది కాలానికి ఆ దళం శాక్‌లో సభ్యురాలయింది. అక్కడ ఆమె మహిళా రంగంలో పని చేసింది. మహిళలను సమీకరించడంలో, సంఘటితం చేయడంలో, సమస్యల పరిష్కారానికి ఉద్యమింప చేయడంలో చురుకైన పాత్ర వహించింది. ఇందూప్రియల్ దళంలో మూడేళ్లు పని చేసిన తర్వాత ఆమె తిరిగి నర్సాపూర్ దళానికి కమాండర్‌గా బాధ్యతలను స్వీకరించింది.

2001లో పార్టీ ఆమెను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేసింది. జిల్లాలోని అచ్చంపేట దళానికి కమాండర్‌గా పని చేసింది. కొద్దికాలం క్రిష్ణానది ఒడ్డున వుండే రివర్‌బెల్ట్ దళానికి కమాండర్‌గా పని చేసింది. ఆ తర్వాత జిల్లా మహిళా ఉద్యమ బాధ్యతలను స్వీకరించింది. అందులో భాగంగా మహిళా ఉద్యోగినులను చురుగ్గా సంఘటితం చేసింది. జిల్లాలో పలు పోరాటాలకు నాయకత్వం వహించింది.

2006లో డి.సి. సభ్యురాలిగా ప్రమోట్ చేసి పార్టీ ఆమెను పట్టణోద్యమంకు బదిలీ చేసింది. అప్పటికి నిప్పులు చెరుగుతున్న నిర్బంధం, బలహీనపడుతున్న ఉద్యమం, వరసగా భారీ స్థాయిలో జరుగుతున్న నష్టాలు, దిగజారడాలు, ద్రోహాలు... ఈ పరిస్థితుల్లోనూ నిబ్బరంగా నిలబడి పార్టీ ఇచ్చిన బాధ్యతలను స్వీకరించి అడుగడుగునా విస్తరించిన శత్రువు సమాచార వ్యవస్థ నడుమనే చాకచక్యంగా తిరుగుతూ విజయవాడ, గుంటూరు జిల్లాల్లో రహస్యంగా పార్టీని నిర్మించింది. పలు రంగాల్లో విశేషమైన కృషి చేసి ఎంత నిర్బంధం నడమనైనా పని చేయగలమనే విశ్వాసాన్ని పార్టీకీ, ప్రజలకూ ఇచ్చింది.

2008లో ఉద్యమావసరాల రీత్యా ఎ.ఒ.బి.లోనూ, డి.కె.లోనూ కొద్ది రోజులు గడిపింది. ఆ సమయంలో అందరికీ ఆమె శశి పేరుతో పరిచయం. ఆమెలో కనబడిన ఎంతో ఉత్సాహం, తపన, ఆప్యాయత అందర్నీ ముగ్ధుల్ని చేసింది. నిత్య నిర్బంధంలో పని చేస్తూ అక్కడి ప్రజలకు విశ్వాసాన్ని కల్పించడమేగాక ఎ.ఒ.బి., డి.కె. కామ్రేడ్స్‌కు కూడా ఎ.పి. ఉద్యమాన్ని తిరిగి రగిలిస్తామనే సంకేతాల్నిచ్చి వెళ్లింది. పది సంవత్సరాల తర్వాత కలిసిన ఇద్దరు మహిళా కామ్రేడ్స్‌తో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకుంది. ఆంధ్ర ఉద్యమం ఎంతో నష్టపోయినా ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్నారని, విప్లవ ప్రజలు తమను కళ్లల్లో పెట్టుకుని కాపాడుకుంటున్నారని గొప్పగా చెప్పింది.

తన చురుకుదనంతో, పట్టుదలతో, క్రమశిక్షణతో ఎటువంటి గడ్డు పరిస్థితుల్లోనయినా పనులు చక్కబెట్టుకురాగల చాకచక్యం ఆమెలో మెండుగా వుండేవి. కేడర్‌తో, ప్రజలతో సన్నిహితంగా, ప్రేమగా మెదులుతూ వారిపై చెరిగిపోని ముద్రవేసేది. రాజకీయ అధ్యయనం పట్ల శ్రద్ధపెట్టేది. సమిష్టి అధ్యయనంలో కేడర్‌కు రాజకీయాలు బోధించేది. ఆమె మంచి గాయని, వక్త కూడా.

పరిస్థితులను నిబ్బరంగా ఎదుర్కొనే తత్వం ఆమెది. ఒకసారి అవసరాలరీత్యా దళం నుంచి విడిపోయి వెళ్తున్నప్పుడు ఒక ద్రోహి ఆమెను అత్యాచారం చేసి చంపడానికి పథకం పన్నాడు. ఆ సమయంలో నిరాయుధంగా వున్న ఆమె, ఆ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొని, చాకచక్యంతో ఆ ద్రోహి నుండి తప్పించుకొని, ప్రజల సహకారంతో తిరిగి దళాన్ని కలిసింది.

అదే నిబ్బరంతో వ్యక్తిగత జీవితంలో సంభవించిన ఆటుపోట్లను సైతం ఎదుర్కొంది. కామ్రేడ్ సరిత దళంలో చేరిన కొద్ది నెలల తర్వాత కామ్రేడ్ సమ్మన్నను పెళ్లి చేసుకుంది. 1999లో కా. సమ్మన్న ఒక ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు. ఉద్యమంతో మరింతగా మమేకం అవడం ద్వారానే ఆ గుండెకోత నుండి ఉపశమనం

*(మిగిలాది 10వ పేజీలో...)*

# నల్లమల ఎర్ర మందారం కామ్రేడ్ అశోక్

2009, జనవరి 15న నల్లమల అటవీ ప్రాంతంలో పుల్లల చెరువు వద్ద కామ్రేడ్ అశోక్‌ను పట్టుకొని కాల్చిచంపి ఎ.పి. పోలీసులు మరోసారి ఎన్‌కౌంటర్ కట్టు కథ అల్లారు.

కామ్రేడ్ అశోక్ అసలు పేరు జానా బాబూరావు. 45 ఏళ్ల వయసు వుంటుంది. తనది ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం సమీప గ్రామం. చెంచులకు తోబుట్టువులుగా చెప్పుకునే యానాది తెగకు చెందినవాడు. పెళ్లయి పిల్లలు పుట్టిన తర్వాతనే తనకు విప్లవోద్యమం పరిచయం అయింది. అయినప్పటికీ కుటుంబాన్ని తన విప్లవాచరణకు ఆటంకంగా భావించలేదు. 1990లో పూర్తికాలం కార్యకర్తగా దళ జీవితంలోకి వచ్చాడు. ఆ తర్వాత తన కుటుంబాన్ని కూడా విప్లవోద్యమంలోకి తీసుకొచ్చాడు.

పూర్తికాలం కార్యకర్తగా వచ్చినప్పటి నుండీ దాదాపు రెండు దశాబ్దాల పాటు అలుపెరగకుండా శ్రమించాడు. నల్లమల ప్రాంతంలో జరిగిన వెదురు, తునికాకు కూలీరేట్లు, భూపోరాటాలు, గిట్టుబాటు ధరల పోరాటాల్లోకి ప్రజల్ని సమీకరించాడు. చెంచు ఆదివాసీల ప్రత్యేక సమస్యలపై చేసిన ర్యాలీల్లో ప్రజలను కదిలించాడు.

కా. అశోక్‌కు ప్రజలతో సజీవ సంబంధాలు వుండేవి. లోపల, బయట పనులను సమన్వయించడంలో విస్తృతమైన ప్రజా సంబంధాలను కల్గి వుండడంలో అమరుడు కామ్రేడ్ క్రిష్ణ తర్వాత అశోక్‌నే చెప్పుకోవాలి. కా. అశోక్ చదువుకున్నది తక్కువే అయినా ప్రజల్ని చదివి నాయకత్వానికి అర్థం చేయించిన పోరు గురువు. ప్రజల తప్పుల ఎడల విప్లవకారులు ఎలా వ్యవహరించాలో అనేకసార్లు అర్థం చేయించి సెక్టేరియన్ తప్పుల నుండి పార్టీని కాపాడాడు. ప్రజలు కూడా కామ్రేడ్ అశోక్‌ను ఆత్మీయుడిగా భావించేవారు.

రాష్ట్ర కమిటీ అవసరాల కోసం పని చేసిన ఒక ప్రొటెక్షన్ దళానికి కామ్రేడ్ అశోక్ కమాండర్‌గా వున్నాడు. నల్లమల అడవి అతనికి కొట్టిన పిండి. అందువల్ల నిత్య నిర్బంధంలో దారుల్లో నడవకుండా జాగ్రత్తలు తీసుకొని నాయకత్వాన్ని కాపాడాడు. ప్రజలతో వున్న సంబంధాలు కష్టించే స్వభావం వల్ల కష్ట కాలంలో ఎన్నో పనులను చక్కబెట్టగల్గాడు. తన మీద ఆధారపడి ఏ క్యాంపునైనా విజయవంతం చేయవచ్చన్న భరోసాను నాయకత్వానికి కల్గించాడు. ఒకరిద్దరు సభ్యులను వెంటబెట్టుకొని వెళ్లి అధిక బరువులు మోస్తూ, కొండలెక్కుతూ దిగుతూ బాధ్యతలు నిర్వర్తించేవాడు.

కామ్రేడ్ అశోక్ స్నేహశీలి. ప్రజలు, క్యాడర్, నాయకత్వంతో ఆత్మీయంగా వుండేవాడు. అవసరమైన కామ్రేడ్స్‌కు సహకరించడంలో ముందుండేవాడు. క్యాడర్ పట్ల ఓపికగా వ్యవహరించేవాడు. నాయకత్వం పట్ల నమ్రతను కల్గివుండేవాడు. అలా అందరికీ కామ్రేడ్ అశోక్ ఆత్మీయుడయ్యాడు.

ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో జరిగిన సున్నిపెంట, ఎర్రగొండపాలెం లాంటి పలు దాడుల్లో, ఆంబుష్‌లలో, శత్రువుతో జరిగిన ఎన్‌కౌంటర్లలో, నిర్బంధానికి నిరసనగా జరిగిన మిలిటెంట్ చర్యల్లో కామ్రేడ్ అశోక్ ముందుండేవాడు.

రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడంలో శ్రద్ధ పెట్టేవాడు. నిత్య నిర్బంధంలో, అనేక పనులను చక్కబెడుతూనే దొరికిన కొద్ది సమయంలో చదువుపై శ్రద్ధ పెట్టేవాడు. చెంచుల సంస్కృతిపై అతనికి లోతైన అవగాహన వుండేది. ఆ సంస్కృతిని తెలుసుకోదల్చిన కామ్రేడ్స్‌కు ఎంతో ఆసక్తిగా ఎన్నో విషయాలు చెప్పేవాడు. అలా చెప్తున్నప్పుడు తన గొంతులో ఆ ప్రజల పట్ల ఒక ఆత్మీయత, సౌహార్ధత తొణికిసలాడేది. కా. అశోక్ తన స్పందనలను అక్షరీకరించడానికి ఎంతో కృషి చేసేవాడు. స్పందనలు, కవితలు రాసేవాడు. ఆ రచనలను తోటి కామ్రేడ్స్‌కు వినిపించి మెరుగులు దిద్దుకోవడానికి తపన చెందేవాడు.

ఇలా కామ్రేడ్ అశోక్ నిరంతరం నేర్చుకుంటూ, నేర్పుతూ విప్లవోద్యమంలో దృఢంగా నిలబడ్డాడు. ఎ.పి.లో ఉద్యమం తాత్కాలికంగా దెబ్బతిని దళాలన్నీ రిట్రీట్ అయిన తర్వాత కూడా చాలా కాలంపాటు ప్రజలపై ఆధారపడుతూ అక్కడే కొనసాగాడు. ఉద్యమపరంగా, వ్యక్తిగతంగా ఎన్ని ఇబ్బందులు ఎదురుపడినా ఎన్నడూ వెనుకడుగు వెయ్యలేదు. శత్రువు చేతికి చిక్కినా తలవంచని యోధుడిగా వీరమరణం చెందాడు. కామ్రేడ్ అశోక్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ★

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

# దేశవ్యాప్తంగా ప్రజల్ని నిర్వాసితుల్ని చేస్తున్న సెజ్‌లను వ్యతిరేకిద్దాం!
# సింగరేణి ఓపెన్‌కాస్టు గనులకు వ్యతిరేకంగా మిలిటెంట్ ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దాం!!
# ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణా కోసం పోరాడుదాం!!!

తెలంగాణా జిల్లాలయిన ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలోని గోదావరి లోయ అంతటా ఓపెన్ కాస్టు గనులే రానున్నాయి. రానున్న 5,6 సంవత్సరాలలో ఈ ప్రాంతాల రూపు రేఖలు మారిపోనున్నాయి. పెద్ద విధ్వంసం జరుగనుంది. సింగరేణి యాజమాన్యం అమలుచేస్తున్న 'ఓపెన్‌కాస్టు' బొగ్గు గనుల నుండి బొగ్గు వెలికితీత కార్యక్రమం ద్వారా వేలాది చదరపు కిలోమీటర్లు ఏడారిగా మారనున్నాయి. దాదాపు వందలాది గ్రామాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ఓపెన్‌కాస్టు గనులకు బలవుతున్నాయి. గత 15 సంవత్సరాలుగా 11 ఓపెన్‌కాస్టు గనులను ప్రతిపాదనలో పెట్టి, వాటి అమలుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నది. ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ, ఉదారీకరణ విధానాలు ప్రపంచ వ్యాప్తంగా పీడిత ప్రజలలో పెను సంక్షోభం సృష్టించి, ప్రజల మూలుగలను పీలుస్తున్న విషయం మన కళ్లముందు కనబడుతున్నది. ఈ నూతన ఆర్థిక సంస్కరణలు, సింగరేణిలో 'న్యూ కోల్ పాలసీ'లో భాగంగా సింగరేణి యాజమాన్యం బొగ్గును వెలికితీయడమే ప్రధాన విధానంగా పెట్టుకొని అండర్ గ్రౌండ్ గనులకు తిలోదకాలిచ్చి ఓపెన్ కాస్టు గనులను ఏర్పాటుచేసి గుత్త పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు, కోస్తాంధ్ర కాంట్రాక్టర్లకు లీజుకిచ్చి అతి చౌకగా బొగ్గును ఉత్పత్తి చేస్తూ అభివృద్ధి పేరుతో లక్షలాది తెలంగాణా ప్రజల జీవితాలను కబలిస్తున్నది.

తెలంగాణా పోరాటాల చరిత్ర కలిగిన గడ్డ. జమీందారులు, జాగీరుదారులు, దేశ్‌ముఖులు, మక్తెదారులు, వతన్‌దారులు, భూస్వాముల కబంధ హస్తాల్లో నలిగిపోయి ఎన్నో పోరాటాలు చేసిన విప్లవాల గడ్డ. తెలంగాణాను మరో ఐదు సంవత్సరాల వరకు వనరుల దోపిడికి పీడనకు, వివక్షకు, అవమానాలకు గురిచేయాలని వై.ఎస్.ఆర్., కాంగ్రెసు పార్టీ కుట్ర చేస్తున్నది. తెలంగాణ భూములు కోస్తా భూస్వాముల పెట్టుబడిదారుల పరమవుతున్నాయి. సింగరేణి ఓపెన్‌కాస్టు నెపంతో ఊర్లకు ఊళ్లు ఖాళీ చేయిస్తున్నారు. చక్కని భూమంతా గోతులు గోతులు చేస్తూ బొందలగడ్డగా మారుస్తున్నారు. తెలంగాణాకిచ్చిన హామీలన్నీ గల్లంతయ్యాయి. 610 జీవో గంగలో కలిసింది. గత 5 దశాబ్దాలుగా ఇదే దగా జరుగుతున్నది. తెలంగాణా భూములకు సాగునీరు ఇవ్వకుండా పులిచింతల, పోలవరం, దుమ్ముగూడెం, పోతిరెడ్డిపాడు కట్టి లక్షలాది తెలంగాణా ప్రజలను నిర్వాసితులను చేస్తున్నారు. అందుకే కోస్తాంధ్ర సంపన్న వర్గాల దోపిడీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణా ఉద్యమం పుట్టింది. తెలంగాణా రాష్ట్ర ఆకాంక్ష, అభివృద్ధికి సంబంధించినది మాత్రమే కాదని, ఇది తెలంగాణా ప్రజల స్వయం పాలన కోసం, తెలంగాణా ప్రజల భాషా, సంస్కృతుల పరిరక్షణ కోసం, తెలంగాణా వనరుల రక్షణకొరకు, కోస్తాంధ్ర పాలకుల పెత్తనం నుండి విముక్తిని కోరుకుంటూ సాగుతున్న న్యాయమైన ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమం.

సింగరేణి కాలరీస్‌కు 120 సంవత్సరాల చరిత్ర వుంది. ఈ 120 సంవత్సరాల్లో జరగని విధ్వంసం రానున్న 5 సంవత్సరాలలో ఓపెన్ కాస్టు గనుల రాకతో జరుగనుంది. వేల పల్లెలు మట్టి దిబ్బలుగా మారే పరిస్థితి నెలకొన్నది. ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు నేలకూలనున్నాయి. వేలాది ప్రజలు, ఆదివాసీ ప్రజలు, పేద రైతులు, రైతుకూలీల కుటుంబాలు రోడ్ల మీదికి రానున్నాయి. పల్లె వాతావరణం, అటవీ ప్రాంతం అంతా స్మశానంగా మారనుంది. ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు ధ్వంసం కానున్నాయి. ఇంత విధ్వంసం జరిగే ఓపెన్‌కాస్టు గనులు తమకు అక్కరలేదని ఈ ప్రాంత ప్రజలు, ఆదివాసులు మొత్తుకుంటున్నా అడ్డుకునే సర్కారీ ప్రజా ప్రతినిధులు కనిపించడం లేదు. దీంతో తెలంగాణా ఉద్యమ సంస్థలు, పర్యావరణ ప్రేమికులు, ఓపెన్‌కాస్టు గనులను వ్యతిరేకించే ప్రజాసంఘాలు మాత్రమే జనం వద్దకు వస్తున్నాయి. కానీ ప్రజలలో తిరుగుతూ వారి ఓట్లతో గద్దెలను ఎక్కిన ఎం.ఎల్.ఎ.లు కానీ, ఎం.పి.లుకాని, అధికారంలో వున్న మంత్రులుగాని ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రాజకీయ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయి.

## పాత రోజులే బాగుండేవి - ఓ రిటైర్డ్ సూపర్‌వైజర్ ఆవేదన

బొగ్గు బావులలో పాత రోజులే బాగుండేవి. ఇపుడు కొత్త బావులు అసలుకే వస్తలేవు. వచ్చినా ఓపెన్‌కాస్టు గనులు వస్తున్నాయి. వాటిలో ఉద్యోగాలే లేవు. ఊర్లను మట్టిదిబ్బలు చేసే ఓపెన్‌కాస్టు బావులు వస్తున్నాయి. అప్పట్లో మనిషికి మనిషి ఆసరా వుండేది. ఇప్పుడు ఆ ఆసరాలేదు... మానవత్వ విలువలు లేవు... ఎవరికి వారే యమునా తీరే... అంటూ వాపోతున్నాడు సింగరేణి రిటైర్డు సూపర్‌వైజర్ డి. నర్సయ్య. ఈయనకు 43 సంవత్సరాలు సింగరేణి కాలరీస్‌లో పనిచేసి రెండేళ్ల క్రితం పదవీవిరమణ చేసాడు.

## కష్టం పెరిగింది... రక్షణ కరువయింది

ఇపుడు కష్టం బాగా పెరిగింది. రెగ్యులేషన్ ప్రకారం బావులు నడవాలని ఎవరూ వాదించే పరిస్థితిలేదు. 8 మంది చేసే పనిని 4గురితో చేపిస్తున్నారు. రెండు గంటలు ఎక్కువ పని చేయిస్తే అప్పట్లో ఓవర్‌టైం ఇచ్చేవారు. ఇపుడు అదీలేదు. 18 నెలలు శిక్షణ పొంది మైనింగ్ సర్దార్ పనికి వచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బావిలో గాలి, నీరు కరువయ్యాయి. సౌకర్యాలన్నీ చూసే సేఫ్టీ ఆఫీసర్ సేఫ్టీకి బదులుగా ఇతర పనులు చేస్తున్నాడు. కార్మికుల సంఖ్యను విపరీతంగా తగ్గించారు. 1 లక్షా 20 వేల మంది కార్మికుల నుండి 70 వేల మంది కార్మికులకు తగ్గించారు. 1969లో తెలంగాణా ఉద్యమం రావడం వల్ల సింగరేణిలో చదువుకున్న వారు కాస్త ముందుపడ్డారు. బొగ్గు అవసరాలు సరే... జనాన్ని బొందపెట్టి బావులు తవ్వుతారా... గతంలో కనీసం ఒక బాయి పడుతుందంటే ఆ ఊర్ల, ఆ చుట్టుపక్కల ఉన్నవారికి ప్రారంభంలోనే పని దొరికేది... ఇప్పుడు ఊర్లకు ఊర్లే ముంచేసి ఓపెన్‌కాస్ట్ బావులు పెడుతామంటున్నారు... అంత ఓపెన్‌కాస్టు బాయి అవసరమే అయితే ఇంటికో ఉద్యోగం ఇచ్చి మరో ఊరును తయారు చేసి ఇవ్వాలి... కానీ అదేం జరుగతలేదు. ఇంత అన్యాయమయితే ఎట్లా? దీనిని అడ్డుకొని న్యాయం చేయాలే అని డి. నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

## సింగరేణిలో 103 శాతం ఉత్పత్తి

సింగరేణి కాలరీస్‌కు 2008 ఏడాది అన్ని విధాలుగా కలిసి వచ్చింది. 2008, డిసెంబర్ 31 నాటికి సింగరేణి క్వారీస్‌లో 103 శాతం ఉత్పత్తి సాధించారు. 7 డివిజన్లలో వంద శాతంకు పైగా లక్ష్యాలను అధిగమించారు. కొత్తగూడెం ఏరియాలో 50 లక్షల టన్నులు, ఇల్లందులో 26 లక్షల టన్నులు, మణుగూరులో 51,32,246 టన్నులు, రామగుండం ఒక డివిజన్‌లో 37,24,750 టన్నులు, బెల్లంపల్లిలో 2859759 టన్నులు, మందమర్రిలో 14,13,391 టన్నులు సాధించారు.

రామగుండం-2లో 92 శాతం, భూపాలపల్లిలో 97 శాతం, శ్రీరాంపూర్‌లో 100 శాతం సాధించి సింగరేణిలో సగటున 103 శాతం ఉత్పత్తి జరిగింది.

2009లో అత్యుత్తమ రక్షణ విలువలను పాటించి సింగరేణిని ప్రమాదరహిత సంస్థగా తీర్చిదిద్దుతామని సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. నర్సింగరావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో (2008, డిసెంబర్ 28) జరిగిన 43వ సింగరేణి రక్షణ వారోత్సవాల కేంద్ర ముగింపు బహుమతి ప్రధానోత్సవంలో ఆయన ప్రసంగించారు. సింగరేణి ఆస్ట్రేలియా, దక్షిణ ఆఫ్రికా, అమెరికా లాంటి దేశాలకు పోటీగా రక్షణతో కూడిన ఉత్పత్తిని తీసుకొని వెళ్లాలని ప్రయత్నాలు చేస్తుందని, ఆ స్థాయిలో సింగరేణి ఎదగాలని తాము భావిస్తున్నామన్నారు. ఇటీవల ఓపెన్‌కాస్టు గనులలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే ఆందోళన, బాధ కలుగుతుందన్నారు.

## ప్రపంచబ్యాంకు నేతృత్వంలో సింగరేణిలో న్యూ కోల్ పాలసీ అమలు

సింగరేణిలో నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు అమలు జరుపుటకు భూగర్భ గనులన్నీ నష్టాలతో నడుస్తున్నాయనీ, లాభాలు రావడం లేదని సింగరేణి 'బి.ఐ.ఎఫ్.ఆర్.' పోయే ప్రమాదం వుందని ఒక పథకం ప్రకారం అసత్య ప్రచారం కొనసాగించారు. 1997 జనవరి నుండి సింగరేణి సంస్కరణలు మొదలుపెట్టింది. సింగరేణిలో సంస్కరణల అమలు మూలంగా (1) గత 10 సంవత్సరాల కాలంలో కార్మికుల బతుకులు, జీవన స్థితిగతులు హృదయ విదారకంగా మారాయి. 2006 వరకు అమలు జరిగిన సంస్కరణల వలన అధికారుల సంఖ్య పెరిగింది. ఉత్పత్తి పెరిగింది. ప్రమాదాలు పెరిగాయి. అండర్ గ్రౌండ్ గనుల బదులు ఓపెన్‌కాస్టు గనుల మూలంగా కార్మికుల సంఖ్య 1 లక్షా 20 వేల నుండి 70 వేలకు కుదించబడింది. కార్మికుల జీవన ప్రమాణాలు కూడా తగ్గాయి. సింగరేణి ప్రాంతంలో నిరుద్యోగం శరవేగంతో పెరుగుతున్నది. ఉన్న ఉద్యోగాలకు భద్రత లేదు. (2)మరోవైపు సింగరేణి ప్రాంతంలో ఓపెన్‌కాస్టుల మూలంగా వందలాది గ్రామాల ప్రజలు భూములు కోల్పోయి లక్షలాది మంది ప్రజలు నిర్వాసితులయ్యారు.

బహుళజాతి సంస్థల అండదండలతో సింగరేణిలో ఆంధ్ర పెట్టుబడిదారుల దోపిడి కొనసాగుతున్నది. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా సరాసరి ప్రపంచబ్యాంకు నుంచి పెట్టుబడులు, రుణాలు తెచ్చి గత తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఒప్పందాలను శీఘ్రగతిన అమలుపరుస్తున్నారు.

## ఓపెన్‌కాస్టు గనులకు వ్యతిరేకంగా ప్రజల నిరసన

ఆదివాసీ ప్రజల రైతాంగ జీవితాలను అతలాకుతలం చేస్తూ విధ్వంసాలు సృష్టిస్తున్న సింగరేణి ఓపెన్‌కాస్టుల ఏర్పాటుకు వ్యతిరేకంగా తెలంగాణా ఐక్యకార్యాచరణ కమిటీ, మానవహక్కుల వేదిక, తెలంగాణా సింగరేణి ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ప్రచార యాత్రలు చేపట్టింది. ఈ ప్రచార యాత్ర తిర్యాని మండలం డోర్లి ఓపెన్‌కాస్టు నుండి ప్రారంభం అయింది (నవంబర్ 2008).

డోర్లి-1 పునరావాస గ్రామంలో నల్లజెండాలు చేతబూని ప్రదర్శనలు చేపట్టారు. డోర్లి, కైరిగూడ, అబ్బాపూర్ ఓపెన్ కాస్టును సందర్శిస్తూ, సింగరేణి ఓపెన్‌కాస్టులను నిలిపివేయాలనీ, మా భూమి-మా నీరు-మాకే కావాలని, అభివృద్ధి కావాలి, వినాశనం కాదు, బొగ్గు గనుల కోసం భూసేకరణ నిలిపివేయాలంటూ పెద్ద ఎత్తున నినదిస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసారు. ఈ ప్రచార యాత్ర డోర్లి నుండి దంతెన్‌పెల్లి, నంబాయిగూడెం, ఆరె గూడెం, కైరిగూడ, అబ్బాపూర్ నుండి గోలేటి వరకు అక్కడి నుండి బెల్లంపెల్లి, కాసీపేట వరకు వచ్చి మొదటి రోజు ముగిసింది. కాసీపేట ప్రజలు వ్యతిరేకించడంతో ఓపెన్‌కాస్టును ఏర్పాటును సింగరేణి రద్దు చేసుకుంది.

రెండవ రోజు కాసీపేటలో విజయోత్సవ సభ జరిపి శ్రావన్‌పెల్లి, వెంకటాపూర్, మామిడిగట్టు ప్రాంతాలను పర్యటించారు. శ్రావన్‌పల్లి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టువలన సుమారు 4 వేల ఎకరాల మామిడి తోటలు, 2 వేల ఎకరాల వరి పొలాలతో పచ్చగా పరుచుకొని వున్నవి నాశనం అవుతాయి. శ్రావన్‌పల్లి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు వల్ల మెజారిటీ ప్రజలు దళితులు, ఆదివాసులు. ప్రభుత్వాన్ని ఫ్లైఓవర్ బ్రిడ్జీలుగానీ, హైటెక్ సిటీలుగానీ, అధునాతన ఆటస్థలాలనుగానీ అభివృద్ధి పేరుతో అడుగని ఇక్కడి ప్రజలు మామిడి తోటలను పెంచుకుంటూ వెలకట్టలేని పర్యావరణ రక్షణ పాటుపడుతున్నారు. దసరి, బంగనపల్లి వంటి మామిడి పండ్లను మేలురకమైన ఫలసాయాన్ని పండిస్తున్నారు. విస్తారమైన పశుపోషణతో పాల ఉత్పత్తిని సాధిస్తున్నారు. తమ శ్రమతో బతుకుతున్నారు. శ్రమ ఫలాలను పది మందికి పంచుతున్నారు. ఆ ప్రాంతంలో వున్న వేలాది మంది ప్రజలకు ఉపాధి వనరులుగా వున్నాయి. 'కొలువులు కోల్పోతున్నచోట-గ్రామాలు అదృశ్యమైనచోట రికార్డుస్థాయి బొగ్గు ఉత్పత్తి మాటకు చోటు ఎక్కడిది? ఇక్కడి బొగ్గు ఎక్కడికి? ఇక్కడి బొగ్గు ఎక్కడి నుండి, ఎవడింటికి వెలుగునిస్తుంది? స్థానికునికా, స్థానికేతరునికా?' బొగ్గు ఖనిజాన్ని కడుపులో దాచుకున్న తెలంగాణాలోని అన్ని కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో ఇవే ప్రశ్నలు అడుగుతున్నారు. ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు తెలంగాణలోని స్థానికులను సమూలంగా సంహరిస్తున్న భారీ 'రాక్షసి'. అదే క్రమంలో పాలకులకు

# విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న అమరవీరుల చరిత్రలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక మీరు అమరవీరుల చరిత్రలు రాసేటప్పుడు కింది అంశాలు దృష్టిలో పెట్టుకోగలరు.

అమరుల సొంత పేరు, పార్టీ పేరు; వయసు; జిల్లా, గ్రామం; గ్రామ, ప్రాంత రాజకీయ నేపథ్యం; కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యం; చదువు, వృత్తి; పార్టీకి పరిచయమైన, రిక్రూట్ అయిన సంవత్సరం, రిక్రూట్ అయిన రంగం; ఉద్యమంలోకి రావడానికి దోహదం చేసిన నేపథ్యం; పార్టీ సభ్యత్వం పొందిన సంవత్సరం; ఏయే సంవత్సరం, ఏయే దళాల్లో, ప్రాంతంలో, బాధ్యతల్లో, స్థాయిల్లో పని చేసినది; పోరాటాలూ, ప్రతిఘటన, ఎన్‌కౌంటర్లలో నిర్వహించిన పాత్ర; రాజకీయ రంగంలో కృషి; అధ్యయనం, బోధన వంటి అంశాల్లో వున్న సామర్థ్యాలు; కళా, సాహితీ, టెక్నికల్ వంటి రంగాల్లో అభిరుచీ, కృషి; వ్యక్తిగత జీవితం, స్వభావం; అమరత్వపు తేదీ, నెల, సంవత్సరం; అమరత్వపు ఘటన వివరాలు వంటి అంశాలు వచ్చే విధంగా క్లుప్తంగా రాయగలరు.

అమరుల చరిత్రతో పాటు ఫోటో (వుంటే) తప్పక జత చేయండి. ఫోటో వెనుక పేరు రాయాలి.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

దగ్గరయిన ఆంధ్ర కమ్మ, రాయలసీమ రెడ్డి కాంట్రాక్టర్లకు కాసుల మూటలను పంచుతున్న కల్పతరువు.

సింగరేణి ప్రాంతంలో ఓపెన్ కాస్టు విస్తరణతో ప్రజల హక్కులను, జీవించే హక్కును హరిస్తున్నారని సాగిన యాత్రలో సింగాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని తాళ్లపల్లి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు గ్రామలైన సింగాపూర్, తాళ్లపల్లి, తీగల్‌పాడ్, రామారావుపేట, టేకుమట్ల తదితర పంచాయితీ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఓపెన్‌కాస్టుల వల్ల పర్యావరణ సమస్యతోపాటు తమ ఇండ్లు కూలిపోతాయని, పంట భూములు బీడులుగా మారుతాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ జిల్లా భూపాల్‌పల్లి ప్రాంతంలో ఆరు బొగ్గు గనులు వుండగా, ఈ ప్రాంతంలోనే భూగర్భంలో బొగ్గు అపారంగా వున్నదనే వాస్తవాన్ని గ్రహించిన సింగరేణి యాజమాన్యం పెద్దాపూర్, మంజూర్‌నగర్ ఓపెన్ కాస్టు గనుల ద్వారా బొగ్గు వెలికితీతకు శ్రీకారం చుట్టి ప్రజల జీవితాలను ఛిద్రంచేయ ప్రయత్నిస్తున్నది. భూపాల్‌పల్లికి 10 కి.మీ. దూరంలో వున్న పెద్దాపూర్, జంగుపెల్లి, పెర్కపల్లి, మాదారపుపల్లి, భస్వరాజ్‌పల్లి, మంజూర్‌నగర్, పెద్దకుంటపల్లి, పూల్లూరు రామయ్యపల్లి, కాసీంపల్లి, ఉగ్గంపల్లి, జంగేడు, పరిసిర ప్రాంతాల్లో ఓపెన్ కాస్టు గనులను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసింది. దీని మూలంగా వేలాది ఎకరాల పంట పొలాలు, వందలాది ఎకరాల చెరువులు, కుంటలు, కాలువలు దశాబ్దాల తరబడి నివసిస్తున్న గ్రామాలు ఖాళీ చేసి ఈ ప్రజలు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తుంటే ఏ ఒక్క రాజకీయ పార్టీల నాయకులు ఈ ప్రజలకు సమాధానం చెప్పడం లేదు. ప్రజలు సీరియస్‌గా ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

సింగరేణిలో కొనసాగుతున్న ప్రయివేటీకరణకు, ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా (2007, జనవరి) గోదావరిఖనిలో తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో 30 వేల మందితోటి బహిరంగ సభ నిర్వహించారు. కార్మికులు, రైతాంగం పాల్గొన్నారు.

నేలపై కాలరీ కవాతు-గోలేటి నుండి ప్రారంభమైంది (సెప్టెంబర్ 2008)

# విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న పోరాట/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాల నివేదికలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక ఒక్కోసారి అవి ప్రచురణ సాధ్యం కావడం లేదు.

కనుక నివేదికలలో పోరాటం/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం; జిల్లా, గ్రామాల పేర్లు; ఏ దళ ఆధ్వర్యంలో జరిగినదీ రాయాలి (దళ, ప్రాంతాల పేర్లు పొడి అక్షరాల్లో రాయవద్దు). ఈ పోరాటాల సందర్భంగా చేపట్టిన కరపత్రాలూ, పోస్టర్లూ, పత్రికా ప్రకటనలు వంటి ప్రచార రూపాలను కూడా పేర్కొనాలి. వీటిల్లో పాల్గొన్న ప్రజల సంఖ్యానూ, వారిలోనూ మహిళల సంఖ్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రజల పాత్రను నిర్దిష్టంగా పేర్కొనాలి. ప్రజా వ్యతిరేకులపై భౌతిక చర్యలు తీసుకున్న నివేదికలు రాస్తున్నప్పుడు, ఆ చర్యలకంటే ముందు వారిపై చేసిన హెచ్చరికల వంటి పోరాట రూపాలను పేర్కొనాలి. వీటిలోనూ ప్రజల పాత్రను పేర్కొనాలి.

నివేదికలతో పాటు ఫోటోలు (వుంటే) తప్పక జత చేయగలరు. ఫోటో వెనుక వివరాలు రాయగలరు.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

ఇంతకాలం భూగర్భం నుండి బొగ్గును బయటకు తీస్తున్న సింగరేణిని కాపాడుకునేందుకు ఇప్పుడు ఉపరితలంలో కవాతు మొదలైంది. తెలంగాణా విద్యావంతుల వేదిక నాయకత్వంలో మూడు రోజులు, మూడు జిల్లాల్లో విస్తరించిన సింగరేణిలో పర్యటించారు.

కరీంనగర్ జిల్లా మేడిపల్లి ఓపెన్‌కాస్టు కింద 3 వేల తాడిచెట్లు ధ్వంసం అయ్యాయి. 300 గౌడ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వీరికి పైస నష్టపరిహారం చెల్లించలేదు. గ్రామం విచ్ఛిన్నం కావడంతో వివిధ వృత్తుల వారికి పనులు లేకుండా పోయాయి. వారంతా వలస కూలీలుగా మారిపోతున్నారు. ఇలా కేవలం ఊరి అవసరాలను తీరుస్తూ, ఊరిమీద ఆధారపడి జీవించే వారి పరిస్థితి మరీ దుర్భరంగా మారుతుంది. ఊరే లేనప్పుడు వీరికి ఇక ఉపాధి ఎక్కడ? దీనితో వీరు కూడా వలసబాట పడుతున్నారు.

ఖమ్మం జిల్లా మణుగూరు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్‌కాస్టుకు వ్యతిరేకంగా వివిధ గ్రామాల ప్రజలు, ఆదివాసీలు ఆందోళనలకు పూనుకున్నారు. దీనితో పనులను తాత్కాలికంగా సింగరేణి యాజమాన్యం ఆపుకున్నారు.

ఎస్.ఇ.జడ్.లకు వ్యతిరేకంగా తెలంగాణలో భూ నిర్వాసిత వ్యతిరేక పోరాట ఐక్య సంఘటన ఏర్పడింది. మహబూబ్‌నగర్‌లో ఈ సదస్సు ఈమధ్యలో జరిగింది.

## రాబోయే కాలంలో ఓపెన్‌కాస్టు గనులు

సింగరేణి వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాలోని అసిఫాబాద్, సిర్పూర్, డోర్లి, ఖైరిగూడ, సోమగూడెం, మందమర్రి, బోయపల్లి, కాసిపేట, ఇందారం, రామకృష్ణాపూర్, చెన్నూర్, జైపూర్, చెట్‌పెల్లి, శ్రీరాంపూర్; కరీంనగర్ జిల్లాలోని రామగుండం, ఖమ్మంపెల్లి, తాడిచర్ల, శాత్‌రాజ్‌పల్లి; వరంగల్ జిల్లాలోని భూపాల్‌పల్లి, చెల్పూర్, పెద్దాపూర్, మంజూర్‌నగర్, లక్ష్మీదేవిపేట, పాలంపేట, వెంకటాపూర్, చెల్‌వాయ్, గోవిందరావుపేట, రంగాపూర్, ప|స్రా; ఖమ్మం జిల్లాలోని ఆరెపెల్లి, బండాల, పోచాపూర్, గొల్లపెల్లి, లింగాల, దుబ్బపెల్లి, కుంటాల, ముక్తాపూర్, మామకన్ను, కిష్టాపురం, ఆలపెల్లి, పాములగుట్ట, కాంచన్‌పెల్లి, కోయిలగూడెం, చింతపెల్లి, అన్‌శెట్టిపల్లి, మైలారం, పెంకులచిలుక, మర్రిగూడెం, లక్ష్మీపురం, చర్ల, కొత్తగూడెం, హేమచంద్రాపురం, రుద్రంపూర్, పాల్వంచ తదితర ప్రాంతాలలో ఓపెన్‌కాస్టు గనులు రానున్నాయి. ఇక ఓపెన్‌కాస్టు గనులన్నీ వస్తున్న ప్రాంతాలు ఆదివాసీ ప్రాంతాలు కావడం గమనార్హం. ఆదివాసీ గూడాలు ధ్వంసం అయ్యే అవకాశం వుంది. బొగ్గు గనుల కింద నిర్వాసితులయ్యే ఆదివాసుల గురించి సోకాల్డు రాజకీయ పార్టీలు కానీ, ప్రజల ఓట్లతో ఎం.పీలు ఎం.ఎల్.ఎ.లు అయినవారుగానీ పట్టించుకోవడంలేదు. 90 శాతం బొగ్గు గనులు ఆదివాసీ ప్రాంతంలో వుంటే సింగరేణి సంస్థలో ఆదివాసులకు మూడు శాతం ఉద్యోగాలు కూడా సరిగా లేవు. ఒకవైపు ఓపెన్‌కాస్టుల ద్వారా అధికంగా బొగ్గును ఉత్పత్తి చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధర్మల్ విద్యుత్ ఉత్పత్తిని 20 సంవత్సరాల్లో పదింతలు పెంచాలనే లక్ష్యంతో వున్నాయి. ఆదివాసీ భూములను ఆదివాసేతరులు, ప్రభుత్వాలు ఆక్రమించకూడదన్న 1/70 చట్టం, పీసా చట్టాన్ని అమలు చేయడంలేదు. అభివృద్ధి పేరిట అటవీ సంపద తరలింపు పేరుమీద నిర్వాసితులు అవుతున్న ఆదివాసుల సమస్య రావణాకాష్టంలా రగులుకుంటూనే వుంది.

## నందిగ్రాం, సింగూర్, కళింగనగర్, కోస్టల్ కారిడార్ ఉద్యమాల స్ఫూర్తితో పోరాడండి

ప్రజల జీవితాలను నాశనం చేసి, వారి శవాలమీద సాగించే వృద్ధిని అభివృద్ధిగా ఎలా భావిస్తాం. తెలంగాణ ప్రాంత ప్రజల శవాల మీద సాగిస్తున్న ఈ అసమాన, ఈ తలకిందుల అభివృద్ధినే అభివృద్ధిగా భూతద్దంలో చూపిస్తున్న ప్రయత్నమే సింగరేణి ఆవిర్భావ దినోత్సవాల ఆర్భాటం. ఆశేష ప్రజల మనుగడను, జీవించే హక్కును ప్రశ్నార్థకం చేస్తున్న తలకిందుల అభివృద్ధిని ఓపెన్ కాస్టు గనులను ప్రజలు ప్రతిఘటించకుంటే బతుకులేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ఆర్థిక మండలాల పేర దేశాన్ని తాకట్టు పెడుతున్నాయి. దేశంలో లక్షలాది ఎకరాల భూములలోని ప్రజలను వారి వారి ప్రాంతాల నుండి తన్ని తరిమి కొడుతుండగా నందిగ్రాం, సింగూర్, కళింగనగర్, కోస్టల్ కారిడార్ తదితర ప్రాంతాలలో ప్రజలందరి సమిష్టి భాగస్వామ్యంతో వీరోచిత పోరాటాలు చేసి విజయం సాధించారు. నేడు తెలంగాణను, సింగరేణి ప్రాంతాన్ని రక్షించుకోవడానికి ఓపెన్‌కాస్టు గనులకు వ్యతిరేకంగా కలిసివచ్చే శక్తులను కలుపుకొని, మిలిటెంట్ ఐక్య ప్రజా ఉద్యమంను నడిపించాలి. నందిగ్రాం, సింగూర్, కళింగనగర్, కోస్టల్ కారిడార్ ఉద్యమాల స్ఫూర్తితో పోరాడినప్పుడే మన వూరు, నీళ్లు, బొగ్గు, పంట పొలాలు మనకు దక్కుతాయి.

ప్రపంచబ్యాంకు ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, ఎస్.ఇ.జడ్.లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణా ఉద్యమం ఓపెన్‌కాస్టు గనులకు వ్యతిరేక ఉద్యమాన్ని సాయుధ పోరాటంతో సమైక్యం చేస్తూ ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలి.

★


# దేశవ్యాప్తంగా స్ఫూర్తినిచ్చిన పశ్చిమ మిడ్నపూర్ ఆదివాసీ ప్రజల వీరోచిత తిరుగుబాటు

# తెభాగా తరహాలో పోరాడి సోషల్ ఫాసిస్టుల్ని గడగడలాడించిన

# లాల్‌గఢ్ ప్రజలకు విప్లవ జేజేలు!

నందిగ్రాం, సింగూరు పోరాటాలతో దేశవ్యాప్తంగా ఉత్తేజాన్ని నింపిన పశ్చిమ బెంగాల్ మరోసారి పోరాటాలతో హోరెత్తిపోయింది. ఈసారి ఈ పోరాటాలకు చిరునామాగా లాల్‌గఢ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.

నవంబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచారి లక్ష్యంగా పి.ఎల్.జి.ఎ. ఒక వీరోచితమైన ఆంబుష్‌కు పాల్పడింది. ఎక్కడ పి.ఎల్.జి.ఎ. ప్రతిఘటనకు పాల్పడినా ఆ తర్వాత ప్రభుత్వాలు ప్రజల మీద విరుచుకుపడ్డం ఆనవాయితీగా జరుగుతున్నదే. అదే ప్రకారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం లాల్‌గఢ్ ప్రాంతపు ప్రజలపై విరుచుకుపడింది. అయితే ఈ ప్రాంత ప్రజలు దీన్ని సహించలేదు. ప్రభుత్వ ప్రతీకార దాడులను వీరోచితంగా ప్రతిఘటించి బుద్ధదేవ్‌కు గట్టిగా బుద్ధి చెప్పారు. వందలాది గ్రామాల ప్రజలు చేస్తున్న ఈ వీరోచిత ప్రతిఘటనా పోరాటానికి దేశవ్యాప్తంగా ప్రజలు అత్యంత ఉత్సాహంతో విప్లవ జేజేలు పలుకుతున్నారు.



నందిగ్రాం పంట పొలాలను ధ్వంసం చేస్తూ డౌ కెమికల్ హబ్‌ను ఏర్పాటు చేయాలన్న బుద్ధదేవ్ పథకాన్ని 9 నెలల వీరోచిత ప్రతిఘటన ద్వారా ప్రజలు చిత్తు చేసిన విషయం మనకు తెల్సిందే. దానితో కెమికల్ హబ్‌ను నందిగ్రాం నుండి నయాచార్‌కు తరలించవలసి వచ్చింది. ఆ తర్వాత సింగూర్ నుండి టాటాను తరిమికొడితే, కార్ల పరిశ్రమ గుజరాత్‌కు తరలివెళ్లిన విషయమూ మనకు తెల్సిందే. సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకూ ఈ వర్గాలకు పాదసేవ చేస్తోన్న సోషల్ ఫాసిస్టులకూ వ్యతిరేకంగా సాగిన ఈ ప్రజా పోరాటాలు దేశవ్యాప్తంగా ఉత్తేజాన్ని నింపినయి. అదే సమయంలో ప్రజలపై మారణకాండకు పాల్పడ్డ బుద్ధదేవ్‌కు మరణశిక్ష విధించాలని ప్రజలు కోరుకున్నారు.

ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల సేవే ప్రధాన ఎజెండాగా కల్గిన బుద్ధదేవ్ పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలోని సల్బనీ గ్రామంలో 35 వేల కోట్ల పెట్టుబడితో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించడానికి జిందాల్‌కు అనుమతినిచ్చాడు. నందిగ్రాం, సింగూర్‌ల ఓటమి నైరాశ్యం నుంచి పార్టీ శ్రేణులను బయట పడేయడం కోసం ఎన్నికలకు ముందే ఈ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభించాలనుకున్నాడు. దానికోసం నవంబర్ 2న శంకుస్థాపన తలపెట్టారు.

ఈ ఫ్యాక్టరీ శంకుస్థాపనకు వ్యతిరేకంగా, మరికొన్ని ఇతర డిమాండ్లతో సి.పి.ఐ. (మావోయిస్టు) మిడ్నాపూర్ జోనల్ (డివిజనల్) కమిటీ అక్టోబర్ 23న బంద్ పిలుపునిచ్చింది. పశ్చిమ మిడ్నపూర్, బంకూరా, పురూలియాలలో బంద్ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో శంకుస్థాపనను విజయవంతం చేయడం కోసం ప్రభుత్వం మూడువేలకు పైగా బలగాలను మోహరించి ఈ ప్రాంతంలో రహదారులను దిగ్బంధించింది. సి.పి.ఎం. తన శక్తినంతా కేంద్రీకరించి మిడ్నపూర్ నుండి సల్బనీ వరకు గల 14 కి.మీ. ప్రాంతాన్ని వేదికలా అలంకరించింది. సి.పి.ఎం. పశ్చిమ మిడ్నపూర్ జిల్లా కార్యదర్శి, పరమ కిరాతకుడైన దీపక్ సర్కార్ ఈ కార్యక్రమాన్ని తన మనుగడకే సవాల్‌గా తీసుకొని నందిగ్రాం తరహాలో హరమద్ వాహినినంతా రంగంలోకి దించాడు. ఇంత పకడ్బందీ రక్షణా ఏర్పాట్ల నడుమ బుద్ధదేవ్, రాంవిలాస్ పాశ్వాన్ (కేంద్ర ఉక్కుశాఖ మంత్రి), నిరుపమ్‌సేన్ (బెంగాల్ పరిశ్రమల మంత్రి), సజ్జన్ జిందాల్‌లు సల్బనీ గ్రామం వెళ్లి శంకుస్థాపన చేసి తిరిగి వస్తుండగా, సల్బనీ-మిడ్నపూర్ రోడ్డు మీద కలయ్‌చండీ వద్ద వీరి కాన్వాయ్‌పై పి.ఎల్.జి.ఎ. దాడి చేసి, ప్రజలంతా కోరుకున్న మరణశిక్షను

అమలుచేసే ప్రయత్నం చేసింది. అయితే ఈ దాడిలో బుద్ధదేవ్ చావు నుండి తప్పించుకున్నాడు, ఆరుగురు పోలీసులు గాయపడ్డారు. బుద్ధదేవ్ చావు నుండి తప్పించుకున్నప్పటికీ ఈ సంఘటనకు రాజకీయంగా చాలా ప్రాధాన్యత వుంది. ఈ దాడిని 30 ఏళ్ల తమ ఎదురులేని పాలనకు సవాల్‌గా భావించడంతో పాటు జిందాల్ వుంటాడా? టాటాలాగా పారిపోతాడా అనే భయం సి.పి.ఎం. అగ్రనాయకత్వానికి పట్టుకుంది. అందుకే జిందాల్ వ్యతిరేక పోరాటం చేపట్టకుండా ప్రజలపై ఉక్కుపాదం మోపాలనుకుంది.

ఈ పథకంలో భాగంగా నవంబర్ 3,4 తేదీలలో పశ్చిమ మిడ్నపూర్ జిల్లా జార్‌గ్రామ్ సబ్ డివిజన్‌లోని లాల్‌గఢ్, సల్బనీ, జంబనీ, బిన్‌పూర్ ప్రాంతాలలో పోలీసులు, పారా మిలిటరీ గూండాలు, సి.పి.ఎం. గూండాలు పెద్ద ఎత్తున దాడులు చేశారు. ఇండ్లను తగులబెట్టి పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించారు. మహిళలపై అత్యాచారాలు చేశారు. కొందరు పురుషులను అరెస్టు చేశారు. అంతేకాదు నవంబర్ 3న బుద్ధదేవ్‌పై జరిగిన దాడికి నిరసన పేరుతో రాష్ట్రమంతా ప్రజలపై దాడులు చేశారు.

అయితే ప్రజలు ప్రభుత్వ దాడులకు తలవంచలేదు. వీరోచిత ప్రతిఘటనకు తలపడ్డారు. నవంబర్ 4వ తేదీ నుండి ప్రతిఘటన మొదలైంది. లాల్‌గఢ్, సల్బనీ, గ్వాల్‌తోర్, గోరబతా, బిన్‌పూర్, జంబనీ, గోపీ వల్లభ్‌పూర్, నయాగ్రామ్, జార్‌గ్రామ్ మొదలగు ప్రాంతాలలోని పక్కా, కచ్చా రోడ్లన్నీ ప్రజలు తవ్విపోశారు. ఇవన్నీ ఆదివాసీ ప్రాంతాలు. ముఖ్యంగా లాల్‌గఢ్, సల్బనీ, బిన్‌పూర్‌లలో పోరాటం కేంద్రీకరించబడింది. కరెంట్ స్థంబాలను కూల్చివేశారు. చెట్లను నరికి రోడ్లమీద వేశారు. తెభాగా పోరాట కాలంలో ముందుకు వచ్చిన రోడ్లను తవ్వే పోరాట రూపం నందిగ్రాంలో పెద్దఎత్తున సాగింది. మళ్లీ ఇప్పుడు ఈ ప్రాంతంలో ముందుకు వచ్చింది. ఈ ప్రాంతంలోని 400 గ్రామాలతో బయట ప్రపంచానికి గల సంబంధాలు తెంచేశారు. దీంతో ప్రతీకార దాడులను విస్తృతంగా కొనసాగించాలనుకున్న ప్రభుత్వ కుట్రలు భగ్నమయ్యాయి. ఒక్క పోలీసుగానీ, సి.పి.ఎం. గూండాకానీ ఏ గ్రామంలోకి అడుగుపెట్టలేకపోయాడు. నవంబర్ 7వ తేదీన వేలాది మంది ఆదివాసీలు సాంప్రదాయక ఆయుధాలు చేతబూని లాల్‌గఢ్ పోలీసు స్టేషన్‌పై దాడి చేశారు. పోలీసు స్టేషన్‌పైనా, ఆవరణలో వున్న పోలీసు వ్యాన్లపైనా రాళ్లు విసిరారు. క్రమంగా ఈ పోరాటం పురులియా, బంకూరా జిల్లాలకు వ్యాపించింది. బంకూరాలోని సరెంగ ప్రాంతం ఈ పోరాటంతో తీవ్రంగా ప్రభావితమైంది. బరికూల్, రాణిబంద్, రాయ్‌పూర్, ఫలక్‌నుమా తదితర ప్రాంతాలకు ఉద్యమం వ్యాపించింది. ఇక్కడ కూడా పెద్ద పెద్ద చెట్లను నరికివేసి రోడ్లను దిగ్బంధించారు. పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిపారు. ప్రదర్శనాకారులపై దాడికి పాల్పడిన సి.పి.ఎం. గూండాలను ప్రతిఘటించడంతో నల్గురు గూండాలు గాయపడ్డారు. బెల్‌పహాడీ, బుల్‌బేదా, భాంస్‌పహాడీ ప్రాంతాల్లోనూ రోడ్లను తవ్వేశారు. దైజోడీ, బైద్యాలు కూడా లాల్‌గఢ్‌తోపాటు పోరాట కేంద్రాలయ్యాయి. ఇలా మొత్తంగా 800 గ్రామాలు ప్రతిఘటనలోకి దిగాయి. జార్‌గ్రామ్ పట్టణం కూడా పోరాటంలో చురుగ్గా పాల్గొంది. మొత్తంగా పశ్చిమ మిడ్నపూర్ జిల్లాకు మిగితా ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

లాల్‌గఢ్ మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డ సి.పి.ఎం. గూండాలనూ, పోలీసులను శిక్షించాలనీ, పోలీసుల కూంబింగ్‌లను నిలిపివేయాలని, పశ్చిమ మిడ్నపూర్, పురూలియా, బంకూరా జిల్లాల్లో ఆదివాసీల మీద పదేళ్లుగా పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలనీ మావోయిస్టు కేసులను బనాయించి జైళ్లల్లో పెట్టిన ప్రజలను విడుదల చేయాలనీ, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలనీ, కనీస వసతులు కల్పించాలనీ, ఆ ప్రాంతపు వెనుకబాటుతనానికి సి.పి.ఎం. బాధ్యత వహించాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. అంతేకాదు పోలీసు అధికారి రాజేష్‌కుమార్ సింగ్ ప్రజల ముందు గుంజీలు తీయాలనీ, లాల్‌గఢ్ పోలీసులు దలిల్‌పూర్ నుండి చోటోపెలియా వరకూ క్రాలింగ్ చేయాలని కూడా ప్రజలు డిమాండ్ చేశారు.

ప్రజల పోరాటంలో వామపక్ష ఫ్రంట్‌లోని ఆర్.ఎస్.పి., ఫార్వార్డ్ బ్లాక్, సి.పి.ఐ.లు తప్ప ఎస్.యు.సి.ఐ., తృణమూల్ కాంగ్రెస్, ఝార్ఖండ్(నరేన్), ఝార్ఖండ్ (దిశోం) తదితర పార్టీలు, పలు రకాల ప్రజాసంఘాలు, ఆదివాసీ సాంప్రదాయక సంఘాలు పోరాటంలో భాగమై నిలిచాయి. ఎస్.యు.సి.ఐ. ఈ పోరాటానికి మద్దతుగా ప్రదర్శనలు నిర్వహించింది. నవంబర్ 15న బంద్‌కు పిలుపిచ్చింది. తృణమూల్ కాంగ్రెస్ నవంబర్ 7,8 నుండి మద్దతు తెలిపింది. పత్రికా ప్రకటనలు విడుదల చేసింది. మిడ్నపూర్‌లో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు పలుచోట్ల రోడ్లు తవ్వడంలో పాల్గొన్నారు. ఈ పోరాటానికి సంఘీభావంగా వేలాది మంది కార్యకర్తల్ని కదలించి నవంబర్ 19న స్వయంగా మమతా బెనర్జీ నాయకత్వం వహించి మిడ్నపూర్ కలెక్టరేట్‌ను ఘెరావ్ చేసింది.

నవంబర్ 16న ఝార్ఖండ్ (దిశోం) పార్టీ బెంగాల్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆ పార్టీ కార్యకర్తలు హౌరా-హుగ్లీ రైల్వే స్టేషన్లలోని రైలు మార్గాలపై అవరోధాలు కల్పించారు. దీనివల్ల హౌరా నుండి తారకేశ్వర్ వెళ్లే మార్గం అంతా ప్రభావితం అయింది. తూర్పు సింగ్‌భూమిలోని ఘటశిల, టాటా నగర్‌లోనూ ప్రదర్శనకారులు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సహా పలు రైళ్ల రాకపోకలు నిలిపివేశారు.

ఆందోళన ప్రజ్వరిల్లింది. బెంగాల్ సరిహద్దులోని ఝార్ఖండ్ ప్రాంతానికి విస్తరించింది. ఇలా అన్ని పార్టీలు ఈ పోరాటానికి మద్దతు ప్రకటించడంతో, పోరాటంలో పాలుపంచుకోవడంతో రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకొని కాంగ్రెస్ కూడా ఆందోళనలో పాల్గొనక తప్పలేదు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేత మానేష్ భుయ్యా నేతృత్వంలో ఒక ప్రతినిధి వర్గం గవర్నర్ గోపాల్ క్రిష్ణ గాంధీని కలిసి రెండు రోజుల్లో లాల్‌గఢ్ సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

దీనితో బుద్ధదేవ్ సర్కార్‌కు దిక్కుతోచలేదు. హోం కార్యదర్శి మహాకరన్ నవంబర్ 12నే ఢిల్లీ వెళ్లి అదనపు బలగాలను అభ్యర్థించాడు. సకాలంలో బలగాలను ఇవ్వకుంటే మావోయిస్టులను అణచడం సాధ్యం కాదని మొరపెట్టుకున్నాడు. కానీ అయిదు రాష్ట్రాల్లో ఎన్నికల రీత్యా కేంద్రం బలగాలను ఇవ్వలేని అశక్తతను ప్రకటించింది. పోలీసు అధికారులతో మంతనాలాడి బుద్ధదేవ్ మరిన్ని బలగాలను పంపాడు. కానీ ఏ గ్రామంలోనూ బలగాలు కాలుపెట్టలేకపోయాయి. అంతేకాదు బెల్‌పహాడి ప్రాంతంలో దాదాపు డజన్‌కుపైగా సి.ఆర్.పి.ఎఫ్ క్యాంపులు వున్నాయి. ఒక్కోదాంట్లో కంపెనీకి పైగా బలగాలు వున్నాయి. లాల్‌గఢ్ ప్రాంతంలోనూ పారా మిలిటరీ బలగాలతో కూడిన అనేక క్యాంపులు వున్నాయి. ఇవన్నీ దిక్కుతోచని దిగ్బంధనానికి గురయ్యాయి. బెల్‌పహాడి ప్రాంతంలోని చెకడోబాలో 150-200 బలగంతో సమన్వయ కేంద్రం ఉన్నప్పటికీ, అక్కడ ప్రజలంతా కదిలి రాత్రికి రాత్రే రోడ్లు తవ్వేశారు.

ఇలా బలగాలపై ఆధారపడి పోరాటాన్ని ఆపలేమని అర్థం చేసుకున్న బుద్ధదేవ్ చర్చల మంత్రం జపించాడు. డిమాండ్లను అంగీకరించేంత వరకూ చర్చల ప్రసక్తిలేదని ప్రజలు తేల్చారు. అంతేకాదు చర్చలు కలెక్టర్ కార్యాలయంలో కాదనీ ప్రజాకోర్టులో జరగాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లనేవీ ఒప్పుకోని ప్రభుత్వం చర్చలకు మావోవాదులు ఆటంకాలు సృష్టిస్తున్నారని ప్రచారం చేసింది. అంతేకాదు పోరాటాన్ని చీల్చే ప్రయత్నం చేసింది. ఈ పోరాటంలో పాలుపంచుకుంటున్న మాంఝీమార్వా సంఘ్ అనే ఆదివాసీ సంఘానికి చెందిన స్థానిక నాయకులను కాదని (వీరు మావోయిస్టుల ప్రభావంలో వున్నారని) అఖిల భారత నాయకులను రంగంలోకి దించింది. రోడ్లను తవ్వడం, రాకపోకలకు అవాంతరాలు కల్గించడం మానుకోవాలని వీరితో కలెక్టర్ మాట్లాడాడు. ఆందోళన విరమణకు ఒప్పందాలు కుదిరాయనే అసత్య ప్రకటనలు చేశాడు. సెక్రటేరియట్‌లో హోం కార్యదర్శి అదే ప్రకటన చేశాడు. ఇది ఆదివాసీలు తమంతట తాము చేస్తున్న పోరాటం కాదనీ వెలుపలి శక్తులు ప్రేరేపించి చేయిస్తున్న పోరాటమని కూడా ప్రచారం చేస్తున్నారు.

ప్రభుత్వం చేస్తున్న ఈ కుట్రలనూ, దుష్ప్రచారాన్నీ తిప్పికొడుతూ ప్రజలు మాత్రం వీరోచిత ప్రతిఘటనను కొనసాగించారు. ఉద్యమం కొనసాగినన్ని రోజులూ రవాణా సౌకర్యాలు లేక ఎటూ రాకపోకలు లేవు, సంతలు లేవు, బడులు బంద్, నిత్యావసర సరుకుల కొరత, సొంత పనులను వదిలి రోడ్ల తవ్వకం వంటి ఇతర సమిష్టి కార్యక్రమాల్లో పాల్గొనాల్సి రావడం వల్ల ఆర్థిక నష్టం... వీటన్నింటినీ ప్రజలు చైతన్యవంతంగా ఎదుర్కొన్నారు. అంతేకాదు నలు దిక్కులా మోహరింపబడిన బలగాలు, సి.పి.ఎం. కుట్రలు, దాడుల సన్నాహాలు, చీలదీసే ప్రయత్నాలు, ఆందోళన ఆగిన తర్వాత దాడి జరుగబోయే అవకాశాలు... ఇవన్నీ మానసిక వత్తిడిని కల్గించే విషయాలు. వీటన్నింటిని భరిస్తూనే ప్రజలు పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారు.

ఈ పోరాటాన్ని బెంగాల్ ప్రసారమాధ్యమాలు ఎత్తిపట్టకతప్పలేదు. ఆదివాసీ తిరుగుబాటు అనీ, సిద్ధూ-కానూ ఆందోళన తర్వాత చాలా కాలానికి పెల్లుబుకిన పోరాటమనీ, పశ్చిమ మిడ్నపూర్ విముక్తి ప్రాంతంగా ఏర్పడిందనీ పత్రికలూ, టి.వీలు వ్యాఖ్యానించాయి.

ప్రజలు ఇంత పట్టుదలతో పోరాటాన్ని కొనసాగించడం వెనక వాళ్లు ఇన్నాళ్లూ అనుభవించిన కష్టాలున్నాయి. 30 యేళ్ల సోషల్ ఫాసిస్టుల పాలనలో ప్రజలు అన్ని హక్కులనూ కోల్పోయారు. సి.పి.ఎం. గూండాల దౌర్జన్యాలు ఇక్కడ నిత్యకృత్యం. అంతేకాదు, సి.పి.ఎం. ఆఫీసుల నుంచి అందే ఆదేశాల ప్రకారం పోలీసులు ఏ గ్రామంపైనైనా దాడి చేస్తారు. ఎవర్నయినా అరెస్ట్ చేస్తారు. మావోయిస్టు పార్టీ చేసే ప్రతిఘటన కేసుల్లో సి.పి.ఐ. కార్యకర్తలను కూడా అరెస్ట్ చేసి వేధిస్తారంటే సి.పి.ఎం. నిరంకుశత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. ఏ పార్టీ వాళ్లనైనా బెయిల్ ఇవ్వకుండా ఎన్ని రోజులు జైల్లో ఉంచాలో నిర్ణయించేది కోర్టులు కావు సి.పి.ఎం. ఆఫీసులు. ఇటువంటి దారుణమైన సి.పి.ఎం. నిరంకుశ పాలనలో విసిగిపోయిన ఇక్కడి ప్రజానీకానికి గత పదేళ్లుగా మావోయిస్టు రాజకీయాలు చేరువయ్యాయి. ఈ చైతన్యంతో ప్రజలు వీరోచిత పోరాటాలకు సిద్ధపడుతున్నారు. అంతేకాదు ఈ ప్రాంతాలన్నీ కూడా గతంలో ఆదివాసీ తిరుగుబాట్లు జరిగిన ప్రాంతాలే. కనుక ఆ వారసత్వాన్ని ప్రజలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఆయుధాలను మరింత బలంగా చేతబూని ఆ ప్రాంతాన్ని విముక్తి ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రతిజ్ఞ చేస్తున్నారు.

కొద్దికాలమే అయినప్పటికీ విముక్తి ప్రాంతంగా మనగలిగిన ఈ పోరాటపు చారిత్రక ప్రాధాన్యతను గుర్తించాలి. ఈ పోరాట

*(మిగితాది 37వ పేజీలో...)*

# రిపబ్లికన్ బుష్‌ను నడిపిన శక్తులే డెమోక్రటిక్ ఒబామాను నడిపిస్తాయి

# ప్రపంచ ఆర్థిక సంక్షోభం, సామ్రాజ్యవాద యుద్ధోన్మాదం రంగ స్థలం మీదే ఉంటాయి

అమెరికా అధ్యక్షుడిగా ఆఫ్రో అమెరికన్ ఒబామా ఎన్నిక ప్రపంచ చరిత్రలోనే ఓ అపూర్వ ఘట్టంగా సామ్రాజ్యవాద ప్రసార సాధనాలు ఆకాశానికెత్తుతున్నాయి. అన్ని సమస్యలు పరిష్కారమయిపోయి, గత కాలపు చీకటి చరిత్ర మటుమాయమైపోయినట్లు ఊదరగొడుతూ అసలు వాస్తవాల్ని మరుగుపరుస్తున్నారు. ఇదో పెద్ద మార్పు, నిశ్శబ్ద విప్లవం ప్రజాస్వామ్య శక్తి అని వ్యాఖ్యానిస్తున్నారు. 230 సంవత్సరాల ప్రజాస్వామ్య చరిత్రలో మొదటిసారి అమెరికా రాజ్యాంగం 'మానవులందరూ సమానులు, స్వతంత్రులుగా సృష్టించబడ్డారు' అన్న స్ఫూర్తికి అనుగుణంగా ఒక నల్లజాతివాడు అమెరికా దేశాధ్యక్షుడయ్యాడు అన్నారు. అబ్రహంలింకన్ కృషితో బానిసత్వం పోయినా నల్లమచ్చ పుట్టుమచ్చగా మిగిలిపోయిందని, ఆ పుట్టుమచ్చా ఒబామా గెలుపుతో తుడుచుకుపోయిందని, ఇంకా మార్టిన్ లూథర్ కింగ్ 'నాకో స్వప్నముందన్న, కల వాస్తవంగా మారిపోయిందని గొప్పలు చెబుతున్నారు.

హిల్లరీ క్లింటన్‌ను ఓడించి డెమోక్రటిక్ పార్టీ సీటు సాధించడం, రిపబ్లికన్ పార్టీకి చెందిన మెకైన్‌ను భారీ మెజారిటీతో చిత్తుగా ఓడించడం, రిపబ్లికన్ పార్టీకి పూర్తిపట్టున్న 7 రాష్ట్రాల ఫలితాలను తారుమారు చేస్తూ 56వ దేశాధ్యక్ష ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు గెలుచుకుని గత రికార్డులను బద్దలుకొడుతూ 44వ అధ్యక్షుడిగా నల్లజాతి సంతతికి చెందిన బరాక్ ఒబామా (47) ఎన్నికయ్యాడు.

హవాయిలో పుట్టిన ఒబామా తండ్రిది ఆఫ్రికా ఖండంలోని కెన్యా దేశం. తల్లి అమెరికన్. కొన్నాళ్లు ఇండోనేషియాలో మరో తండ్రి దగ్గర చదువుకున్న ఒబామా జీవితమంతా ప్రధానంగా అమెరికాలోనే గడిపాడు. పుట్టుకతో ఆఫ్రికన్ నల్లజాతితో సంబంధాన్ని కలిగిన ఆఫ్రో అమెరికన్ ఒబామా జనవరి 20, 2009 నుండి అమెరికా అధ్యక్షుడు. నవంబర్ 4 రాత్రి చికాగోలో గ్రాంట్ పార్క్‌లో ఎన్నికైనట్లు ఫలితాలు వెలువడిన వెంటనే లక్షలాది అభిమానుల ముందు ప్రసంగించాడు.

అమెరికాను బానిసల చరిత్ర నుండి విడదీసి చూడలేమని, 19వ శతాబ్దంలో అంతర్యుద్ధం దేశాన్ని రెండు ముక్కలు చేసిందని, 1960 వరకు వర్ణవివక్ష తీవ్ర స్థాయిలో అమలు జరిగిందని, ప్రజాస్వామ్యం శక్తివంతమయిందని, సంక్షోభాలను ఎదుర్కొంటూ దేన్నయినా మనం సాధించగలమని మాట్లాడిన ఒబామా ముందు 80 శాతం ప్రజల్ని పీడిస్తున్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, ఖాళీ ఖజానా, ఇరాక్, ఆఫ్ఘన్‌లపై దాడి చేసిన అప్రతిష్ట, అధిక పన్నులు, అనారోగ్యం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పతనమైన డాలర్ విలువ, దిగుమతుల సమస్య, స్వదేశీ, విదేశీ రుణ భారం ఇలా అనేక సమస్యల సుడిగుండం వుంది. యుద్ధ ఖర్చులు తగ్గించి సంక్షోభ తీవ్రతను తగ్గిస్తామని, ప్రతిష్ట కాపాడడానికి ఇరాక్ నుండి సైన్యాలను వుపసంహరించి లాడెన్‌ను వేటాడడానికి వేలాది సైన్యాన్ని ఆఫ్ఘన్‌కు పంపిస్తామని అన్నాడు. పన్నులు తగ్గించడం, పిల్లలకు ఆరోగ్యబీమా, ఆరోగ్య భద్రత, ఉద్యోగాలు, ఉపాధి అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చాడు. యుద్ధోన్మాదం, ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద లక్షణాలు. ఈ రోజు అమెరికాలోను, ప్రపంచంలోను రాజ్యమేలుతున్న ఆర్థిక రాజకీయ సంక్షోభాలకు అగ్రరాజ్య విధానాలే కేంద్రం.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏదో దేశంలో ఎప్పుడూ యుద్ధం చేస్తూనో, చేయిస్తూనో వుండే సైనిక తత్వం, యుద్ధోన్మాదం నేడు ఉగ్రవాదంపై యుద్ధంగా, అల్‌ఖైదాను మట్టుపెట్టడంగా, జియాదీల నియంత్రణగా ఒబామా చెప్పే మాటల వెనుక దాగి వుంది. అమెరికా పాలకులు ప్రపంచంపై పెత్తనాన్ని చెలాయించడానికి అగ్రరాజ్యంగా ఎదురులేని స్థితి కొనసాగడానికి దేశీయ, విదేశీయ రుణ భారం పెరిగి ఆర్థిక ఆధిక్యత తగ్గినా, సైనిక ఆధిపత్యంతో నెగ్గుకు వస్తున్న, తెరవెనుక నుండి నడిపిస్తున్న ప్రపంచ ధనాఢ్య వర్గాన్ని కాదని ఒబామా మౌలిక మార్పులు చేస్తాడా? వర్గ వైరుధ్యాలను పరిష్కరిస్తాడా? ఆర్థిక వ్యవస్థను శాంతియుతంగా పునర్వ్యవస్థీకరించగలడా? అవి అసలు ఒబామా లక్ష్యాలా? కాదు. ఎందుకంటే ఒబామాను మనం చూడాల్సింది మరోవిధంగా...

అగ్రరాజ్య అమెరికా సృష్టించిన సమస్యలు ఒకసారి పరిశీలిస్తే పర్యవసానాలు అర్థం చేసుకుంటే ఒబామా నియామకం వెనుకనున్న

*(మిగితాది 35వ పేజీలో...)*

# దిద్దుబాటు ఉద్యమాన్ని బాధ్యతాయు

మన ఐక్య కాంగ్రెస్-9వ కాంగ్రెస్ మన పార్టీలోని పార్టీ ప్రాథమిక యూనిట్ నుండి కేంద్ర కమిటీ వరకు గల అన్యవర్గ ధోరణులను గుర్తించింది. ఇవి స్వీయాత్మకవాదం, స్వాంటేనిటి, ఫుదారవాదం, ఒంటెత్తువాదం, వ్యక్తివాదం, పెత్తందారీతనం. మన ఉద్యమాన్ని ముందుకు పోనీయకుండా అడ్డుకొంటున్న ఈ ధోరణులను తొలగించుకోవాల్సిన తక్షణ అవసరాన్ని కాంగ్రెస్ నొక్కి చెప్పింది. దిద్దుబాటు ఉద్యమాన్ని ప్రారంభించాలని చెప్పింది.

దిద్దుబాటు ఉద్యమానికి ఏ లక్ష్యాలు ఉండాలో కేంద్ర కమిటీ ప్రకటించింది. దిద్దుబాటు ఉద్యమం రెండు లక్ష్యాలు సాధించాలని చెప్పింది. ఒకటి, గతితార్కిక భౌతికవాద పద్ధతిలో నిత్యకార్యాచరణతో అన్వయించుకొంటూ ప్రతి పార్టీ సభ్యుని సిద్ధాంత రాజకీయ స్థాయిని పెంచేదిగా ఉండాలి. రెండవది, మన ప్రజాపంథాలోని బలహీనతలను గుర్తించుట. ప్రజలను పెద్దఎత్తున యుద్ధంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ పాల్గొనేలా చేయడం. ఈవిధమైన పద్ధతి ద్వారా మన తప్పులను సరిదిద్దుకొని ప్రజలతో మన సంబంధాలను బలోపేతం చేసుకోవాలి.

దిద్దుబాటు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టేలా కేంద్రకమిటీ ప్లాను రూపొందించింది. ఈ ప్లానులో భాగంగా పార్టీ అంతటా మార్క్సిస్టు విద్యాబోధన చేయడంతోపాటు, మన పార్టీ, అంతర్జాతీయంగా వివిధ పార్టీలు దిద్దుబాటు ఎలా జరపాయి, వాటి అనుభవాలు ఏమిటి అనేది పార్టీ నాయకత్వం, కేడర్లు, పార్టీ సభ్యులు, ప్రజా సంఘాలు అధ్యయనం చేయాల్సిన అవసరం వుంది. ఈ దిద్దుబాటు ఉద్యమాన్ని విజయవంతం చేసే కృషిలో 'క్రాంతి' పత్రిక పాలుపంచుకొంటూ దిద్దుబాటు ఉద్యమంపై ఎడ్యుకేషన్ కోసం సీరియల్‌గా దిద్దుబాటు వ్యాసాలు వేయాలని నిర్ణయించిందని చెప్పడానికి సంతోషిస్తున్నాం. అందరూ ఈ వ్యాసాలను చదివి తమ కార్యాచరణకు,, అవగాహనకు అన్వయించుకొని, తమలో గల అన్యవర్గ ధోరణులను సరిదిద్దుకోవడానికి ఉపయోగపడాలని భావిస్తున్నాం.ఈ సందర్భంగా 2008లో పార్టీ పుట్టిన దినమైన సెప్టెంబర్ 21 నాడు పార్టీ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సందేశంలోని ఈ భాగాన్ని మీ ముందుంచుతున్నాం -

**దిద్దుబాటు ఉద్యమాన్ని నిర్వహించడం అంటే,** "యావత్తు దైనందిన కమ్యూనిస్టు కార్యకలాపాల్ని - అది సమావేశాల్ని నిర్వహించడం కావచ్చు, అధ్యయనం చేయడం కావచ్చు, అధ్యయన తరగతి నిర్వహించడం కావచ్చు, ఒక వ్యాసం లేదా వ్యాసం రాయడం-ఉపన్యాసం ఇవ్వడం - ఒక పాట పాడడం - ఒక పోరాటం నిర్వహించడం - ఒక నిర్మాణం ఏర్పరచడం - ఒక ప్రదర్శన నిర్వహించడం - ఒక నృత్యం చేయడం - ఒక దాడి నిర్వహించడం కావచ్చు, ఒక ఉద్యమాన్ని నడపడం కావచ్చు, ఏ విషయంలో అయినాగానీ దొర్లిన లోపాలు ఏమిటి? జరిగిన తప్పులేమిటి? కొనసాగుతూ వస్తున్న బలహీనతలూ, లోటుపాట్లు ఏమిటి? వాటి నిర్దిష్ట వ్యక్తీకరణలు ఎలా ఉన్నాయి, వాటి వల్ల కలిగిన నష్టం ఏమిటి? వాటికి కారణాలు ఏమిటి? ఇవి ఏ నిర్దిష్ట పరిస్థితుల్లో జరిగాయి? వాటిని సకాలంలో అర్థం చేసుకొని సరిదిద్దుకోవడానికి చేసిన కృషిలోని లోపాలు, లోటుపాట్లు ఏమిటి? వాటిని ఏమేరకు సరిదిద్దుకున్నాం? పూర్తిగా సరిదిద్దుకోవాలంటే ఏమి చేయాలి? వాటన్నింటినీ దిద్దుబాటు ఉద్యమంలో నిశిత పరీక్షకు గురిచేయాలి. ప్రతి కామ్రేడ్ స్వయంగా నిశిత పరీక్ష చేసుకోవాలి. ప్రతి యూనిట్ నిశిత పరీక్ష చేసుకోవాలి. ప్రతి యూనిట్ తన సభ్యులందర్నీ నిశిత పరీక్షకు గురిచేయాలి. పైనుండి ఆరంభించి కిందికీ, తిరిగి కింది నుండి ఆరంభించి పైకీ, ఇలా ఒక క్రమం తర్వాత మరో క్రమాన్ని ఉన్నతంగా కొనసాగించాలి. ఏదోరకంగా దిద్దుబాటు ఉద్యమాన్ని పూర్తిచేయాలనే దానితో దీనిని పైపైన కొనసాగించి చేతులు దులుపుకునే ఫార్మలిజంగానీ, ఎలాగూ మరో క్రమం కూడా తీసుకోవచ్చుకదా అనే దానితో కూడా ఫార్మలిస్టిక్‌గా కొనసాగించడంగానీ దిద్దుబాటు ఉద్యమ లక్ష్యాన్ని నీరుగారుస్తాయి. ఈ దిద్దుబాటు ఉద్యమాన్ని గొప్ప పోరాట స్ఫూర్తితో ప్రతి రంగంలోనూ - రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ, పోరాట రంగాలన్నింటిలోనూ - శక్తివంతం కావాలనే లక్ష్యంతో నిర్వహించాలి."

ప్రపంచ కార్మికవర్గ మహోపాధ్యాయులు - మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోలూ - మన పార్టీ సంస్థాపక నేతలు, వుపాధ్యాయులు కామ్రేడ్స్ సి.ఎం.-కె.సి.లు, వేలాది మంది గొప్ప అమరవీరులు తమ విప్లవాచరణ ద్వారా కార్మికవర్గ విప్లవ సుగుణాలనూ, సంస్కృతినీ అమూల్యమైన ఆదర్శాలుగా సాంప్రదాయాలుగా మన ముందుంచి వెళ్లారు. వారి ఆదర్శాలను మార్గదర్శకంగా, త్యాగనిరతిని ఉత్తేజంగా తీసుకొని మనం మన తప్పులను లోపాలను సరిదిద్దుకొని, బలహీనతలను వదిలించుకొని ఈ దిద్దుబాటు ఉద్యమాన్ని విజయవంతం చేద్దాం. దిద్దుబాటు వుద్యమాన్ని విజయవంతం చేయడం ద్వారా శక్తివంతం కావడానికి, మన పార్టీనీ, సేననూ, ప్రజాపునాదినీ శక్తివంతం చేయడానికి దృఢ సంకల్పులమవుదాం.

# తమైన ముఖ్య కర్తవ్యంగా నిర్వహిద్దాం

రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యయనం కోసం - 1

## పెత్తందారీ ధోరణులకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించండి!

కామ్రేడ్స్!

ఇటీవల సమావేశమైన రాష్ట్ర కమిటీ వివిధ జిల్లాల్లోని ఉద్యమ, నిర్మాణ పరిస్థితులను లోతుగా పరిశీలించింది. ఆయా జిల్లా కమిటీల బాధ్యులతో కూడా వీటి గురించి విపులంగా చర్చించింది. కొన్నిచోట్ల పార్టీ ఆర్గనైజర్లలో పెత్తందారీ ధోరణులు తలెత్తుతున్నాయని చర్చల వల్ల, పరిశీలన వల్ల స్పష్టమయింది. ఈ ధోరణులకు వ్యతిరేకంగా చైతన్యయుతంగా పోరాడవలసిన అవసరాన్ని మీ దృష్టికి తెచ్చేందుకే ఈ సర్క్యులర్ వుద్దేశించబడింది.

కామ్రేడ్స్, రాష్ట్రంలోని కొన్నిచోట్ల పార్టీ ఆర్గనైజర్లలో పెత్తందారీ ధోరణులు తలెత్తుతున్నాయనే వాస్తవాన్ని మనం గుర్తించాలి. అలా గుర్తించగలిగినప్పుడే అలాంటి ధోరణులను నిర్మూలించేందుకు మనం పార్టీ పద్ధతుల్లో గట్టిగా కృషి చేయడానికి దీక్షవహించగల్గుతాం.

పార్టీలో పొడసూపే అన్యవర్గ ధోరణులను మొగ్గలోనే పసిగట్టి సకాలంలో ఎక్కడికక్కడే వాటిని ఓడించడం మార్క్సిస్టు, లెనినిస్టు పద్ధతి. అలాంటి అన్యవర్గ ధోరణులను ప్రతిఘటించకుండా సహించటం ద్వారా వాటి పెంపుదలకు దోహదం చేయడం రివిజనిస్టు పద్ధతి. మనం ఈ విషయంలో మార్క్సిస్టు-లెనినిస్టు పద్ధతి అమలు జరపాలి. రివిజనిస్టు పద్ధతిని తీసివేయాలి.

కామ్రేడ్స్: కొన్నిచోట్ల పార్టీ కార్యకర్తల్లో పెత్తందరీ ధోరణులు ఈ కింది రూపాల్లో ప్రత్యక్షమవుతున్నట్లు రాష్ట్ర కమిటీ గమనించింది.

1. రైతాంగాన్ని తిట్టడం 2. రైతాంగాన్ని బెదిరించడం 3. రైతాంగాన్ని కొట్టడం 4. రైతాంగంపై దండగలు విధించడం 5. ఆశ్రయం ఇచ్చిన రైతాంగాన్ని మంచి ఆహారం పెట్టాలని బలవంతం చేయడం 6. తనను వ్యతిరేకించిన వారిపై కక్ష సాధించడం 7. రైతులు ఆయా సమస్యలపై చెప్పే అభిప్రాయాలను వినకపోవడం, వారితో ఆయా సమస్యలపై చర్చించడానికి సిద్ధపడకపోవడం, తమ మాటే నెగ్గాలని పట్టుపట్టడం వగైరాలు.

కామ్రేడ్స్: పైన చెప్పిన వివిధ రూపాల్లో వున్న పెత్తందారీ ధోరణులు ఏదో ఒకటి రెండు ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తున్నాయని, పార్టీకి తక్షణం ముందుకొచ్చే ప్రమాదం ఏమీలేదని అలసత్వం వహించరాదు. అలాగే పై పోకడలు ఒకరిద్దరు, వేళ్లమీద లెక్కపెట్టదగిన సంఖ్యలోనే, కార్యకర్తల్లో మాత్రమే కనిపిస్తున్నాయి తప్ప, ఈ వ్యాధి ఎక్కువ మందికి సోకలేదని సంతృప్తి చెందటం కూడా మార్క్సిస్టు-లెనినిస్టు లక్షణం కాదు.

పైన వివరించిన పెత్తందారీ ధోరణులకు సంబంధించిన అన్ని రూపాలూ, ఒకేచోట, ఒకే కార్యకర్తలో మొత్తంగా కనిపించకపోవడం నిజమే. రైతాంగాన్ని కొట్టడం, దండగలు విధించడం, సాధించడం వగైరాలు ఈ ధోరణిలో సామాన్యంగా కనిపించే రూపాలు కానిమాట నిజమే అయినా పార్టీలో తలెత్తే అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించే సందర్భంలో చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలనే జాగ్రత్త తీసుకోవాలి. అన్యవర్గ ధోరణులు పార్టీలో ఏ రూపంలో, ఏ మోతాదులో తలెత్తినా, వాటిని మొగ్గలోనే తుంచివేసేందుకు పార్టీలో సమిష్టిగా కృషి చేయాలి. అప్పుడే విప్లవ పార్టీ తన స్వభావాన్ని రక్షించుకోగల్గుతుంది. అంతేకాదు, అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా అది పోరాటం చేయడం ద్వారానే పార్టీ తన విప్లవ చేవను అభివృద్ధి చేసుకోగల్గుతుంది.

కామ్రేడ్స్, కొన్నిచోట్ల కొందరు పార్టీ కార్యకర్తల్లో ఆయా రూపాల్లో వ్యక్తమవుతున్న పెత్తందారీ ధోరణులను కేవలం వ్యక్తులకు సంబంధించిన సమస్యగా మాత్రమే తీసుకోవడం మార్క్సిస్టు-లెనినిస్టు వైఖరి కాదు. వ్యక్తులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని భావించడం కూడా మార్క్సిస్టు-లెనినిస్టు వైఖరికాదు.

పార్టీ కార్యకర్తల్లో ఆయా రూపాల్లో పెత్తందారీ పోకడలు తలెత్తడానికి గల భౌతిక కారణాలను అర్థం చేసుకోలేకపోతే, ఈ వ్యాధికి సరైన మందును ఇవ్వడంలో మనం విఫలమవుతాం. ఈ వ్యాధి సోకడానికి గల వాతావరణాన్ని అర్థం చేసుకోగల్గినప్పుడే ఈ వ్యాధి నిర్మూలనకు అవసరమైన చర్యలను తీసుకోగల్గుతాం.

కామ్రేడ్స్, మనది వెనుకబడిన దేశం. మనది అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజం. అశేష రైతాంగం ఒక వర్గంగా

వేలాది సంవత్సరాలుగా భూస్వామ్య దోపిడీ దౌర్జన్యానికి గురవుతూ వస్తున్నారు. ఫలితంగా రైతాంగం ఆర్థికంగా, సాంస్కృతికంగా, విజ్ఞానపరంగా వెనుకబడివున్నారు.

అదే సమయంలో భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవానికి వారే చోదక శక్తులు.

అందుచేతనే మన విప్లవ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రం గ్రామీణ ప్రాంతమే. భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలు తీవ్రంగా వుండి, భూస్వాములకు రైతాంగానికి మధ్య వైరుధ్యం తీవ్రంగా వున్న ప్రాంతాల్లో మనం తొలుత కేంద్రీకరించి పని చేయాలన్నదే ఎత్తుగడల పంథా.

ఇలా భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలు తీవ్రంగా వున్న ప్రాంతంలో మనం కేంద్రీకరించి పని చేయడం వల్ల బలమైన భూస్వామ్య వ్యతిరేక రైతాంగ ఉద్యమాన్ని సాపేక్షికంగా తక్కువ కాలంలో ఎక్కువ ఫలితాలతో నిర్మించగల్గుతాము. ఇది ప్రధాన అంశం.

ఈ సమస్యకు మరో కోణం కూడా వుంది. శతాబ్దాలుగా ఒక వర్గంగా అర్ధ బానిస పరిస్థితుల్లో జీవించిన రైతాంగం మనల్ని విముక్తి దాతలుగా పూజిస్తారు. అమిత గౌరవాన్ని ఇస్తారు. ఉద్యమం తొలి దశల్లో ప్రతి సమస్య పరిష్కారం కోసం కార్యకర్తలవైపు చూస్తారు. రైతాంగ ఉద్యమం భూస్వాములకు వ్యతిరేకంగా సాధించిన విజయాలు, పార్టీ కార్యకర్తలపట్ల రైతాంగం చూయించే అమితమైన గౌరవభావం, రైతాంగంలో సాంస్కృతికంగా వున్న వెనుకబాటుతనం నూతన ప్రజాస్వామిక సంస్కృతికి గాక భూస్వామ్య సంస్కృతికి, పార్టీ కార్యకర్తల్లో అహంభావం ఏర్పడడానికి, పెత్తందారీ ధోరణులు పుట్టి పెరగడానికి అవసరమైన పరిస్థితిని పుట్టిస్తాయి. రైతాంగ ఉద్యమం సాధించిన విజయాలూ, ఫలితంగా రైతాంగం చూయించే అపార గౌరవాన్ని ఆదరాభిమానాన్ని సిద్ధాంత బలంలేక జీర్ణించుకోలేని పార్టీ కార్యకర్తలు ప్రజలపై పెత్తందారీతనం చెలాయించడానికి తయారవుతారు. అలాంటి వారు కుమ్మరిసారెను తానే తిప్పుతున్నానని అనుకున్న ఈగలా తయారవుతారు.

ఆకాశం పడిపోకుండా తనకాళ్ల మీద నిలుపుతున్నానని అనుకున్న ఉత్తీతలాగ తయారవుతారు. "దోపిడి దొరల" స్థానంలో పార్టీ దొరలు తయారవుతారు.

"ఫలానా కార్యకర్త మొదట్లో మంచిగానే వుండేవాడు: ప్రజల ముందు మంచిగానే వుండేవాడు. ఇపుడు ఇలా తయారయ్యాడేమిటి ఈ పొగరుబోతుతనం ఎలా వచ్చింది? ఎక్కడి నుండి వచ్చింది?" అని ఆశ్చర్యపడే కామ్రేడ్స్ వెనుకబడిన సమాజంలో పనిచేసే విప్లవ పార్టీలోని పెత్తందారీ పోకడలు తలెత్తడానికి గల భౌతిక కారణాలను మరచిపోతున్నారు.

బాగా వెనుకబడిన దేశాలైన రష్యాలోను, చైనాలోనూ జరిగిన విప్లవాల్లో కూడా ఇలాంటి పెత్తందారీ ధోరణులు తలెత్తడం, వాటికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలలో తీవ్రమైన పోరాటాన్ని కొనసాగించటం మనం చూస్తాం.

పార్టీ కార్యకర్తల్లో పెత్తందారీ ధోరణులు పుట్టి పెరగడానికి గల భౌతిక కారణాలతోపాటు, ఆయా ప్రాంతాల్లో రైతాంగ ఉద్యమం పుట్టి పెరిగిన చరిత్రను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి.

కామ్రేడ్స్ రైతాంగ ఉద్యమం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మనం ఊహించని రీతిలో "స్పాంటేనియస్"గా పెల్లుబికింది. మన పార్టీ నిర్మాణ శక్తికి మించి రైతాంగం పెద్దఎత్తున కదిలింది. ఉద్యమం స్పాంటేనియస్‌గా రావడం కొత్తదేమీ కాదు. అయితే ఇలాంటి రైతాంగ ఉద్యమంలో ముందుకు వచ్చిన యాక్టివిస్ట్‌లను సమీకరించి గ్రామస్థాయిలో పార్టీ సెల్స్ నిర్మించడం, వాటిని కేంద్రీకృత ప్రజాస్వామిక పద్ధతిలో పని చేయించడం; సెల్స్‌లో పని విభజన జరగటం, వారి పనిని చెక్ అప్ చేయడం, విమర్శ-ఆత్మవిమర్శ పద్ధతిని అమలుజరపడం, వారిని రాజకీయంగా, సిద్ధాంతపరంగా ఎడ్యుకేట్ చేయడం, ఈ మొత్తం ప్రాసెస్‌లో వారి రాజకీయ, అవగాహన వ్యక్తిత్వాన్ని పెంచడం ద్వారా స్పాంటేనియస్ ఉద్యమం నుండి ఉద్భవించే సమస్యల్ని మనం పరిష్కరించగల్గాం. ఈ కీలక కర్తవ్యాన్ని, కారణాలు ఏమయినప్పటికీ మనం పూర్తి చేయడంలో ఇంతవరకు ప్రధానంగా విఫలం చెందామనే చెప్పాలి.

ఈ పరిస్థితి కూడా కొన్నిచోట్ల పార్టీ కార్యకర్తల్లో పెత్తందారీ ధోరణులు పుట్టి పెరగడానికి దోహదం చేస్తుంది. "ప్రజలు గొర్రెల మంద నేను కాపరిని" లాంటి వాదనలకు దోహదం చేస్తుంది. జనం మనము చెప్పినట్లు నిలబడమంటే నిలబడాలి, కూర్చోమంటే కూర్చోవాలి. లేకపోతే విప్లవంలో జనాన్ని ఎలా నడుపగల్గుతాం, విప్లవ విజయాన్ని ఎలా సాధించుతారు, అనే విచిత్ర వాదనలకు కూడా దోహదం చేస్తుంది.

స్పాంటేనియస్ ఉద్యమం మనముందు మరికొన్ని సమస్యలను కూడా తెచ్చి పెట్టిన విషయం మనం మరచిపోరాదు. ప్రవాహంలో చెత్తా చెదారం కొట్టుకువచ్చినట్లుగానే స్పాంటేనియస్ ఉద్యమంలో రైతాంగం నుండే అక్కడక్కడా అరాచకవాదులు, ఉత్పత్తిలో పాల్గొనకుండా జులాయిగా తిరిగేవాళ్లు, ప్రజల్ని బెదిరించుక తినేవాళ్లు కూడా ముందుకు వచ్చారు. ఉద్యమం ఆటుపోటులకు గురవుతూ పురోగమించేకొలదీ, ఈ బాపతు వాళ్లల్లో కొందరు అక్కడక్కడా

సంఘ వ్యతిరేక శక్తులుగానూ, ప్రజల్ని పీడించుక తినేవాళ్లుగానూ, దొంగలూ, లంగలూ, పోలీసుల, భూస్వాముల ఏజెంట్లుగానూ, ఉద్యమానికి ప్రతిబంధకంగానూ తయారయ్యారు. పీడిత ప్రజల నుండి వచ్చిన ఇలాంటి వారి ఎడల పార్టీ తీసుకోవలసిన వైఖరి ఎలా వుండాలి? భూస్వాముల ఎడల తీసుకోవలసిన వైఖరి ఎలా వుండాలి? ఇద్దరి యెడల తీసుకొనే వైఖరిలో తేడా ఏమయినా వుందా? లేదా? అనే సమస్య కూడా మన ముందుకు వస్తుంది. ఈ సమస్య ఎడల మార్క్సిస్టు-లెనినిస్టు వైఖరి ఎలా వుండా? అనే విషయం కూడా మనం తెలుసుకోవలసి వున్నది.

కామ్రేడ్స్! ఈ సమస్యను సమగ్రంగా పరిశీలించేటప్పుడు, పార్టీ కార్యకర్తల్లో పెత్తందారీ పోకడలు తలెత్తడానికి గల సిద్ధాంతపరమైన మూలకారణాన్ని కూడా మనం తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. మన ఉద్యమంలోకి ఎక్కువమంది, కార్యకర్తలు భూస్వామ్య వ్యతిరేక పోరాటం నుండి వచ్చారు. వారిలో మిలిటెన్సీ, పోరాటశీలం వుంది. ఇది గర్వించదగ్గ అంశం. రెండోవైపున పోరాట దీక్ష, త్యాగనిరతి వున్న స్థాయిలో సిద్ధాంతబలం లేదు. రాజకీయ అవగాహనలేదు. ఈ కారణంగా కూడా పెత్తందారీ ధోరణులు తలెత్తే ప్రమాదం ఏర్పడుతున్నది.

పెత్తందారీ ధోరణులు ప్రదర్శిస్తున్న కామ్రేడ్స్ తెలిసో తెలియకో ''వీరులే చరిత్ర నిర్మాతలు'' అనే సిద్ధాంతాన్ని అమలు జరుపుతున్నారు. "కొందరు వీరులు అవతరించి ప్రజల్ని విముక్తి చేస్తార''ని భావిస్తున్నారు. ఈ ధోరణి ఎంతవరకు పోయిందంటే ఆయా డిమాండ్లపై ప్రజలను సమీకరించడానికి తగిన ప్రాముఖ్యత ఇవ్వకుండా, దోపిడీ వర్గాలను బెదిరించి ప్రజలకు రాయితీలు సంపాదించే వరకు వెళ్లింది. ప్రజలే నిజమైన వీరులు, "ప్రజలు తమ్ము తామే విముక్తి చేసుకుంటారు." "విప్లవానికి ప్రజలే కర్త, కర్మ, క్రియ," "కమ్యూనిస్టు పార్టీ సామాజిక విప్లవాన్ని త్వరితంచేసే కేటలిస్టులాంటిది."

నూతన సమాజం ఆవిర్భావానికి పార్టీ మంత్రసాని, అనే మార్క్సిస్టు-లెనినిస్టు ప్రాథమిక సూత్రాన్ని వారు అర్థం చేసుకోవడంలేదు. "ప్రజలే చరిత్ర నిర్మాత''లని వారు మాటల్లో అంగీకరించినా, వారి అవగాహన ఈ విషయంలో లోతుగాలేదు. ఈ అవగాహనా లోపం వల్లనే ''జనం మనం చెప్పినట్లు నిలబడమంటే నిలబడాలి. కూర్చోమంటే కూర్చోవాలి. లేకపోతే విప్లవంలో జనాన్ని ఎలా నడుపగలుతాం? విప్లవ విజయాన్ని ఎలా సాధించగలుగుతాం?'' లాంటి వాదనలు వినవస్తున్నాయి. ఇలాంటి మార్క్సిస్టు-లెనినిస్టు వ్యతిరేక వాదనలకు సిద్ధాంతపరంగా ఓడించవలసి వుంది.

కామ్రేడ్స్! ఇలాంటి పెత్తందారీ ధోరణులు తలెత్తడానికి గల వర్గ పునాది ఏమిటి? అనే అంశంను కూడా ఈ సందర్భంగా మనం తప్పనిసరిగా పరిశీలించాలి.

మన పార్టీ కార్యకర్తల్లో అధిక సంఖ్యాకులు పెటీబూర్జువా వర్గానికి చెందిన వారు. మన పార్టీలో కనిపించే పెడధోరణులకు పెటీ బూర్జువా వర్గపునాది కారణమనే విషయాన్ని మనం మరచిపోరాదు. అయితే పెటీ బూర్జువా వర్గం నుండి పార్టీలోకి రావడం పాపమేమీకాదు. వెనుకబడిన దేశాలలో పార్టీలోకి పెటీబూర్జువా వర్గం నుండి వచ్చిన వాళ్లు పెద్ద సంఖ్యలో వుండటం మనం చూస్తాం. వెనుకబడిన దేశాల్లోని విప్లవ చరిత్ర ఇదే వాస్తవాన్ని తెలియజేస్తుంది. మన దేశ విప్లవ అనుభవం కూడా ఇదే.

అయితే పెటీ బూర్జువా వర్గం నుండి పార్టీలోకి వచ్చిన కామ్రేడ్స్, పీడిత ప్రజలతో మమేకమయి పోరాటాలకు నాయకత్వం వహించడం ద్వారానూ, అంతేగాక మార్క్సిస్టు సిద్ధాంత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారానూ, విమర్శ-ఆత్మవిమర్శ పద్ధతుల ద్వారానూ కార్మికవర్గ దృక్పథాన్ని అలవరుచుకోవడమే ఇందుకు పరిష్కార మార్గం. పీడిత ప్రజల ఎడల ఒక కార్యకర్త పెత్తందారీ వైఖరి తీసుకుంటున్నాడా? లేక ప్రజానీకం యెడల వినమ్రతా వైఖరిని తీసుకుంటున్నాడా? అనేది కూడా పెటీ బూర్జువా దృక్పథంగల కార్యకర్తకూ, కార్మికవర్గ దృక్పథం గల కార్యకర్తకు మధ్యగల ఒక విభజననే అని మరచిపోకూడదు. ప్రజలకు నేను సేవకుణ్ణి అనే వైఖరి తీసుకోవడం కార్మికవర్గ దృక్పథం గల కార్యకర్తలకు ఒక గీటురాయి.

కామ్రేడ్స్, పార్టీ కార్యకర్తల్లో పెత్తందారీ ధోరణులు తలెత్తడానికి గల భౌతిక, చారిత్రక, సైద్ధాంతిక, వర్గపరమైన మూల కారణాలను మనం పరిశీలించాం. ఈ పెడధోరణి కేవలం కొందరు వ్యక్తులు తెస్తున్న సమస్యగానే భావించరాదని అనుకున్నాం. ఈ సమస్యను మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథంతో సమగ్రంగా పరిశీలించడం ద్వారానే ఈ పెడధోరణికి వ్యతిరేకంగా శక్తివంతమైన పోరాటం చేయగలమని అనుకున్నాం. అయితే ఈ సమస్యకు మార్క్సిస్టు-లెనినిస్టు పరిష్కారమార్గం ఏమిటి?

పార్టీ కార్యకర్తలకు పెత్తందారీ ధోరణులు తలెత్తడానికి గల భౌతిక, చారిత్రక, సైద్ధాంతిక, వర్గపరమైన మూల కారణాలను వివరించి, వారిని సిద్ధాంతపరంగా ఎడ్యుకేట్ చేయాలి. "ప్రజలే చరిత్ర నిర్మాతలు'' అనే సిద్ధాంతపరమైన అవగాహనను పెంచాలి. పార్టీ కార్యకర్తల్లో తలెత్తే పెత్తందారీ ధోరణులు విప్లవోద్యమానికి ఎలా నష్టమో వివరించాలి. చైనా విప్లవంలో పార్టీలో పెత్తందారీ ధోరణులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని వివరించాలి. పెత్తందారీ పోకడలు

ప్రస్ఫుటంగా బయటపడినచోట, లేనిచోట కూడా ఈ ఎడ్యుకేషన్ జరగాలి. ఈ ఎడ్యుకేషన్‌ను పార్టీ యాక్టివిస్టుల వరకూ తీసుకొనిపోవాలి.

ఈ సందర్భంగా దాసరి లక్ష్మీకాంతంతో (పొరకల దొరతో) మన పార్టీకి గల నిర్దిష్టమైన అనుభవాన్ని ఆధారం చేసుకొని పార్టీ కార్యకర్తలను నిర్దిష్టంగా కూడా ఎడ్యుకేట్ చేయాలి.

దాసరి లక్ష్మీకాంతం గిరిజన రైతాంగాన్ని తిట్టడం, బెదిరించడం వగైరా చేసేవాడు. తన తప్పును దిద్దుకోవడానికి బదులు పార్టీ నాయకత్వం సకాలంలో కామ్రేడ్స్‌గా ఇచ్చిన సలహాలను, హెచ్చరికలను తిరస్కరించాడు. పోరాట ప్రాంతాన్ని వదిలి పార్టీ క్రమశిక్షణను వుల్లంఘించి తన ఇష్టం వచ్చిన చోటికి పారిపోయాడు. అరెస్టు అయిన తర్వాత పార్టీ వ్యతిరేక ప్రచారాన్ని బహిరంగంగానే ప్రారంభించాడు. పార్టీ సంజాయిషీ అడిగితే జవాబు ఇవ్వనిరాకరించాడు. అతన్ని బాగుచేయడానికి పార్టీ నాయకత్వం వీలైనంత వరకు ఓపిగ్గా ప్రయత్నించి మరో మార్గంతరం లేక అతన్ని పార్టీ నుండి తొలగించింది.

1. దాసరి లక్ష్మీకాంతం ఉదంతం పార్టీకి నెగెటివ్ ఎగ్జాంపుల్ కావాలి. ప్రజలయెడల, పార్టీయెడల కార్యకర్తలు ఎలా ప్రవర్తించరాదో దాసరి లక్ష్మీకాంతం ఉదంతం నుండి మనం నేర్చుకోవాలి.

2. ఆయా ప్రాంతాల్లో ఏ స్థాయిలోగానీ తలెత్తే పెత్తందారీ ధోరణులను మొలక రూపంలోనే చూడగానే పసిగట్టి, ఆ వ్యాధి సోకిన కామ్రేడ్స్‌ను సకాలంలో నాయకత్వం మందలించడం ద్వారా, వారిలో ఆ వ్యాధి ముదరకుండా కాపాడటమేగాక, దాన్ని నిర్మూలించేందుకు సహాయపడాలి.

3. పార్టీ నాయకత్వంలో పెత్తందారీ ధోరణులు తలెత్తకుండా వుండేందుకు సమావేశాల్లో కామ్రేడ్స్ నుండి విమర్శలను నాయకత్వం ఆహ్వానించాలి.

4. కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసే పార్టీని నిర్మించడంపై కేంద్రీకరించి పని చేయాలి. భూస్వామ్య వ్యతిరేక పోరాట శిబిరంలో వున్న ప్రజల్లో వ్యక్తిత్వాన్ని పెంచాలి. ఆయా సమస్యలో వారు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పేందుకు ప్రోత్సహించాలి. వారి అభిప్రాయాలను కార్యకర్తలు శ్రద్ధగా వినాలి. ఏకీభవించాలి. వారిపై కక్షసాధించే వైఖరి తీసుకోరాదు. భూస్వామ్య వర్గం పీడిత ప్రజల్లో వ్యక్తిత్వంను చంపడం ద్వారా తన అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తుంది. కమ్యూనిస్టులు పీడిత ప్రజల్లో వ్యక్తిభావాన్ని పెంచడం ద్వారా నూతన సమాజ నిర్మాణానికి బాటను సుగమం చేయాలి.

5. ఆయా సమస్యలను పరిష్కరించడంలోనూ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలోనూ ప్రజలు, ప్రజాసంఘాలు వెలిబుచ్చే అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వారు చెప్పేది సక్రమమయినదయితే, దానిని మనం ఆహ్వానించాలి. వారి చెప్పే బలమైన అంశాల నుండి మనం నేర్చుకోవాలి. వారు చెప్పేది తప్పయితే, వారు చెప్పేవరకు ఆగి, ఆ తరువాత ఓపికతో వారి తప్పులను వివరించాలి. తన అభిప్రాయంతో పరిష్కరించడంలోనూ, ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలోనూ ప్రజలు, ప్రజాసంఘాలు వెలిబుచ్చే అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

6. పార్టీ సెల్స్ వున్న గ్రామాల్లో ప్రతి సమస్య ముందుగా సెల్స్‌లో చర్చించి నిర్ణయాలు చేసుకోవాలి. వాటిని ప్రజా సంఘాల ద్వారా, ప్రజల ముందు వుంచాలి.

7. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఏ కార్యకర్తయినా, ఏ సమస్యపైనయినా వ్యక్తిగతంగా నిర్ణయం చేయవలసివస్తే, ఆ నిర్ణయాన్ని దానికి సంబంధించిన నిర్మాణంలో తరువాత తప్పనిసరిగా ఆమోదం తీసుకోవాలి.

8. ప్రతి కార్యకర్త పైకమిటీల నిర్ణయాలను ఖచ్చితంగా అమలుచేయాలి. పైకమిటీ నాయకత్వంపై ఏదైనా విమర్శ వుంటే అది పార్టీ నిర్మాణ పద్ధతులలోనే చేయాలి. పార్టీ బయట చేయరాదు. అలాగే పార్టీ నాయకత్వం కూడా కార్యకర్తలపై తన విమర్శను పార్టీ నిర్మాణ పద్ధతుల్లో చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి విమర్శలను పార్టీ బయట చేయరాదు.

9. పీడిత ప్రజల నుండి వచ్చిన వ్యక్తి ఎవరైనా విప్లవోద్యమానికి ప్రతిబంధకంగా తయారయినా, ప్రమాదకరంగా తయారయినా అతని యెడల కార్యకర్తలు ఓపికతో కూడిన వైఖరి తీసుకోవాలి. అతనికి నచ్చచెప్పాలి. అతని ప్రవర్తన పీడిత ప్రజలకు ఎలా నష్టం కల్గిస్తుందో వివరించాలి. అతని కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కూడా అతనికి చెప్పించాలి. అప్పటికీ అతడు వినకపోతే, పాత పద్ధతుల్లోనే వ్యవహరిస్తూ వుంటే పీడిత ప్రజలు అతన్ని అసహ్యించుకునేలా చేయాలి. ఇలా అనేక ఇతర పద్ధతులు అమలు జరిపిన తరువాత కూడా అతని ప్రవర్తనలో మార్పు రాకపోతే, ఉద్యమ అవసరంరీత్యా అతనిపై ఏదో ఒక చర్య తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడితే జిల్లా కమిటీలో చర్చించి ఆమోదం తరువాతనే అలాంటి చర్య తీసుకోవాలి. ఏ కార్యకర్తలైనా పార్టీలోని ఏ స్థానంలో వున్నా అతడు పార్టీ విమర్శను కామ్రేడ్లీగా తీసుకొని, తన పెత్తందారీ ధోరణులను సరిదిద్దుకోవడానికి నిరాకరిస్తే, పార్టీ సూచనలను పదే పదే ధిక్కరిస్తూ వుంటే, పెత్తందారీ రోగము ముదిరిపోతే చివరి

చర్యగా మాత్రమే అలాంటి కార్యకర్తపై క్రమశిక్షణా చర్య తీసుకోవలసి వుంటుంది.

అలాంటి కామ్రేడ్‌ను ఎడ్యుకేట్ చేయకుండా, అతని తప్పును సరిదిద్దడానికి ఓపిగ్గా చివరివరకు అనేక విధాల ప్రయత్నించకుండా తొందరపడి, క్రమశిక్షణా చర్య తీసుకోవడం సెక్టేరియనిజం అవుతుంది.

అలాగే అతడు సరిదిద్దుకోవడానికి నిరాకరిస్తూ, ఆత్మవిమర్శకు సిద్ధంకాకుండా, పార్టీ సూచనలను పదే పదే ధిక్కరిస్తూ, పెత్తందారీ ధోరణులను కొనసాగిస్తూ, ఆచరణలో ఇక బాగుపడడని తేలిపోయిన తర్వాత కూడా అలాంటి వారిపై క్రమశిక్షణాచర్య తీసుకోవడంలో నాయకత్వం తటపటాయిస్తే అది "ఉదారవాదం'' అవుతుంది.

అందువల్ల కామ్రేడ్స్‌ను సరిదిద్దే ప్రయత్నంలో అటు సెక్టేరియనిజానికిగానీ ఇటు ఉదారవాదానికి గానీ గురికాకుండా జాగ్రత్తపడాలి.

సెక్టేరియనిజం విప్లవోద్యమంలో కలుపుకొని రావలసిన వారందరినీ కలుపుకొని రావడానికి ప్రతిబంధకంకాగా ఉదారవాదం పార్టీలో ఉండదగని వ్యక్తులను సహిస్తుంది. రెండు ధోరణులూ విప్లవోద్యమానికి నష్టం చేకూర్చేవే.

కామ్రేడ్స్! మన పార్టీ వ్యక్తులకే పరిమితమైన పరిస్థితి నుండి, అశేష ప్రజానీకంతో సజీవమైన సంబంధాలు లేని పరిస్థితి నుండి క్రమేణా విస్తరించి నేడు రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక జిల్లాల్లో నిలదొక్కుకుంది. కొన్ని జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలలో అశేష రైతాంగంతో సజీవ సంబంధాలు నెలకొల్పుకున్నది. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నది. పార్టీకి ప్రజాపునాది పెరిగే కొలది అనేక తరహాల వ్యక్తులు మన ఉద్యమంలోకి వస్తారు. వెనుకబడిన సమాజంలోని అనేక చెడులు ప్రవేశిస్తాయి. విప్లవోద్యమం, పార్టీ నిర్మాణం అభివృద్ధి చెందడంతోపాటు అనేక చెడులు పార్టీలో ప్రవేశిస్తాయి. పెరిగి పెద్దదవుతున్న ఏ పార్టీ అయినా, ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనక తప్పదు. పార్టీలో ఎలాంటి పెడధోరణులు తలెత్తటం లేదనీ, తలెత్తవనీ, అంతా సవ్యంగానే, సజావుగానే, ఉందని సంతృప్తి పరచటం ఆదర్శవాదం తప్ప మరేమీకాదు.

ఇలాంటి పెడధోరణులు తలెత్తటం చూసి గుండెలు బాదుకోవడం కూడా సరైన దృక్పథంకాదు.

పార్టీ ఇలాంటి పెడధోరణులను నిర్మూలించడానికి నిబ్బరంగా, ప్లాను ప్రకారం పోరాడవలసి వుంది. ఉద్యమం అభివృద్ధి చెందే కొలది ఆయా సమయాల్లో, ఆయా పరిస్థితుల్లో, ఆయా రూపాల్లో తలెత్తే కార్మికవర్గ వ్యతిరేక ధోరణులతో పోరాడి ఓడించడానికి పార్టీ ఎల్లప్పుడూ సంసిద్ధంగా వుండాలి. ఈ పోరాటం ఒకనాడు ప్రారంభమయి, మరొకనాడు ముగిసేది కాదు. ఇది నిరంతరాయ కార్యక్రమం.

కామ్రేడ్స్!

కొన్ని ప్రాంతాల్లో రైతాంగ ఉద్యమం బలీయం కావడంతో మన పార్టీ మరో ప్రమాదానికి గురయ్యే అవకాశం కూడా లేకపోలేదు. గ్రామాల్లో వుండే భూస్వాముల ముఠాల్లో ఏదో ఒక ముఠా, తన ప్రత్యర్థి ముఠాకు వ్యతిరేకంగా ప్రజల్ని ఉపయోగించుకోనేందుకు ప్రయత్నించవచ్చు. మన కార్యకర్తల్లో కొందరు భూస్వాముల పొగడ్తలకు, వారు చూపించే మోసపూరిత ఆదరాభిమానాలకు లొంగిపోయి తెలిసో తెలియకో వారి ప్రయోజనాల్ని కాపాడే పరిస్థితికి నెట్టబడవచ్చు. లేదా భూస్వాముల ముఠాల్లో ఏదో ఒక ముఠా సహాయంతో రైతాంగ ఉద్యమాన్ని త్వరితంగా నిర్మించగలమనే భ్రమలు పెంచుకోవడం కూడా జరగవచ్చు. ప్రజల్లో బలం పెరిగే కొద్దీ కార్యకర్తలు కరప్ట్ అయ్యే పరిస్థితి రావచ్చు.

భూస్వాముల పంచను చేరి, సి.పి.ఐ., సి.పి.ఎం.పార్టీలు ఎలాంటి దుస్థితికి దిగజారిపోయామో చివరకు వారు భూస్వాముల ఏజెంటుగా ఎలా మారిపోయారో, ఎలా కరప్ట్ అయిపోయారో ఆ చరిత్రంతా మనకు ఒక హెచ్చరిక కావాలి.

అలాగే ఆర్థిక పోరాటాలు చేయడమే రివిజనిజం అనే సిద్ధాంతం తప్పని, ఆర్థిక పోరాటాలు ఆర్థికపరమైన డిమాండ్ల సాధనకే కాకుండా రాజకీయ లక్ష్యంతో ముడిపడి వుండాలని, సాయుధ పోరాటానికి రిహార్సల్‌గా ప్రజలు అనేక ఆర్థిక పోరాటాలలో పాల్గొనాలనే అవగాహనతో మన పార్టీ గత కొన్ని సంవత్సరాలుగా గ్రామాలలో అనేక పోరాటాలు చేపట్టి విజయవంతమైంది.

నిర్దిష్ట రాజకీయ లక్ష్యం, దానికి సంబంధించిన ఎడ్యుకేషన్ ప్రజలకు పార్టీ కార్యకర్తలకు సకాలంలో ఇవ్వకుంటే, గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించుకున్న ఆర్థిక పోరాటాలు లక్ష్యం లేనివిగా తయారై చివరకు ప్రజల పాత్ర కూడా మరచిపోయి కేవలం కార్యకర్తల పలుకుబడిపైన మాత్రమే ఆధారపడి పోరాటాలు చేయించే స్థితికి కార్యకర్తలు వెళుతున్నారు.

ప్రజలు నిలబడని పోరాటం ఎవరికోసం? కార్యకర్త పలుకుబడితో విజయవంతమయిందనిపించే పోరాటం ఎవరి చైతన్యాన్ని అభివృద్ధి గావిస్తుంది? ఒక సమ్మెతో లేదా ఏ ప్రభుత్వ

అధికారికో చెల్లించాల్సిన ముడుపులు కార్యకర్త బెదిరింపువల్ల ఆగిపోయినంత మాత్రాన ప్రజల చైతన్యం, పోరాట స్థాయి ఎలా పెరగాలి?

పై పద్ధతుల్లో జరిగే పోరాటాల్లో ఏ లక్ష్యసాధనకైతే ప్రజలను సమాయత్తపరచాలని అనుకుంటున్నామో ఆ లక్ష్యం నెరవేరదు సరికదా ప్రజలను మరింత నిర్వీర్యులను చేస్తుంది. ప్రారంభంలో ఏ పోరాటం చేపట్టినా ఆ పోరాటంలో ప్రజలు నిలబడటానికి సిద్ధంగా వున్నారో లేరో చూసుకొని పోరాటం ప్రారంభించాలి. మొదట సిద్ధపడ్డ ప్రజలు మధ్యలో నిర్బంధంవల్లనో మరే ఇతర కారణాల వల్లనో నిలబడలేకపోతే తాత్కాలికంగా ఆ పోరాటం ఓడిపోవచ్చు. ఓడిపోయిందని కార్యకర్త అవమానపడాల్సిన అవసరం ఏమీలేదు. ఉద్యమం అనేకసార్లు ఓటమి స్థాయిని అధిగమించిగాని ముందుకుపోలేదు. ఓపికగా ప్రజలను ఎడ్యుకేట్ చేసుకోవడం ఒక్కటే సరియైన పద్ధతి. ప్రజలు పోరాటాల్లో నిలబడకుండా కార్యకర్త ప్రిస్టేజికిపోయి జరిపే పోరాటాలు అంటూ వుంటే అవి మన బలహీనతకు చిహ్నం కానీ బలానికి కాదు.

ఆర్థిక పోరాటాలలో ప్రజలను నిలబెట్టి వారి చైతన్యాన్ని అభివృద్ధి పరచడం పోరాటం చేయాలనే పట్టుదల పెంచడంకోసమేనన్నా, ఆర్థిక పోరాటాలే విప్లవాన్ని విజయవంతం చేయలేవనే విషయం అందరూ అంగీకరించినా ఆచరణలో దానికి వ్యతిరేకంగా అక్కడక్కడ కొద్దిమంది కార్యకర్తలు ప్రవర్తిస్తున్నారు. ఈ ధోరణికి వ్యతిరేకంగా పోరాడి జిల్లా కమిటీలు ఆ కార్యకర్తలను సరియైన విధంగా ఎడ్యుకేట్ చేస్తూ గ్రామ సంఘాలను కదిలించి పనిచేయడంలో కార్యకర్తలు నేర్పరితనం అలవరుచుకొనే విధంగా శ్రద్ధ వహించాలి.

ప్రజలమధ్య వైరుధ్యాలు పరిష్కరించే విధానం కూడా లోతుగా అధ్యయనం చేయడంపై కేంద్రీకరించాలి.

కామ్రేడ్స్!

మన పార్టీలో పెత్తందారీ ధోరణులు ఒకటి, రెండు ప్రాంతాల్లో, ఒకరిద్దరు కార్యకర్తల్లో మాత్రమే ప్రస్ఫుటంగా కనిపించిన మాట వాస్తవమే అయినా ఈ సమస్యను తేలిగ్గా కొట్టిపారవేయడానికి వీలులేదు. విప్లవాన్ని జయప్రదం చేయడానికి కృతనిశ్చయంతో వున్న ఏ పార్టీ, తనలో అలాంటి ధోరణులు తలెత్తడాన్ని ఎన్నటికీ సహించదు.

కార్యకర్తల్లో తలెత్తే పెత్తందారీ ధోరణులను ఓడించడానికి సిద్ధాంతపరంగా నిర్మాణపరంగా చేయవలసిన పోరాటాన్ని సకాలంలో సమిష్టిగా చేయడానికి పార్టీ సంసిద్ధం కావాలి.

ఈ సందర్భంగా కార్యకర్తల్లో తలెత్తిన పెత్తందారీ ధోరణులతో పోరాడి, వాటిని ఓడించిన జిల్లా కమిటీలకు రాష్ట్ర కమిటీ విప్లవాభినందనలు అందజేస్తోంది. ఇలాంటి పెడధోరణులను సకాలంలో పసిగట్టి, ఓడించడంలో జిల్లా కమిటీలు మరింత మెలకువగా వుండవలసిందిగా రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తోంది.

కామ్రేడ్స్!

"ప్రజా ఉద్యమాల్లో పనిచేసే ప్రతి కమ్యూనిస్టు ప్రజలకు పెత్తందారుడుగా కాకుండా స్నేమితుడుగానూ, నిరంకుశ రాజకీయవేత్తగా గాకుండా సాహసవంతమైన ఉపాధ్యాయుడుగాను పని చేయాలి" అనే కామ్రేడ్ మావో ప్రబోధం మనకు మార్గదర్శకం కావాలి.

"ఏ సమయంలోగానీ, ఏ సందర్భంలోగానీ కమ్యూనిస్టు తన స్వీయ ప్రయోజనాన్ని ముందుంచుకోరాదు. దేశ ప్రయోజనాలకు, ప్రజల ప్రయోజనాలకు తన ప్రయోజనాలు లోబడి వుండేలా చూడాలి. అందుకనే స్వార్థం, అశ్రద్ధ, లంచగొండితనం, పేరు ప్రతిష్ఠలకోనం ఆరాటపడటం వగైరాలన్నీ అత్యంత అసహ్యకరమైనవి, నిస్వార్థం, శక్తినంతా వినియోగించి శ్రమపడటం, హృదయ పూర్వకమైన దీక్షతో ప్రజాసేవ చేయడం, నిరాడంబరంగా కష్టపడి పనిచేయడం ఈ లక్షణాలు మాత్రమే కమ్యూనిస్టుకు గౌరవాన్ని సంపాదించి పెడతాయి" అన్న కామ్రేడ్ మావో ప్రబోధం మనకు హెచ్చరిక కావాలి.

కామ్రేడ్స్!

మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం మార్గదర్శకత్వం కల్గిన, ప్రజల్లో పెనవేసుకుపోయిన విమర్శ పద్ధతిని అనుసరించే, ఉక్కు శిక్షణ కల్గిన పార్టీని గ్రామస్థాయిలో నిర్మించే కీలక కర్తవ్యాన్ని జయప్రదంగా నెరవేర్చడం ద్వారా పార్టీలో అక్కడక్కడ పొడసూపుతున్న పెత్తందారీ జబ్బును నిర్మూలించండి. ఆ జబ్బు ఇతర ప్రాంతాలకు, ఇతర కార్యకర్తలకు వ్యాపించకుండా నిరోధించండి.

"తన్ను తాను నిరంతరం క్షాళన చేసుకోవడం ద్వారానే కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ మరింత బలపడుతుందనే మార్క్సిస్టు-లెనినిస్టు మహోపాధ్యాయుల ప్రబోధాన్ని సదా గుర్తుంచుకోండి. కొందరు కార్యకర్తల్లో తలెత్తుతున్న పెత్తందారీ ధోరణులకు వ్యతిరేకంగా పోరాటాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోండి.

**విప్లవాభినందనాలతో,**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె)(పీపుల్స్‌వార్)**
**ఆంధ్రప్రదేశ్ కమిటీ**

***జనవరి 1982 (సర్క్యులర్ నెం. 3/82)***

# మరోసారి పడగ విప్పిన ప్రేమోన్మాదం

# విష వృక్షాన్ని పెంచిపోషిస్తూ కాముకుల్ని నరికేసిన ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి కాలంలో అందోళనా స్థాయిలో జరుగుతున్న ప్రేమోన్మాద దాడులపరంపరలో మరొకటి చేరిపోయింది. ఈసారి ఈదాడికి బలయినవారు స్వప్నిక, ప్రణీత అనే ఇంజనీరింగ్ విద్యార్థినులు. సభ్య సమాజం ఈ ఘోరానికి తీవ్రంగా స్పందించింది. సమాజంలో తీవ్రమైన అభద్రతా భావాన్ని పెంచుతున్న ఈ పాశవిక దాడులను అరికట్టలేని ప్రభుత్వ నిర్లక్ష్యంపట్ల ఆగ్రహాన్ని ప్రకటించింది. ఆగ్రహానికి జడిసిన ప్రభుత్వం ఈదాడికి పాల్పడిన ముగ్గురు యువకులను 'ఎన్‌కౌంటర్' చేసి, ఈ సంఘటనల పట్ల తీవ్రంగా స్పందిస్తున్నట్టుగా ఫోజు పెట్టింది. ప్రేమోన్మాద దాడులు ఎంత ఆందోళనా కరమైనవో, ఎంత అవాంఛనీయమైనవో, ఎంతగా ఖండించదగినవో ప్రభుత్వం చేసిన ఈ 'ఎన్‌కౌంటర్' కూడా అంతే ఆందోళనాకరం, అవాంఛనీయం, ఖండనార్హం.

అనురాధలాగే, ప్రసన్న వరలక్ష్మిలాగే, శ్రీలక్ష్మిలాగే... స్వప్నికదీ మనసుల్ని మెలిపెట్టే విషాధ గాథ. ప్రేమ వేధింపుకు ఆమె నిండు జీవితం బలైపోయింది. ఆమె స్నేహితురాలైనందుకు, ఆమెతో కల్సి ప్రయాణిస్తున్నందుకు ప్రణీత కూడా యాసిడ్ దాడికి బలై ప్రస్తుతం ఆస్పత్రిలో వుంది.

ఇంత దారుణానికి పాల్పడింది రౌడీషీటర్లు కాదు, వీధి గూండాలు కాదు, పేరుమోసిన నేరస్తులు కాదు. శ్రీనివాస్‌రావు, హరిక్రిష్ట, సంజయ్ అనే ముగ్గురు విద్యార్థులు. సాధారణ విద్యార్థులను ఇంత దారుణానికి ప్రేరేపించిందెవరు? విష సంస్కృతిని విచ్చలవిడిగా వెదజల్లుతున్న సామ్రాజ్యవాదం, ప్రేమను సరుకుగా మార్చిన పెట్టుబడిదారీ విధానం, స్త్రీని విలాస వస్తువుగా నొక్కి చెప్పే భూస్వామ్యం, స్త్రీకి వ్యక్తిత్వం ఉండకూడదని శాసించే పితృస్వామ్యం... వీటన్నింటి బోధనలను యువత నరనరానికీ ఎక్కిస్తున్న సినిమాలు, టి.వీ.లు, ఇంటర్‌నెట్లు, పత్రికలు... ఈ అన్ని సాధనాల ద్వారా హింస, నేరాలే హీరోయిజంగా జరుగుతున్న ప్రచారం...ఇవన్నీ ఈ ముగ్గురు విద్యార్థులనూ హింసోన్మాదులుగా, నరహంతకులుగా చేశాయి. విద్యార్థులను భవిష్యత్‌కు వారధులుగా తయారు చేయాలనే లక్ష్యమే లేని, కేవలం పోటీ ప్రపంచంలో పరిగెత్తడమే నేర్పుతున్న విద్యా వ్యవస్థకూ ఈ నేరంలో పాత్ర వుంది. ఈ ముగ్గురు యువకుల రూపంలో ఈ దోపిడీ వ్యవస్థ, అది వెదజల్లుతున్న సామ్రాజ్యవాద విష సంస్కృతి చేసిన దారుణం ఇది.

ఇక్కడ మన ఆందోళనను మరింత పెంచే విషయం ఏంటంటే తన 'ప్రేమ'ను తిరస్కరించిందన్న కోపం ఉన్మాదం స్థాయిలో స్వప్నికపై శ్రీనివాస్‌రావుకు వుంది. కానీ హరిక్రిష్ణ, సంజయ్‌లకు స్వప్నికపై వ్యక్తిగతంగా ఎటువంటి ద్వేషమూ లేదు. మరి వాళ్లెందుకు ఈ దాడిలో పాల్గొన్నారు? ఒక అమ్మాయి వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకోవడాన్ని భరించలేనంత పితృస్వామ్యం వాళ్లలో వున్నందువల్ల పాల్గొని వుంటారా? లేదంటే ఒక 'థ్రిల్' కోసం పాల్గొని వుంటారా? ఈ ఆలోచనకే వెన్నులో వణుకు పుడుతుంది. ఈ వ్యవస్థ విలువలను ఎంతగా పతనం చేస్తోంది!

2008లో రాష్ట్రంలో విప్లవోద్యమాన్ని పూర్తిగా అణచివేశామని జానారెడ్డి గర్వంగా చెప్పుకున్నాడు. అదే సమయంలో రాష్ట్రంలో మహిళలపై హింస రికార్డు స్థాయిలో పెరిగిందని ఒప్పుకోక తప్పలేదు. ఈ రెండూ వేర్వేరు అంశాలుగా ఆయన ప్రకటించాడు కానీ ఈ రెండింటి నడుమ ఒక సంబంధం వుంది. రాష్ట్రంలో మహిళలపై హింస రికార్డు స్థాయిలో పెరగడానికి, విప్లవోద్యమం బలహీనపడ్డం కూడా ఒక ముఖ్యమైన కారణం. ఇదే వరంగల్ నగరంలో 90లలో గూండాయిజం పెరిగి మహిళలకు అభద్రతగా పరిణమించినప్పుడు విప్లవోద్యమం ఒక చైతన్యపూరిత కృషి ద్వారా గూండాయిజాన్ని పారదోలింది. ఆనాడు మహిళలు నక్సలైట్లకు నీరాజనాలు పలికిన చరిత్రను ఈనాడు ఎవరూ దాచేయలేరు. ఆర్.ఎస్.యు. బలంగా వున్న రోజుల్లో కాలేజీల్లో ర్యాగింగ్, టీజింగ్‌ను పూర్తిగా అరికట్టింది. ఫలితంగా మహిళా విద్యార్థులు పూర్తి భద్రతా వాతావరణంలో తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోగల్గారు. గ్రామీణ ప్రాంతాల్లోని దళాలు, నగరాలు, పట్టణాల్లోని విప్లవోద్యమం అత్యాచారాలు, లైంగిక వేధింపులు, వరకట్న హింస, గృహ హింస వంటి మహిళా సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేపట్టినయి. ఆమేరకు మహిళలపై హింసను తగ్గించగల్గినయి. విప్లవోద్యమం బలహీనపడిన ఈ సమయంలో మహిళలపై హింస పెరగడం ఒక అనివార్య పరిస్థితే.

కనుక ప్రేమోన్మాద దాడులనైనా, మరే మహిళా సమస్యనైనా పరిష్కరించుకోవాలంటే విప్లవోద్యమాన్నీ, అందులో భాగంగా బలమైన మహిళా ఉద్యమాన్నీ నిర్మించుకోవడమే పరిష్కారం. కానీ ప్రభుత్వం ఈ ముగ్గురు యువకులనూ చంపి తగిన పరిష్కారంగా సమర్థించుకుంటోంది.

పోలీసులు ఎందుకు ఎన్‌కౌంటర్‌కు పాల్పడవల్సి వచ్చింది? ఈ ప్రశ్నకు జవాబు చెప్పుకోవాలంటే ఈ ఘోరం జరగడంలో పోలీసుల పాత్ర ఎంత? అని ప్రశ్నించుకోవాలి.

ప్రేమ వేధింపు తనపై యాసిడ్లై కురుస్తుందని ఆనాడు అనురాధకు తెలియదు, బండకత్తయి తనను తెగ నరుకుతుందని ప్రసన్న వరలక్ష్మి ఊహించలేదు. కానీ స్వప్నికకు తెలుసు, ఆమె ఊహించగలదు. ప్రేమోన్మాద దాడులకు గురయిన ఎందరో అక్కలు, చెల్లెల్లు కార్చిన కన్నీళ్ల నుంచి, చేసిన ఆక్రందనల నుంచి, కోల్పోయిన ప్రాణాల నుంచి ఆమె చేదు పాఠాలను నేర్చుకునే వుంది. అందుకే ప్రేమ వేధింపు మొదలుకాగానే తల్లిదండ్రులకు తెలియజేసింది, పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చింది. తల్లీ, తండ్రీ, ఆమె, పోలీసు స్టేషన్ చుట్టూ పలుసార్లు తిరిగారు. కొన్నాళ్లు స్వప్నిక కాలేజీ కూడా మానేసింది. అయినా పోలీసులు పట్టించుకోలేదు. శ్రీనివాస్‌రావు వీరి కుటుంబంపై వత్తిడి పెంచాలనే ఉద్దేశంతో స్వప్నిక తండ్రి బైక్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఆమె తమ్ముడిని చంపుతానని బెదిరించాడు. బైక్ తగులబెట్టాడని మళ్లీ కేసు పెట్టి పోలీసుల చుట్టూ పదిసార్లు తిరిగితే పోలీసులు శ్రీనివాస్‌రావును పట్టుకొని అదే రోజు వదిలేసారు. ఆ తర్వాత వేధింపును మరింతగా కొనసాగించి చివరికి ఆమెపై యాసిడ్ దాడికే పాల్పడ్డాడు.

చావుతో పోరాడుతూ, మరణశయ్య నుంచే "మొదట్లోనే పోలీసులు తగిన చర్యలు తీసుకొని వుంటే ఇలా జరిగేదా?"... అని ఆవేదనగా ప్రశ్నించింది స్వప్నిక. సి.ఐ., ఎస్.ఐ.ల చుట్టూ పదిసార్లు తిరిగినా పట్టించుకోలేదనీ, ఆఖరికి ఎస్.పి.కి కూడా తమ గోడును చెప్పుకున్నామనీ ఆమె తండ్రీ, ఆడమనిషినై వుండి నేను కూడా పదిసార్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని ఆమె తల్లీ తమ గోడును వెళ్లబోసుకున్నారు.

పోలీసుల ఈ తీవ్ర నిర్లక్ష్యం పట్ల ప్రజల్లో నిరసన వెల్లువెత్తింది. వరంగల్ నగర ప్రజలు విశేషంగా స్పందించి ప్రభుత్వానికీ, పోలీసులకు వ్యతిరేకంగా ప్రదర్శనలూ, ఆందోళనలూ చేపట్టారు.

తమపై వెల్లువెత్తుతున్న విమర్శలను ప్రశంసలుగా మార్చుకోవడానికీ, తమకు వ్యతిరేకంగా వున్న వాతావరణాన్ని అనుకూలంగా మార్చుకోవడానికి ప్రభుత్వమూ, వరంగల్ ఎస్పీ సజ్జనార్ కల్సి ఎన్‌కౌంటర్‌కు పథకం పన్ని, అమలు చేశారు. సహజంగానే ప్రజల్లో ఈ దాడికి పాల్పడిన నేరస్తుల పట్ల తీవ్రమైన ఆగ్రహం వుంది, వాళ్లకు తగిన విధంగా బుద్ధి చెప్పాలనే కోరికా వుంది. అందుకే వాళ్లను 'ఎన్‌కౌంటర్' చేయడం వల్ల ప్రజల మెప్పుదల పొందవచ్చని ప్రభుత్వమూ, పోలీసులు సరిగ్గానే ఊహించారు. అంతేకాదు ఇటీవల కాలంలో రాష్ట్రంలో పెచ్చరిల్లిపోతున్న ఇటువంటి దాడులను ప్రభుత్వం అరికట్టలేకపోతుందన్న వ్యతిరేకత కూడా ప్రజల్లో వుంది. ఆయేషా మీరా హత్య వంటి సంఘటనల్లో ప్రభుత్వం నేరస్తులను కాపాడుతున్న వైనం అందరికీ స్పష్టంగా అర్థమైంది. ఎన్నికలు అతి సమీపంలో వున్న ఈ కాలంలో ఇది ప్రభుత్వానికి తీవ్రమైన అననుకూలాంశం. దీనితోపాటు ఈ 'ఎన్‌కౌంటర్' ద్వారా ప్రభుత్వం ఆశించిన మరో ప్రయోజనం కూడా వుంది. ప్రభుత్వం మొదట ఎన్‌కౌంటర్లను ప్రారంభించింది ప్రజలకు వ్యతిరేకంగానే. ప్రజల ఆకాంక్షలు విప్లవోద్యమమై ఎగిసినప్పుడు ప్రభుత్వం ఎన్‌కౌంటర్లను మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఎందరో సాధారణ ప్రజలను సైతం ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటోంది. నేడు రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ అనే మాట సర్వసాధారణమైపోయింది. ఎన్‌కౌంటర్లపేర సాధారణ ప్రజలనో, ప్రజల పక్షాన పోరాడేవాళ్లనో హత్య చేస్తున్నారనేది ప్రజలకు స్పష్టమే. అందుకే వీటిపట్ల ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వుంది. ముఖ్యంగా ఎన్‌కౌంటర్లతో నిలువెల్లా గాయపడిన తెలంగాణాలో ఈ వ్యతిరేకత మరింతగా వుంటుంది. కాబట్టి అడపాదడపా ప్రజలంతా ద్వేషించే కొందరు దుర్మార్గులను ఎన్‌కౌంటర్ల పేరిట చంపి, తమ 'ఎన్‌కౌంటర్ల' విధానానికి సాధికారతను కల్పించుకునే ఒక దుర్మార్గమైన కుట్ర ఇది. ఇటీవల కాలంలో వరంగల్‌లో నయినా, రాష్ట్ర వ్యాప్తంగానయినా జరిగిన ఈ తరహా ఎన్‌కౌంటర్ల ఉద్దేశ్యం ఇదే.

నేరస్తులను అరెస్ట్ చేశారు. బహిరంగంగా అరెస్టును ప్రకటించారు. ఆ తర్వాత కస్టడీలో వున్న ముగ్గుర్నీ చంపేశారు. పోలీసులు పాల్పడుతున్న కస్టడీ హత్యలపై రాష్ట్రంలోనూ, దేశంలోనూ చాలా సందర్భాల్లో చర్చ జరిగింది. అయినప్పటికీ పోలీసులు మరోసారి తెగించారు. ఇది ఎన్‌కౌంటర్ అని పసిపిల్లలు కూడా నమ్మరని పోలీసులకు తెల్సినప్పటికీ పోలీసులు ఏమాత్రం వెనకాడలేదు. ఇది సమాజానికి ఒక ప్రమాదభరితమైన సంకేతం.

ఇక్కడ న్యాయవ్యవస్థనూ దోషిగా నిలెయ్యాలి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలన్నీ ఒకే తానులో ముక్కలన్నది స్పష్టమే. ఇవి ఒకదాన్ని మరొకటి సమర్థించుకుంటాయి, సహకరించుకుంటాయి. కానీ ఇవన్నీ స్వతంత్ర ప్రతిపత్తి వున్న సంస్థలని చెప్పుకోవడానికి అరెస్ట్, నేరారోపణ, కోర్టులు, న్యాయవిచారణ, శిక్ష వంటి బూటకపు ప్రక్రియలను నడిపిస్తాయి. కానీ చాలా సందర్భాల్లో ఈ బూటకపు ప్రక్రియకు కూడా సిద్ధపడ్డంలేదు. అరెస్ట్ చేసిన వాళ్లనూ, అసలు అరెస్టే చేయకుండానూ పోలీసులే శిక్షలు విధిస్తుంటే న్యాయవ్యవస్థ అనేది అర్థరహితమైనది.

➡

# సముద్రపు దొంగల (పైరేట్స్) దాడుల వెనకున్న శక్తులు సామ్రాజ్యవాదులే!

## ఈ వ్యవస్థ గర్భంలోనే పైరసీ మూలాలున్నాయి

ఎక్కడ చమురున్నా, ఎక్కడ ఏ భూగర్భ వనరులున్నా బహుళజాతి సంస్థలు అక్కడికి చేరిపోతాయి. ప్రాంతాలుగానే కాకుండా జాతులుగా, తెగలుగా ప్రజల్ని విభజించి నడిపిస్తాయి. ఇంక అక్కడ ఆహారానికి కొరత వున్నా ఆయుధాలకు లోటు వుండదు. వారి మధ్య వారికి వాటాలు కుదరకపోతే ప్రజల మధ్య చీలిక తెచ్చి ఊచకోతలు మొదలుపెడతారు. విదేశీ కంపెనీలు అడుగుపెట్టడంతో సోమాలియాది అదే పరిస్థితి. ప్రయివేట్ కంపెనీల వాటాలుగా దేశం ఆరు ముక్కలైంది. అక్కడ ప్రభుత్వం అడ్రసు గల్లంతైపోయింది. అక్కడ పోషకాహార లోపం ఎంతగా వుంటుందో ప్రపంచానికి బాగా తెలుసు. సోమాలియా పేరు చెబితేనే ఎముకల గూడుకు అంటుకుపోయిన చర్మంతో సన్నటి కాళ్ళు, లోతుకుపోయిన కళ్లతో దైన్యంగా భయంగొలిపె భయంకర ఆకలితో అల్లాడుతున్న ప్రజల చిత్రం మన కళ్ల ముందు కదులుతుంది. పుట్టుకతో 10 శాతం, 5 సంవత్సరాలలోపు 25 శాతం పిల్లల మరణాలున్నాయి. ఇక ఆకలి చావులు, అర్ధాకలి బతుకుల బాధల గాధలు కోకొల్లలు. అక్కడి వనరులు కొల్లగొట్టడం పూర్తయ్యేవరకు సోమాలియా కూడా వెలిగిపోతుందనే ఆ ప్రజల్ని నమ్మించి మోసబుచ్చారు.

పేద దేశాల్లోనేకాదు సంపన్న దేశాల్లోను ప్రకృతి సిద్ధమైన కరువు కాటకాలు సంభవించినపుడు, ఇప్పుడైతే ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో కూడా ఆకలి రక్కసి పేదలను కరువు దాడులకు ఉసిగొల్పుతుంది. అలాగే సోమాలియాలోని ఆకలి జీవులు మొదట స్థానిక మత్స్యకారులు విదేశీ మరపడవలను స్వాధీనపరుచుకునేవారు. అదే క్రమంలో ఆయుధాలు సమకూర్చిఅంతర్జాతీయ జలాల్లో కూడా విదేశీ వాణిజ్య నౌకల్ని హైజాక్ చేయగల స్థితికి ఎదిగించారు. సముద్రపు దొంగల పరిస్థితులు మారాయి. వీటిని నడిపిస్తున్న శక్తులు దీనిని కూడా ప్రాంతాల ప్రాతిపదికన, లాభసాటైన వ్యాపారంగా మార్చుకుంటున్నారు. ఇప్పుడవి ఆకలి కడుపుల అన్నార్తుల కరువు దాడులుకావు. ఇవి కార్పోరేట్ సంస్థల చేతిలోని వాడైన ఆయుధాలు.

సముద్రపు దొంగలు ప్రపంచమంతా ఉన్నారు. ఎవరి అధీన ప్రాంతాలు వారివి. ఎదుటివారిని దెబ్బకొట్టడమే వ్యాపారనీతి. యుద్ధ నీతి. ఇప్పటికీ అనేక నౌకలు, వందల మంది సిబ్బంది పైరేట్స్ ఆధీనంలోనే వున్నాయి. వారానికి ఒకటో రెండో దాడుల గురించి అంతర్జాతీయ వార్తలు వస్తూనే వున్నాయి. స్పీడ్ బోట్స్, రాకెట్స్, గ్రెనేడ్స్ సహకారంతో సూపర్ ట్యాంకర్ గల పెద్ద పెద్ద నౌకల్నే దాడి చేసి కొల్లగొడుతున్నారు. వ్యాపార సంస్థల మధ్య పోటీ కారణంగా మెజారిటీ హైజాకింగ్ ఉదంతాలు రహస్యమంతనాలు, సొమ్ము చెల్లించడంలో ముగుస్తున్నాయి. ఇవి ఒక్కోసారి సంవత్సరానికి 100 దాటుతున్నాయి.

---

➡

ప్రజలు ఈ హత్యలను హర్షిస్తుంటే ప్రభుత్వం మురిసిపోతోంది. నిజానికి సిగ్గుతో తలదించుకోవాలి. ప్రజలు హర్షిస్తున్నారంటే తగిన శిక్షపడుతుందనీ, అదీ సకాలంలో పడుతుందనీ నమ్మకం వుంటే ఈనాడు ప్రజలు ఈ హత్యలను హర్షించి వుండేవారు కాదు. చంపడానికి మీరెవరు? అది న్యాయస్థానాల విధి కదా అని ప్రశ్నించేవారు. కానీ చట్టాలపట్ల, న్యాయస్థానాల పట్ల ప్రజలకు విశ్వాసం పోయింది. కోర్టుల్లో ఏళ్లకేళ్లు సాగే విచారణపట్ల వాళ్లు విసిగెత్తిపోయారు. అందుకే తాము కోరుకున్న తీర్పు ఏ రూపంలో వస్తేనేం అదే పదివేలు అనుకున్నారు.

నిజానికి ప్రజలు ఈ హత్యలను తీవ్రంగా ఖండించాలి. ఓ ముగ్గురు ఉన్మాద యువకులు చేసిన దాడికంటే, ఒక వ్యవస్థ చేసిన హత్యలు చాలా ప్రమాదకరమైనవి. ఇక్కడ స్పష్టంగా అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే స్వప్నికను హత్య చేసింది ఈ వ్యవస్థనే. ఇటువంటి ప్రేమోన్మాద దాడులను పెంచుతున్నది ఈ వ్యవస్థనే. సమస్యను సృష్టిస్తున్న వ్యవస్థనే ఒక తప్పుడు పరిష్కారాన్ని చూపిస్తూ, ప్రజలను కూడా అటువైపు నెడుతూ తాను నిర్దోషినని నమ్మబలుకుతోంది.

ప్రభుత్వపు ఈ కుట్రను ప్రజలు అర్థం చేసుకోవాలి. ఈ సమస్యకు చూపుతున్న తప్పుడు పరిష్కారాన్ని ఎండగట్టాలి. నిజమైన పరిష్కారం కొరకు సామ్రాజ్యవాద విష సంస్కృతికీ, దాన్ని పెంచిపోషిస్తున్న దోపిడీ పాలకవర్గాలకూ వ్యతిరేకంగా పోరాడాలి. తమ బిడ్డలు ఇలా బలికావొద్దని కోరుకునే తల్లిదండ్రులూ, తమ కొడుకులు ఇలా మృగాలుగా మారవద్దని కోరుకునే తల్లిదండ్రులూ ఈ పోరాటాల్లో చురుగ్గా పాల్గొనాలి. అప్పుడే స్వప్నిక, ప్రణీతలు బలికారు, శ్రీనివాస్‌రావు, హరిక్రిష్ణ, సంజయ్‌లు నేరస్తులుగా మారరు. ★

ఆడెన్ జలసంధిలో ఇతర దేశాల నౌకలు దాడులకు గురవుతున్నా భారత నౌకా దళం మాత్రం పైరెట్స్‌ను ఎదుర్కోవడం విశేషమే. 2008, నవంబర్ 11న మన దేశ వాణిజ్య నౌకను, సౌదీ నౌకను హైజాక్ చేయడానికి ప్రయత్నించినపుడు నావికా దళం తిప్పికొడితే, భారత యుద్ధనౌక ఇ.ఎన్.ఎస్. తాబర్ సముద్రపు దొంగల మాతృ నౌకను ధ్వంసం చేసింది.

1560 నుండి 1700 కాలంలో కరేబియన్ సముద్రపు దొంగలంటే వాణిజ్య నౌకల వారికి హడల్. ప్రపంచీకరణతోపాటు వాణిజ్యం పెరిగింది. సముద్ర రవాణా పెరిగింది. సముద్రపు దొంగతనం (పైరసీ) కూడా పెరిగింది. ఇటీవలి వరకు మలాకా జలసంధి పైరేట్స్‌కు స్వర్గధామంగా పేరు. ఇప్పుడు ఆ పేరు ఆడెన్ జలసంధికి మారింది. కరేబియన్ జలాల్లోగాని, ఆడెన్ జలసంధిలోగాని పైరసీ పెరగడానికి వలసల, వ్యాపార సంస్థల మధ్య పెరిగిన గొంతులు కోసుకునే పోటీయే కారణం.

ఆనాడు కరేబియన్ దేశాలపై స్పెయిన్‌దే ఆధిపత్యం. స్పెయిన్ నౌకలపైన అమెరికా తూర్పు, ఆఫ్రికా పశ్చిమ తీరాలలో కలవరం సృష్టించిన ఇంగ్లండు, ఫ్రాన్స్, డచ్, పోర్చుగీస్ దేశాల సముద్రపు దొంగల వెనుకనున్నది తెల్లదొరలే, స్పెయిన్, ఆస్ట్రియాల మధ్య జరిగిన యుద్ధాల సందర్భంగా, యూరప్‌లో బలా బలాల సమతూకం దెబ్బతిన్నప్పుడు నడి సముద్రంలో పైరసీ పెరిగిపోయేది. ఈ పనిని అప్పుడప్పుడు స్వయంగా ప్రభుత్వాలే చేసాయి అనడానికి ఆధారాలున్నాయి.

ఆర్థిక సంక్షోభాలకు, ఆకలి దాడులకు వున్న సంబంధంతోనే పైరసీని చూడాలి. 1900 సమీపిస్తున్న కాలంలో ఇండోనేషియా, ఫిలిప్పైన్స్ మున్నగు దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోయినపుడు మలాకా జలసంధిలో నౌకాయానం ప్రమాదంగా మారింది. ఇప్పుడు అమెరికా అగ్రరాజ్యంతో సహా ప్రపంచ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభానికి చేరిన సందర్భంగా మరల పైరసీ పెరిగింది. ఇది ఆర్థిక సంక్షోభ ప్రతిఫలనమే. వారిచేత ఆడిస్తున్న విచిత్రమైన దొంగల ఆట ఇది. సామ్రాజ్యవాదుల వలస విధానం స్థానంలో నయా వలస విధానం వచ్చింది. ఆర్థిక రాజకీయ సంక్షోభం పీకల్లోతుల్లో వున్న నేటి స్థితిలో తిరిగి పంపకాల కోసం పోటీపడుతున్నాయి సామ్రాజ్యవాద దేశాలు. ఆకలి, ఆయుధం రెండింటిని సమంగా నడిపి యుద్ధాలు సృష్టించే దోపిడీ వ్యవస్థ, బడుగు దేశాల పేద ప్రజల్ని దొంగలుగా ముందుపెట్టి పైరసీ చేయిస్తుంది. అక్రమ వ్యాపారాలు, అక్రమ రవాణా, సముద్రపు దొంగతనాలు ఇవన్నీ బడా పెట్టుబడిదారులవే. వీటి ద్వారా జరిగే హింస, విస్తరించే విషసంస్కృతికి బలయ్యేది మాత్రం సామాన్యులే. ఈ దుర్మార్గమైన వ్యవస్థ నాశనం కాకుండా ప్రత్యామ్నాయ ప్రజారాజ్యాలు ప్రపంచమంతా ఏర్పడకుండా పైరసీని అడ్డుకోలేం. పైరసీ అనేది ఈ వ్యవస్థలో పుట్టిన చెడు కార్యకలాపమే. దీని మూలాలను ఛేదించే కృషితో దీనికి అంతం పలకాలి. ★

---

**మనం ఐక్యతా కాంగ్రెస్ - 9వ కాంగ్రెస్‌లో నిర్ణయించుకున్న లక్ష్యాన్ని సాధించడం అనేది ప్రజల్ని వర్గ పోరాటాల్లో, ప్రజా యుద్ధంలో ఎంత క్రియాశీలంగా, విస్తృతంగా కదిలిస్తున్నాం అనేదానిపై ఆధారపడి వుంటుంది. అలాగే మనం ప్రజా నిర్మాణాలన్నింటినీ ఎంత బాగా రాజకీయంగా విద్యావంతం చేసి చైతన్య పరుస్తున్నాం, ఎంత సుదృఢంగా సంఘటితపర్చి క్రియాశీలంగా పయనిస్తున్నాం అనేదానిపై ఆధారపడి వుంటుంది. మన ప్రతి నూతన పథక రచనకూ, పోరాటానికీ, విజయానికీ పునాదీ, గ్యారంటీ ప్రజలే - ప్రజలు మాత్రమే. 'ప్రజలు - ప్రజలు మాత్రమే చరిత్ర నిర్మాతలు'.**

(పార్టీ 5వ స్థాపనా దినం సందర్భంగా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి దండకారణ్య కామ్రేడ్స్‌కు పంపిన సందేశం నుంచి)

# సింగారం హత్యాకాండకు ప్రజలు తప్పక బదులు తీర్చుకుంటారు!

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు మారణకాండకు వ్యతిరేకంగా ఉద్యమించండి!!

ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం మారణకాండ మరొకసారి జడలు విప్పింది. 2009 జనవరి 8వ తేదీన గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగారం, కొర్రోసుగూడెం, చెంచం(దంతేశ్వరిపురం), మైలూరు (మైలసూర్) గ్రామాలపై పోలీసులు, వందలాది జుడుం గూండాలు, ఎస్.పి.ఒ.లు సల్వాజుడుం నాయకుడు సోయం మూకాను వెంటపెట్టుకొని వచ్చి దాడి చేసి నలుగురు మహిళలపై అత్యాచారం జరిపి, ఆరుగురు మహిళలతో సహా 18 మంది అమాయక ఆదివాసులను పొట్టనబెట్టుకున్నారు.

జనవరి 7వ తేదీన కొంట, వింజరం, ఎర్రబోరు, దోర్నపాల్, మారాయిగూడెం శిబిరాల నుండి పోలీసులతో కలిసి వందలాది సల్వాజుడుం గుండాలు, జుడుం నాయకులు, ఎస్.పి.ఒ.లు బెజ్జి శిబిరానికి చేరుకున్నారు. జనవరి 8వ తేదీన సింగారం గ్రామాన్ని లక్ష్యంగా చేసుకుని బెజ్జి నుండి మార్గం మధ్యలో గల మైలూరు, చెంచం, కొర్రోసుగూడెం గ్రామాలపై కూడా దాడులు చేసి ఈ నాలుగు గ్రామాలకు చెందిన 30 మంది అమాయక ప్రజలను నిర్బంధించారు. వీరిని సింగారం-వెంజల్‌వాయి గ్రామాల మధ్య గల చిన్న వాగు దగ్గరకు తీసుకువెళ్లి, నలుగురు మహిళలపై అత్యాచారం జరిపి, ఆరుగురు మహిళలతో సహా 17 మందిని అతి పాశవికంగా కాల్చి చంపారు. మరొక ముగ్గుర్ని పరుగెత్తమని వెనక నుండి కాల్పులు జరపగా కాల్పుల్లో ఒకరు చనిపోయారు. ఈ దారుణ హత్యాకాండలో సింగారం గ్రామానికి చెందిన మడకం రాజు, మడకం సీత, కారం లచ్చ, కారం ముత్త; కోర్రోసు గూడేనికి చెందిన మాడవి ఇడుమాల్, మాడవి కన్న, మాడవి భీమ, ఏమ్ల అడమాల్, మడకం దేవి; చెంచం గ్రామానికి చెందిన వేకో బండి, వేకో జోగ, వేకో పొజ్జ, మాడవి దేవి, మడకం ఇడుమాల్, ఏమ్ల సుక్కాల్, ముచ్చకి గంగ, ముచ్చకి దూలే; మైలసూర్ (మైలూరు) గ్రామానికి చెందిన వెట్టి అడమాల్‌లు చనిపోయారు. ఇంకా నలుగురు జాడ తెలియటంలేదు. మరుసటి రోజు నాలుగు గ్రామాల ప్రజలు సంఘటనా స్థలానికి వెళ్లి చనిపోయిన తమ సహచర గ్రామస్తుల మృతదేహాలను తీసుకుని, సంఘటనను పత్రికా విలేఖరుల ముందుంచి, ఈ దారుణ మారణకాండను బాహ్య ప్రపంచానికి తెలియపరచి మృతదేహాలకు దహనసంస్కారాలు నిర్వహించారు. మావోయిస్టు ఉద్యమం అణచివేత పేరున కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఫాసిస్టు రమణ్‌సింగ్ బి.జె.పి. ప్రభుత్వం జరిపిన ఈ హత్యాకాండకు నిరసనగా జనవరి 24వ తేదీన సి.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ నిర్వహించిన బంద్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.

2005లో ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్ బి.జె.పి. ప్రభుత్వం, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు మహేంద్ర కర్మతో కుమ్మక్కై, అతడి నాయకత్వంలో సర్వం విధ్వంసం సల్వాజుడుం రాజ్యహింస మారణకాండ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఇప్పటి వరకు 600 మంది ఆదివాసులను చంపి, 800 గ్రామాలు ధ్వంసం చేసి, వందలాది మహిళలపై అత్యాచారాలు జరిపి, వేలాది మంది ప్రజల్ని అరెస్టులు చేసి సల్వాజుడుం శిబిరాల్లో (కాన్‌సంట్రేషన్ క్యాంపుల్లో) నిర్బంధించింది. జీవించే హక్కుతో సహా ప్రజల ప్రాథమిక హక్కులన్నింటిని కాలరాచివేసింది. సామ్రాజ్యవాదుల, స్వదేశీ దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాలను నెరవేర్చడానికి ఛత్తీస్‌గఢ్‌లో, ముఖ్యంగా దండకారణ్యంలోని ఖనిజ సంపదను, వనరులను వారికి దోచిపెట్టడానికీ, అందుకు ఆటంకంగా వున్న మావోయిస్టు విప్లవోద్యమాన్ని, ప్రజలను అణచడానికి రమణ్‌సింగ్ ప్రభుత్వం ఇంతటి దారుణాలకు పాల్పడింది. అయితే ఈ మారణకాండను మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు ధీటుగా ఎదుర్కొని ఓడించారు. సల్వాజుడుం నిజస్వరూపాన్ని ప్రపంచానికి బట్టబయలు చేశారు. ప్రజల తీవ్ర ప్రతిఘటనకు జంకి, తన దుర్మార్గాలను కొనసాగించటంలో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. కాని, అవకాశం దొరికినచోట మోసపు దాడులు చేస్తూనే వుంది. వేలాది పోలీసు బలగాలను దింపి 5-8 కి.మీ.ల కొకటి చొప్పున పోలీసు క్యాంపులతో కార్పెట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసి, బస్తర్‌ను కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపుగా మార్చాలని ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ దుర్మార్గాలను ప్రశ్నించే గొంతులను నొక్కి వేయడానికి డాక్టర్ వినాయక్‌సేన్ లాంటి

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

ప్రజాస్వామికవాదులనూ, మేధావులనూ మావోయిస్టులుగా ముద్రవేసి జనసురక్షా కానూన్ పేరున కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధించింది. ఎన్నికల సమయంలో కూడా సల్వాజుడుం మూకలు, పోలీసులు గ్రామాలపై దాడులు చేసి, ప్రజలను ఎత్తుకుపోయి చంపి, మారణకాండను కొనసాగిస్తూనే వున్నారు. ఈ ప్రభుత్వ దమనకాండపై పౌరహక్కుల సంఘాలు, మేధావులు ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం నుంచి జవాబు లేదు.

ఎన్నికల్లో వేలాది పోలీసు బలగాలను మోహరించి, రిగ్గింగ్‌తో అధికారం చేజిక్కించుకుని, ఇంతకాలం తను జరిపిన మారణకాండకు దాన్ని సాధికారతగా ప్రకటించుకుంటూ, తిరిగి సల్వాజుడుం క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తామని రమణ్‌సింగ్ బి.జె.పి. ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల అనంతరం ఆదివాసుల ఆస్తులను, నోటి దగ్గరికి వచ్చిన పంటలను ధ్వంసం చేస్తూ సామూహిక హత్యాకాండను మళ్లీ ప్రారంభించింది. ఈ మొత్తం 3 సంవత్సరాల సల్వాజుడుం అభియాన్ కాలంలో దోపిడి పాలకవర్గాల బెదిరింపులకు లొంగకుండ పోరాడుతున్న దండకారణ్య ప్రజానీకంతో కలిసి సింగారం, కొర్రోసు గూడెం, చెంచం, మైలూరు గ్రామాల ప్రజలు ప్రతిఘటిస్తూ దృఢంగా నిలబడ్డారు. ఎ.పి.గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కలిసి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాలపై అనేకసార్లు జరిపిన దాడులను కూడా ఈ గ్రామాల ప్రజలు ఎదుర్కొని తిప్పికొట్టారు. ఎనికల్లో కొంట నుండి నారాయణ్‌పూర్ వరకు బస్తర్ వ్యాప్తంగా వందలాది గ్రామాల్లో ప్రజలు ఓట్లువేయకుండా ఎన్నికలు బహిష్కరించటం, సల్వాజుడుంను ప్రతిఘటించటం, ప్రజలు తమ స్వంత రాజ్యాధికారాన్ని స్థాపించుకుంటూండటాన్ని సహించని ప్రభుత్వం కక్షగట్టి పాశవిక దాడి క్యాంపెయిన్ తిరిగి ప్రారంభించే పథకం పన్నింది. ఆ పథకంలో భాగంగా మొదటగా ఈ గ్రామాలపై మారణకాండ జరిపించింది.

కాని, అమాయకులపై జరిపిన ఈ దారుణ మారణకాండను రమణ్‌సింగ్ ప్రభుత్వం మావోయిస్టులపై జరిపిన దాడిగా ప్రచారం చేసుకుంటున్నది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం జరిపించిన సల్వాజుడుం హత్యాకాండను మావోయిస్టు ఉద్యమ అణచివేత పేరున ప్రజలపై ప్రభుత్వం సాగిస్తోన్న దమనకాండ అనేది ప్రపంచమంతా గ్రహించింది. ఇది కూడా ఫాసిస్టు రమణ్‌సింగ్ ప్రభుత్వం జరిపించిన నూటికి నూరు శాతం క్రూరహత్యాకాండేనని, దీనిపై న్యాయవిచారణ జరిపించాలని ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఘంటాపదంగా డిమాండ్ చేశారు. అందుకే ఖననం చేసిన మృతదేహాలకు తిరిగి పోస్టుమార్టం నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. ఈ సంఘటన తర్వాత కేంద్ర హోంమంత్రి చిదంబరం ఛత్తీస్‌గఢ్‌కు వచ్చి నక్సల్స్ అణచివేతకు రమణ్‌సింగ్ ప్రభుత్వానికి కావలసిన అన్ని విధాల సహాయం అందిస్తామని ఈ దారుణ మారణకాండకు మద్దతు ప్రకటించాడు. దేశంలో వామపక్ష తీవ్రవాదమే ప్రధాన ప్రమాదమంటున్న మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కోబ్రా బెటాలియన్లు, జంగిల్ వార్ ఫేర్ స్కూళ్లు, అత్యాధునిక ఆయుధాలు అందించి ఈ మారణకాండను కొనసాగించడానికే నిశ్చయించింది.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు దండకారణ్యాన్ని ధారాదత్తం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా సాగిస్తున్న ఈ క్రూర మారణకాండను ఓడించేందుకు దండకారణ్య ప్రజానీకం రాజీలేని పోరాటాల్లో మిలిటెంట్‌గా పోరాడాలి. పోరాడడం ద్వారానే వీటిని అడ్డుకోగలమని ప్రజలు తమ అనుభవం ద్వారా గ్రహించారు. పోరాడకుంటే మరిన్ని హత్యాకాండలు జరిపేందుకు దోపిడీ పాలవర్గాలు వెనుదీయవు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా సాగిస్తున్న ఈ క్రూర మారణకాండను దండకారణ్య ప్రజానీకం తప్పక ఓడిస్తారు. దండకారణ్యాన్ని నెత్తురుటేరుల్లో ముంచజూసిన ఫాసిస్టు ప్రభుత్వ పోలీసు బలగాలను, సల్వాజుడుం మూకలను ఈ ఆదివాసీ ప్రజలే తరిమి కొట్టారు. నాగా ఫోర్స్‌ను, మిజో ఫోర్స్‌ను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించి దండకారణ్యం వదిలిందాక ఈ ప్రజలే దాడులు చేశారు. శత్రు గుండెల్లో మందుపాతరలు పేల్చిన ఎర్రబోరు, రాణిబోదిలి దాడులు, ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల, తోంగూడ, గొల్లపల్లి తదితర ఆంబుష్‌ల సాక్షిగా సింగారం పరిసర గ్రామాల ప్రజలపై జరిపిన హత్యాకాండకు ప్రజలు తప్పక బదులు తీర్చుకుంటారు.

మావోయిస్టు పార్టీ నాయకత్వంలో నేడు దండకారణ్య ప్రజానీకం భూమి, అడవి, నీరు మొదలైన సమస్త వనరులు, సంపదలపై తమ హక్కును ప్రకటిస్తూ, ప్రజారాజ్యాధికార అంగాలను నిర్మించి, స్వంత రాజ్యాధికారాన్ని స్థాపించే వైపు అడుగులు వేస్తున్నారు. సల్వాజుడుం మారణకాండలో అశువులుబాసిన ప్రజల త్యాగాల సాక్షిగా, ప్రజాయుద్ధంలో అమరులైన ప్రజాయోధుల త్యాగాల సాక్షిగా, తర తరాలుగా తమపై సాగుతున్న దోపిడిని అంతం చేసి, ప్రజల నిజమైన రాజ్యాధికారాన్ని స్థాపిస్తారు. ★

**మన పార్టీ నాయకత్వాన్నీ, కేడర్లనూ, ఉద్యమాన్నీ రక్షించుకోవడానికి ఎల్.ఐ.సి. కుటిల పథకాల్ని, ఎత్తుగడల్ని విఫలం చేద్దాం!**

*(...21వ పేజీ తరువాయి)*

కుట్ర, రాబోయే పెను ప్రమాదం అర్థమవుతుంది. ముడి చమురు, ఆహార ధాన్యాలు, నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగి పోవడం వెనుక ఆహార ధాన్యాల కొరత, దారిద్ర్యం, ఆకలి పెరగడంతో 4 కోట్ల మంది 2008 సంవత్సరంలోనే కొత్త బిచ్చగాళ్లయ్యారు. ఆర్థిక మాంద్యం పర్యవసానాలు మరీ భయంకరం. నిజవేతనాలు పడిపోయి, రూపాయి విలువ తగ్గి, ద్రవ్యోల్బణం పెరగడంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది, మార్కెట్ కృశించింది. పరిశ్రమలు, ఉత్పత్తి తగ్గి కొత్తగా 2 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగం పెరిగింది. ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం వుంది. స్పెక్యులేషన్ ద్వారా వికటించిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అమెరికన్ అగ్రరాజ్యం కేంద్రంగా నడిచిన ఆర్థిక వ్యవస్థనే అనే వాస్తవం మరువకూడదు. అందులో మౌలికంగా ఎటువంటి మార్పు జరగలేదు. కనుకనే ఒక రంగంలోని సంక్షోభం బ్యాంకుల్ని, కార్పోరేట్ సంస్థల్ని, ప్రభుత్వాలను, కుదిపి సమస్త రంగాలకు విస్తరించి ప్రపంచ సార్వత్రిక సంక్షోభ స్థితికి వెళ్లిపోయింది. రుణాల రద్దు, వడ్డీ రేట్ల తగ్గింపు, వందల వేల బిలియన్ డాలర్ల ప్రోత్సాహక ప్యాకేజీలు, సామ్రాజ్యవాద దేశాల పరస్పర సర్దుబాట్లు లాంటి చిట్కాలు ఏవీ ఈ సంక్షోభ తీవ్రతను తగ్గించలేదు సరికదా ఈ తాత్కాలిక అతుకుల వలన భవిష్యత్‌లో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా స్థిరత్వాన్ని కోల్పోతుంది.

పై ఆర్థిక సంక్షోభ స్థితికి అమెరికాలో అనుసరించిన యుద్ధోన్మాద సైనిక కార్యకలాపాలు, ఆధిపత్య రాజకీయాలే కారణం. ఇరాక్ ఆఫ్ఘన్‌ల మీద దాడులు చేసి ఆర్థికంగా, రాజకీయంగా సంక్షోభంలోకి ఇరుక్కోవడమేకాకుండా నైతికంగా ప్రతిష్టను కోల్పోయింది. ప్రపంచాధిపత్యం కోసం సామ్రాజ్యవాద కూటములను ఏర్పరచడంలో మార్కెట్ కూటములు, సైనిక ఒప్పందాలతో విన్యాసాలు చేస్తూ స్థావరాలు ఏర్పరచుకుంటూ ఆసియాను లక్ష్యంగా పెట్టుకుని భారత్‌ను పావుగా వాడుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అమెరికా-భారత్ అణుఒప్పందం అందులో భాగమే. ఇరాక్ నుండి సేనలను వెనక్కి తీసుకుని ఆఫ్ఘన్ కేంద్రంగా బలగాలను తరలిస్తూ దక్షిణాసియాను, ఇజ్రాయిల్ కేంద్రంగా పశ్చిమాసియాను కంట్రోల్ చేసే పథకాలను అమలు చేస్తుంది. ఆసియాలో మార్కెట్ పోటీదారు జపాన్‌ను, ఆర్థిక, సైనిక శక్తిగా ఎదుగుతున్న చైనాను ఎదుర్కొనేందుకు ముందస్తు పథకాలతో సిద్ధమవుతుంది. ఇది అమెరికా ముందున్న ప్రపంచ యుద్ధ వ్యూహం.

వ్యవస్థను పక్కనబెట్టి వ్యక్తుల్ని ముందుకుతెచ్చి వ్యక్తులే ప్రధానమని, అంతా మారిపోయిందని చెబుతున్న అవాస్తవాలను గత చరిత్ర వెంటబెట్టుకొచ్చిన వాస్తవాలు వెక్కిరిస్తున్నాయి. నల్ల జాతిని అణచివేసి బానిసత్వాన్ని అమలు చేసిన వ్యవస్థలో ప్రజాస్వామ్యం నెలకొన్నదని ఆ ప్రజాస్వామిక శక్తే ఒబామా లాంటి మిశ్రమ జాతి సంతతికి చెందిన వ్యక్తిని అధ్యక్షుడుగా ఎన్నుకుందని చెబుతూ అమెరికా అగ్రరాజ్య స్వభావాన్ని మరుగుపరచడానికి ప్రయత్నిస్తున్నారు. పూర్తి నల్ల జాతీయుడే భవిష్యత్తులో అధ్యక్షుడయ్యే రోజు వస్తుందని నమ్మబలుకుతున్నారు. నిజానికి ఒబామాను నల్లజాతికి చెందిన నిజమైన ప్రతినిధిగా చూడగలమా? ఈ ఎన్నిక జాతివివక్షను రూపు మాపుతుందా? ఇప్పటి వరకు ఈ వ్యవస్థను నడుపుతున్న అగ్రరాజ్య శక్తులు దోపిడీ వర్గ శక్తులే. ఈ వ్యవస్థ మౌలికాంశాలు ఏమాత్రం మార్చకుండా ఒబామాను తెచ్చి నల్లజాతి చరిత్రను కీర్తిస్తూ, పోయిన తమ ప్రతిష్టను నిలుపుకునే దుష్ట ప్రయత్నం వుందిక్కడ.

అమెరికా అధ్యక్షులు జార్జి బుష్, క్లింటన్, జార్జి డబ్ల్యు.బుష్‌లతో సహా గత కాలంలో రిపబ్లికన్ పార్టీ అయినా, డెమోక్రటిక్ పార్టీ అయినా అమెరికా ప్రజలను, ప్రపంచ ప్రజలను దోచుకుని అణచివేసినవే తప్ప పార్టీపరంగా భిన్నంగా ప్రజలకు చేసింది శూన్యం. ఇప్పుడూ అదే జరుగుతుంది. కాబట్టి ప్రజల ఆగ్రహాన్ని దారిమళ్లించే కుహనా ప్రజాస్వామ్య ప్రక్రియతో పార్టీ పేరు, మనిషి ముఖం మారుస్తూ అవే యుద్ధ రాజకీయాలను నడుపుతున్నది అమెరికా.

బరాక్ ఒబామా ముందున్న సమస్యల స్వభావాన్ని, ఒబామా చరిత్రను కల్పనల నుండి విడదీసి చూస్తే భవిష్యత్‌లో ఒబామా చేయబోయే పనులు స్పష్టమే. వ్యవస్థీకృతమైన ఆర్థిక సంక్షోభ మూలాల్ని, అమెరికా అగ్ర రాజ్య స్వభావాన్ని, యుద్ధోన్మాద చర్యల్ని నిస్సందేహంగా కొనసాగించి కార్పోరేట్ శక్తులకు నమ్మినబంటుగా నిరూపించుకుంటాడని తేట తెల్లమవుతుంది. అప్పటి వరకు అమెరికా ప్రజల్ని, ప్రపంచ ప్రజల్ని ముఖ్యంగా 11 శాతంగా వున్న అమెరికాలోని నల్ల జాతీయుల్ని ఆఫ్రికా ఖండంలోని నల్లజాతి వారిని, అలాగే పీడితుల ఆకాంక్షలు నెరవేరడానికి దగ్గర మార్గాలు కోరుకునే మితవాద సంస్కరణవాదుల్ని ఒబామా నల్లజాతి నాయకుడుగా నిలిచి మోసం చేయగలడు. అమెరికా అగ్రరాజ్య ఆధిపత్య రాజకీయాలకు, ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానాలకు, యుద్ధోన్మాద చర్యలకు బలయిపోతున్న ప్రపంచ పీడిత జాతులు, ప్రజలు మాత్రం ఒబామాను, అమెరికా దుష్టపన్నాగాలను ఎదిరించి తీరుతారు. ఒబామాను అమెరికా అగ్రరాజ్య కార్పోరేట్ శక్తుల ఏజెంట్‌గానే చూస్తారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం సుళ్లు తిరుగుతూ విప్లవ సంక్షోభంగా రూపొందే క్రమంలో అమెరికా దేశాధ్యక్షుడు ఒబామా అగ్రరాజ్య శక్తికి నికార్సయిన ఏజెంట్‌గా బయల్పడిపోతాడు.

★

# దేశంలో అన్ని జైళ్లలోని పరిస్థితులు మెరుగుపరచాలని, రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ ఐక్య ఉద్యమాలను నిర్మిద్దాం

నేరాలను అదుపుచేసి, సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించే ప్రక్రియలో జైళ్లు ఒక భాగమని ప్రభుత్వాలు చెప్పుకుంటాయి. కానీ ఘరానా నేరాలు చేసేవాళ్లు, సమాజ మనుగడకు ముప్పుగా వుండేవారూ పెద్ద మనుషులుగా చెలామణీ అవుతూ స్వేచ్ఛగా బతుకుతుంటే సాధారణంగా ఏ నేరమూ చేయనివాళ్లు, చిన్నా చితకా నేరాలు చేసిన వాళ్లు సంవత్సరాల తరబడి జైళ్లల్లో మగ్గిపోతున్నారు. హత్యలూ, అత్యాచారాలు వంటి తీవ్రమైన నేరాలు చేసిన కొందరు సైతం జైళ్లల్లో వుంటున్నారు. నిజానికి మనుషులు నేరస్తులుగా తయారవడంలో వ్యవస్థ పాత్రే ప్రధానమైంది. అసలు వ్యవస్థనే నేరపూరితమైనది. కానీ అది తన నేరాన్ని కప్పిపుచ్చుకుంటూ కొందరు వ్యక్తులను దోషులుగా నిలబెడుతుంది. పైగా వ్యవస్థ మీద భ్రమలను నిలబెట్టడం కోసం చట్టం, న్యాయం, నేరం, విచారణ, శిక్ష అంటూ కొద్ది మందిని జైళ్లలో పెడుతుంది.

ఈ దోపిడీ వ్యవస్థ మనుగడకు విప్లవకారులు ఆటంకం గనుక ఆ అడ్డు తొలగించుకోవడానికి ఎన్‌కౌంటర్ల పేర్లతో విప్లవకారుల భౌతిక నిర్మూలనకే అది పాల్పడుతున్నది. అనివార్య పరిస్థితుల్లో అరెస్టు చూపించి జైల్లో పెడుతున్నది. అలా నిర్బంధించిన వారిని ఏళ్లతరబడి జైళ్లల్లో మగ్గిపోయే విధంగా అనేక తప్పుడు కేసులు పెట్టి శిక్షలు వేస్తున్నారు. పాలకులే తయారు చేసుకున్న చట్టాలను సహితం నామమాత్రంగానైనా పాటించకుండా జైళ్లలోని విప్లవకారులపట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా జైళ్లలో ఎందరో విప్లవకారులు మగ్గుతున్నారు. సి.పి.ఐ.(మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ మల్లా రాజిరెడ్డి, నారాయణ సన్యాల్, షీలా దీదీ తదితరులు జైళ్లలో మగ్గుతున్నారు. ఎ.పి.లోని చర్లపల్లి జైల్లో కామ్రేడ్స్ మల్లా రాజిరెడ్డి, సుదర్శన్‌తో సహా ఏడుగురు, చెంచల్‌గూడ జైలులో కామ్రేడ్ బాల గణేష్‌తో సహా నలుగురు, వరంగల్‌లో ఆయుధ విభాగానికి చెందిన కామ్రేడ్స్‌తోపాటు మొత్తం 72 మంది నక్సల్స్ కేసుల్లో వున్నారు. కడపలో సాగర్‌తో సహా ఐదుగురు, విశాఖలో కా. గోపు సమ్మిరెడ్డితో సహా మరికొందరు, ఆసిఫాబాద్ జైలులో కా. కామెర చంద్రయ్య, నెల్లూరులో కా. మాధవి వున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎందరో కామ్రేడ్స్ ఇతర రాష్ట్ర జైళ్లల్లో మగ్గుతున్నారు. నాగ్‌పూర్ జైల్లో కామ్రేడ్స్ గోపన్న, చంద్రమౌళి తదితరులు, రాయపూర్‌లో కామ్రేడ్స్ మాలతి, గీతలు; జగ్దల్‌పూర్‌లో కామ్రేడ్స్ నిర్మల, పద్మలు; కర్ణాటకలో కా. శ్రీనుతో సహా 21 మంది అనంతపూర్ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. అలాగే వరంగల్ జైల్లో 5గురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు వున్నారు. ఇంకా దేశవ్యాప్తంగా కేంద్ర కమిటీ నేతలు వివిధ జైళ్లల్లో నలుగుతున్నారు. కామ్రేడ్ నారాయణ సన్యాల్ రాయ్‌పూర్ జైల్లో వున్నారు. కా. షీలా దీదీ రాంచి జైల్లో వున్నారు. ఇలా దేశవ్యాప్తంగా పూర్తికాలపు కార్యకర్తలేగాక ప్రజా సంఘాల సభ్యులు, సానుభూతిపరులు మావోయిస్టు కేసుల్లో నిర్బంధించబడి వున్నారు. అసలే సంబంధంలేని అమాయకులుకూడా మావోయిస్టులపేరిట నిర్బంధించబడి వున్నారు. ఇతర విప్లవ పార్టీలకు చెందిన కామ్రేడ్స్ కూడా అధిక సంఖ్యలోనే దేశవ్యాప్తంగా నిర్బంధించబడి వున్నారు. వీరిలో జనశక్తి పార్టీకి చెందిన కామ్రేడ్స్ కూర రాజన్న, అమర్ తదితరులు వున్నారు.

ప్రపంచమంతా వ్యతిరేకిస్తున్నా పౌరహక్కుల నాయకుడు, ప్రజాస్వామికవాది వినాయక్‌సేన్‌ను జైల్లో పెట్టి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం హింసిస్తోంది.

ఈ కామ్రేడ్స్ అందరూ చాలా దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. 94లో జైళ్ల దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా ఎ.పిలో నక్సలైట్ ఖైదీలు చారిత్రాత్మకమైన పోరాటాన్ని నడిపారు. ఆ పోరాటాల మూలంగా జైళ్ల పరిస్థితిలో కొంత మెరుగుదల వచ్చింది కానీ మావోయిస్టు పార్టీని దేశ ఆంతరంగిక సమస్యలకు అతి పెద్ద ముప్పుగా భావిస్తూ, ప్రభుత్వం పెంచుతున్న తీవ్ర నిర్బంధ చర్యల్లో భాగంగా నక్సలైట్ ఖైదీలపై కూడా నిర్బంధం పెరుగుతోంది. అందులో భాగంగానే 94లో పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నది. అలాగే నిష్పాక్షిక, వేగవంతమైన విచారణ బెయిల్, పెరోల్, ఫెర్లో, మొదలైన ఖైదీల హక్కులను కాలరాస్తూ, వాళ్లను ఏళ్లతరబడి చీకటి కొట్లల్లో బంధిస్తోంది. సరైన తిండి, బట్టలు, వసతులు లేకుండా చేస్తోంది. పత్రికలూ, సాహిత్యం అందనీయడంలేదు. అత్యవసరమైనప్పటికీ వైద్యం చేయించడం లేదు. ఈ కారణంగా నవంబర్-డిసెంబర్ నెలల్లోనే ముగ్గురు నక్సల్ ఖైదీలు వరంగల్ జైలులో మరణించారు. మృతిచెందిన ముగ్గురిలో సోదె ముత్తయ్య ఖమ్మం జిల్లా ముల్కనపెల్లి గ్రామస్తుడు, కాగా గొర్రెముచ్చు నగేష్ ఇదే జిల్లాకు చెందిన చింతకాని గ్రామస్తుడు

అలాగే కామ్రేడ్స్ బాలగణేష్, తుషార్‌కాంత్, భట్టాచార్య, కనకస్వామి తదితరులు తీవ్ర అనారోగ్యానికి గురైనా సరైన వైద్యం చేయించలేదు. వీళ్ల వైద్యం కోసం ఖైదీలు పెద్దఎత్తున ఆందోళన చేయవల్సి వచ్చింది. మొత్తంగా రాష్ట్రంలో అన్నిరకాల ఖైదీలు, అనారోగ్య కారణంవల్ల సంవత్సరానికి 120-150 మంది చనిపోతున్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

అలాగే భద్రత పేరిట వంటరి ఖైదుల్లో బంధిస్తున్నారు. భోపాల్‌లో అరెస్టయిన ఆయుధ విభాగానికి చెందిన మహిళా కామ్రేడ్స్‌ను చాలా రోజుల వరకూ కాళ్లకూ చేతులకూ సంకెళ్లు వేసి బంధించారు. అలాగే రాయ్‌పూర్‌లో అరెస్టయిన కామ్రేడ్స్ మాలతి, గీతలను వంటరి ఖైదులో బంధించారు. దాన్ని ఈ కామ్రేడ్స్ వ్యతిరేకించడంతో జైలు సిబ్బంది వాళ్ల తలలను గోడకేసి బాది చాలా తీవ్రంగా హింసించారు. నక్సల్ ఖైదీల పట్ల ఎంత అనాగరికంగా ప్రవర్తిస్తున్నారో పై రెండు సంఘటనలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వాలు పథకం ప్రకారం జైళ్లలో చాలా క్రూరమైన అధికారులను నియమిస్తూ విప్లవకారులపై హింసను పెంచుతున్నాయి.

కామ్రేడ్ మల్ల రాజిరెడ్డికి నార్కో అనాలసిస్ చేయాలని ప్రభుత్వం చాలా ప్రయత్నించింది. కోర్టులో పిటిషన్ వేసి పర్మిషన్‌ను కూడా తెచ్చుకుంది. జైలు కామ్రేడ్స్ ఆందోళన చేపట్టి హైకోర్టులో పిటీషన్ వేసి దాన్ని ప్రస్తుతానికి నివారించగల్గారు.

ఎస్కార్ట్ లేదనే నెపంతో విచారణకు తీసికెళ్లకుండా ఆలస్యం చేస్తున్నారు. చట్టబద్ధంగా విడుదల అయినవారిని తిరిగి జైలు గేటు దగ్గరే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారు. సి.సి.ఎం. కామ్రేడ్ నారాయణ్ సన్యాల్‌ను అలాగే అరెస్టు చేసారు.

మాజీలూ, సానుభూతిపరులపై కూడా లెక్కలేనన్ని అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అమరవీరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలయిన స్వరూపపై 35 కేసులుపెట్టారు. అలాగే ఏళ్లకేళ్లు జైళ్లలో మగ్గి వుండేలా శిక్షలు విధిస్తున్నారు. పార్టీ సానుభూతిపరులైన శీలం రమేష్, సముద్రాల మల్లేష్‌లకు 20 యేళ్ల శిక్ష విధించారు. అలాగే కామెర చంద్రయ్య అనే దళసభ్యుడిపై హత్యా నేరం మోపి ఈ మధ్య 5 యేళ్ల శిక్ష విధించారు. కానీ ఈ కామ్రేడ్ జైలు జీవితం ఇప్పటికే అయిదేళ్లు దాటిపోయింది. అయినా విడుదల చేయడం లేదు. కామ్రేడ్ బాలగణేష్ 16 ఏళ్లుగా జైలులో మగ్గుతున్నాడు. తన విడుదలకు ఎన్నిసార్లు డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ములాకత్‌లు నిరాకరిస్తున్నారు. ములాకత్‌లపై నిఘా పెడ్తున్నారు. జైళ్లలోని దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా రాజకీయ ఖైదీల, సాధారణ ఖైదీల సమస్యల పరిష్కారం కొరకు జైలు కామ్రేడ్స్ ఈ మధ్య కాలంలో తరచూ ఆందోళనలు చేస్తున్నారు. శత్రు కోటల నడుమనే పోరాడుతున్నారు. నక్సలైట్ ఖైదీలను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనే ప్రధాన డిమాండ్‌తోపాటు, నక్సలైట్లకు ప్రత్యేక బ్యారక్‌లు, ప్రత్యేక కిచెన్ కేటాయించాలనే మొత్తం 27 డిమాండ్లతో విజ్ఞాపన పత్రాన్ని తయారు చేసి ముఖ్యమంత్రికి ఇచ్చారు. అలాగే సాధారణ రాజకీయ ఖైదీలను భేషరత్‌గా విడుదల చేయాలనే డిమాండ్‌తో జంటనగారాలు, వరంగల్, కడప, మహబూబ్‌నగర్ జైళ్లలో నాలుగు రోజులపాటు నిరాహార దీక్షలు చేసారు. 94 తర్వాత ఈ స్థాయిలో నిరాహారదీక్షలు చేయడం ఇదే ప్రథమం. 2008, మార్చి 8న కామ్రేడ్ షీలాదీ తదితర మహిళా కామ్రేడ్స్ విడుదలను కోరుతూ దేశవ్యాప్తంగా జైలు కామ్రేడ్స్ నిరాహారదీక్ష చేశారు.

ఈ పోరాటాలను మరింత ముందుకు తీసికెళ్లడం కోసం మార్చి-ఏప్రిల్‌లలో 'కమిటీ ఫర్‌ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్' ఏర్పడింది.

ఇలా ఖైదీలను హింసించడం హేయమైనది. అప్రజాస్వామికమైనది. ఖైదీల హక్కులను గుర్తించాలి, గౌరవించాలి. నేడు దేశవ్యాప్తంగా ఖైదీలు చేస్తున్న ఈ పోరాటం న్యాయమైనది. దీనికి ప్రజాస్వామికవాదులు, మేధావులు మద్దతునివ్వాలి. ఖైదీల హక్కులకోసం ఒక బలమైన ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించాలి. ఏళ్లతరబడి మగ్గిపోతున్న సాధారణ ఖైదీలనూ, రాజకీయ ఖైదీలను భేషరత్‌గా విడుదల చేయాలని డిమాండ్ చేయాలి. ★

---

*(...20వ పేజీ తరువాయి)*

స్ఫూర్తిని మిగితా ప్రాంతాలకు అందించాలి. నేడు ఆదివాసీ ప్రాంతాలపై పాలకవర్గాలు కక్షగట్టాయి. రివిజనిస్టులు దానికేం మినహాయింపు కాదు. ఈ పోరాటాన్ని సాకుగా తీసుకొని భవిష్యత్తులో ఈ ప్రాంతంపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడానికి ప్రభుత్వం పథకాలు రచించే అవకాశం వుంది. కనుక ఈ ప్రజానీకానికి మనం దేశవ్యాప్తంగా బలమైన మద్దతును కూడగట్టాలి. బీహార్-ఝార్ఖండ్, డి.కె., ఒడిస్సా వంటి ఆదివాసీ ప్రాంతాల్లో మనం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా బెంగాల్ ఆదివాసీ పోరాటాలకు సంఘీభావాన్ని ప్రకటించగలం, మద్దతునివ్వగలం. ఇప్పటికే డి.కె.ఎస్.జడ్.సి. కార్యదర్శి కోస, గుడ్సా ఉసెండిలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో బుద్ధదేవ్‌పై దాడిని ప్రజాతీర్పుగా శ్లాఘిస్తూ, ప్రజల వర్తమాన ప్రతిఘటనకు విప్లవ జేజేలు పలికారు. ఆ దిశగా పోరాటాలను వుధృతం చేద్దాం. ★

# ప్రతిఘటనా - పోరాటాలు - సభలు

**ఏ.ఒ.బి.**

## మల్కన్‌గిరి జిల్లా

### ఇన్ఫార్మర్ హరినాథ్ ఖతం

తూర్పు గోదావరి జిల్లా సీలేరు సమీపంలో వున్న మర్రిగూడ గ్రామంలో వుంటున్న హరినాథ్‌ను 2007 ఫిబవరిలో ఒక కాంటాక్టు కోసం పంపించడం జరిగింది. అప్పటికే ద్రోహిగా మారివున్న హరినాథ్ పోలీసులకు తెలియజేశాడు. దానితో ఈ కాంటాక్టుకు వచ్చిన కామ్రేడ్స్ లక్ష్మణ్, భవానీలనూ, ఈ కాంటాక్టుకు హరినాథ్‌తోపాటు వెళ్లిన కామ్రేడ్ స్వామినీ పోలీసులు పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి తెల్లవారుజామున 4 గంటలకు మర్రిగూడ వద్ద కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారు. అప్పటి నుండి ఈ ద్రోహి సీలేరు గ్రేహౌండ్స్ పోలీసులతో తిరుగుతున్నాడు. దానితో హరినాథ్‌ను 2008 మేలో ఖతం చేయటం జరిగింది.

### ఇన్‌ఫార్మర్ ఖతం, సి.ఆర్.పి.ఎఫ్. పోలీసుకు గాయాలు

పప్పులూరు, కలిమెల ఏరియాలో వున్న దళాల కోసం వెతకడానికి ఒక పోలీసును సివిల్లో ఆంధ్ర గ్రేహౌండ్స్ పోలీసులు పంపారు. ఇతను డంపులు వెతుకుతూ, నీళ్ల తావులు తిరుగుతూ కొర్రుబు గ్రామం నుండి మర్రిగట్ట వచ్చాడు. అనుమానాస్పదంగా అనిపించి మిలీషియా పట్టుకొని విచారణ చేస్తే ఆంధ్ర పోలీసులు పంపించినట్లు, వరంగల్ నుండి వచ్చినట్లు చెప్పాడు. అతన్ని ప్రజల ముందు పెట్టి చంపేసారు. తర్వాత ఆ శవం దగ్గర మైను పెట్టి కూర్చున్నది మిలీషియ. పోలీసులు వచ్చిన వెంటనే మైను పేల్చటంతో ఒక సి.ఆర్.పి.ఎఫ్ పోలీసు గాయపడ్డాడు.

మే నెలలో కలిమెల పట్టణ సమీపంలో పోలీసులపై క్లేమోర్ మైను పేల్చటంతో ఒక సి.ఆర్.పి.ఎఫ్. పోలీసు గాయపడ్డాడు.

## శ్రీకాకుళం-కోరాపుట్ ఉమ్మడి డివిజన్

### ఇన్ఫార్మర్లకు మరణశిక్షలు

డివిజన్‌లో పోలీసు యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాటు చేసిన ఇన్ఫార్మర్ వ్యవస్థను ధ్వంసం చేయడంలో భాగంగా పార్టీ కొందరు ఇన్ఫార్మర్లను పట్టుకొని విచారించి ఖతం చేసింది.

రాయగఢ జిల్లా గుణుపూర్ బ్లాక్ గొట్లబద్ర గ్రామానికి చెందిన రాజు సాహు రాజకీయ నాయకుడు, గూండా. గతంలో రాజు వాళ్ల నాన్న ఏ.పి. పోలీసులతో సంబంధాలు పెట్టుకొని పార్టీని దెబ్బతీయాలని చూశాడు. ప్రజల మీద అక్రమ కేసులు పెట్టించి వేధించేవాడు. పార్టీ పలుసార్లు హెచ్చరించినప్పటికీ పద్ధతులు మార్చుకోకపోవడంతో 2002లో ఈ ద్రోహిని పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది. తర్వాత కూంబింగ్‌కు వచ్చిన ఒరిస్సా సి.ఆర్.పి.ఎఫ్ బలగాలపై ఆంబుష్ చేస్తే 9 మంది పోలీసులు చనిపోయారు. తండ్రిని చంపినా కూడా బుద్ధి తెచ్చుకోకుండా రాజు అదే పద్ధతులు అవలంభించాడు. గ్రామాలల్లో ఇన్ఫార్మర్ వ్యవస్థను తయారు చేశాడు. పలుమార్లు దళ సమాచారాన్ని పోలీసులకు ఇచ్చారు. సానుభూతిపరులను సైతం చంపాలని చూశాడు. దీనికితోడు అమ్మాయిలపై అత్యాచారానికి పాల్పడేవారు. పంచాయితీలోని కాంట్రాక్టులన్నీ తానే చేస్తూ అక్రమాలకు పాల్పడేవాడు. ఈ ప్రజావ్యతిరేక చర్యలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని 2008, మే 15న పి.ఎల్.జి.ఎ. ఇతన్ని శిక్షించింది.

విజయనగరం జిల్లా కొమరాడ మండలం రబ్బ గ్రామానికి చెందిన తిరుపతి హెూంగార్డుగా పనిచేస్తూ పోలీసులకు సమాచారాన్ని చేరవేసేవాడు. దీనితో ఇతన్ని పి.ఎల్.జి.ఎ. శిక్షించింది.

కోరాపుట్ జిల్లా అలమండ గ్రామ నివాసి అయిన బృందావన్ సొండీ కులస్తుడు. సారా వ్యాపారం చేస్తూ ప్రజలను దోచుకునేవాడు. సారా వ్యతిరేక పోరాటంలో భాగంగా ప్రజలు బృందావన్ సారా బట్టీలనూ, ఇంటినీ ధ్వంసం చేశారు. అప్పటి నుండీ పోలీసు ఇన్ఫార్మర్‌గా మారాడు. కూంబింగ్‌లకు వచ్చే పోలీసులకు సహకరించేవాడు. ప్రజలను బెదిరించేవాడు. దానితో 2008, మే 1న పి.ఎల్.జి.ఎ. బృందావన్‌ను ఖతం చేసింది.

బి.జె.పి. పార్టీకి చెందిన బిద్దిక నిరంజన్ కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ ప్రెసిడెంట్‌గా పని చేస్తుండేవాడు. ఇతను పెద్ద కాంట్రాక్టర్, గూండా. ఎందరో మహిళలపై అత్యాచారాలు చేశాడు. గతంలో దొంగతనాలు చేయించేవాడు. ఆదివాసేతరులను కూడగట్టి ఇన్ఫార్మర్లుగా తయారు చేశాడు. మే 7వ తేదీన జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌కు కారకుడయ్యాడు. బందుగాంకు ఆనుకుని వుండే సూరపల్లి అనే గ్రామంలో పెద్ద బిల్డింగ్‌లో, నిరంతరం ఎస్కార్ట్‌తో వుండేవాడు. ఈ ద్రోహి చేసే ఆకృత్యాలను భరించలేని ప్రజలు ఎన్నోసార్లు పార్టీకి ఫిర్యాదులు చేశారు. దానితో 2008, జూలై 9న పి.ఎల్.జి.ఎ. ఈ ద్రోహిని చంపేసింది.

కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ ఎగువసుంబి గ్రామానికి చెందిన

సొన్న ఆదివాసీ తెగ పెద్దగా వుండేవాడు. గత కొంతకాలంగా ఇన్ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. కోరాపుట్ దాడి అనంతరం, ఆ దాడిలో పాల్గొన్న కామ్రేడ్స్ కొంతమంది ఈ ప్రాంతంలో సంచరిస్తుండగా ఈ ద్రోహి సమాచారం అందించాడు. ఫలితంగా మార్చి 8న పోలీసులు మాటుగాసి దాడిచేస్తే కామ్రేడ్స్ శశి, విజయ్, కుమారిలు అమరులయ్యారు. ఈ ద్రోహానికి పాల్పడ్డ సొన్నను 2008 జూలైలో పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది.

## ఆదివాసేతరుల ఇండ్లపై దాడి, ఆస్తుల స్వాధీనం

కోరాపుట్ జిల్లాలోని నారాయణపట్నం బ్లాక్ బొరిగి పంచాయితీ గ్రామంలో కొద్దిమంది ఆదివాసేతర దోపిడీదారులు సారా వ్యాపారం, కాంట్రాక్టర్లు, వడ్డీ వ్యాపారం చేస్తూ ఆదివాసీ ప్రజల భూములను అప్పుల పేరుతో అక్రమంగా స్వాధీనం చేసుకుని తీవ్రమైన దోపిడికి గురి చేస్తున్నారు. వీరిలో దొన్నొ, బొంకమ అనే వాళ్లు ప్రధానమైన వాళ్లు. అప్పటికే నాగులబెడ్డ పంచాయితీలోని కొన్ని గ్రామాల్లో ప్రజలు ఆదివాసేతర సుండీల ఇండ్లపై దాడులు చేసి పార్టీ నాయకత్వంలో ఆస్తులను స్వాధీనం చేసుకుని, వాళ్లను గ్రామాల నుండి తరిమివేయటం, భూములను పంచుకోవటం జరిగింది. ఈ ప్రభావంతో బొరిగి పంచాయితీలో కూడా సుమారు 600 మంది స్త్రీపురుషులు, మిలీషియా కదిలి 2008, జూన్ 28న బొరిగ గ్రామంలో వీళ్ల ఇళ్లపై దాడి చేసి ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు చాలా కసితో, ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మళ్లీ మరుసటి రోజు ప్రజాకోర్టు పెట్టి వీళ్ల తప్పులను ఒప్పించి, కాంట్రాక్ట్ పనుల ద్వారా మోసం చేసి ప్రజలకు ఎగ్గొట్టిన డబ్బులను కట్టించి, హెచ్చరించి వదిలిపెట్టారు.

బెర్ల గ్రామంలో హరిశ్చంద్ర, దుదుష్ట, వెంకటి మొదలగు ఏడు పెత్తందారీ కుటుంబాలు వుండేవి. చుట్టుపక్కల జరిగిన ప్రజా పోరాటాల మూలంగా వీళ్లు ముందే అన్నీ సర్దుకుని వెళ్లిపోయారు. మిగిలిన బట్టలు, కుట్టుమిషన్, ఫ్యాన్, ఫర్నీచర్ వగైరాలను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. 24 గొడ్లను, 30 మేకలను ఐదు గ్రామాల ప్రజలు పంచుకున్నారు. ఇంటి పైకప్పులను, రేకులను స్వాధీనం చేసుకున్నారు. 17 ఎకరాల భూమిని ప్రజలు స్వాధీనం చేసుకున్నారు.

## పంటల స్వాధీనం

నారాయణపట్నం బ్లాక్ బొరిగి పంచాయితీ మంజరిగూడ చట్టుపక్కల గ్రామాల ప్రజలు 2008, మేలో ఆదివాసేతరుల దోపిడికి విసిగి వేసారి ఆగ్రహావేశాలతో పోరాటాలలో కదిలారు. బొరిగి పంచాయితీ గ్రామాల్లో గతంలో సుండీలు అక్రమంగా కాజేసిన ప్రజల రెండు పంటలు పండే 14 ఎకరాల పొలాలను పోరాడి సాధ్వీనం చేసుకున్నారు. ఆదివాసేతరుల ఇళ్లపై దాడి చేసి వారిని గ్రామాల నుండి తరిమివేశారు. అయితే అప్పటికే ఆ భూముల్లో సుండి వాళ్లు వేసిన వరి పంటను కంటికి రెప్పలా కాపాడుకుని, వందలాది ప్రజలు కదిలి పంటను కోసి స్వాధీనం చేసుకున్నారు. ఎర్రజెండాలు ఎగరవేసి మిలీషియా రక్షణలో వెన్నెల రాత్రుల్లో కోత ప్రారంభించారు. 5 రోజులపాటు కోతలు, నూర్పిళ్లు, వెంట వెంటనే చేసుకుని అక్కడే పంపిణీ చేసుకుని ప్రజలు ఆనందంగా ఇళ్లకు వెళ్లారు. దీంట్లో ఏడు గ్రామాల ప్రజలు 300 నుండి 400 మంది పాల్గొన్నారు. దళం దగ్గర వుండి పంట స్వాధీనంలోనూ, పంపిణీలోనూ సహకరించింది. ఇది ఏరియా వ్యాప్తంగా మంచి ప్రభావాన్ని వేసింది. ఇక్కడి భూపోరాటాలకు తొలిమెట్టు ఇదే.

## నాగులబెడ్డ, బొరిగి పంచాయితీల్లో బియ్యం పంపకం

పోరాటం నుండి ప్రజలను దూరం చేయాలనే శత్రు ఎత్తుగడల్లో భాగంగా ఆదివాసీలలోనే ఒక వర్గాన్ని పాలకవర్గాలకు అనుకూలంగా మల్చుకునే కుట్రతో కోరాపుట్ జిల్లా నారాయణపట్నం, బందుగాం, లక్ష్మీపూర్ బ్లాక్‌లలో 'బికాస్' అనే సంస్థ వివిధ కార్యక్రమాలను చేపట్టింది. ఈ సంస్థలోని వ్యక్తులు లక్షల డబ్బులను స్వాహా చేస్తూ ప్రజల కూలీలను ఎగ్గొట్టడం మొదలుపెట్టారు. ప్రెసిడెంట్, సెక్రటరీలు, వాలంటీర్లతో సహా ఆస్తులు సంపాదించుకున్నారు. ఈ విషయాన్నీ పార్టీ ప్రజల ముందు బహిర్గతపరిచి, ప్రజలను చైతన్యవంతులను చేయటంతో ప్రజలు ఈ సంస్థను వ్యతిరేకిస్తూ దోపిడీని నిలదీశారు. తమ కూలీ డబ్బులను డిమాండ్ చేసి సాధించుకున్నారు. వాటర్‌షెడ్ పథకం పేరుతో ఇటిక, నాగులబెడ్డ, బొరిగి తదితర గ్రామాల్లో ప్రజలను మోసం చేసి కూలీ డబ్బులు ఎగ్గొట్టిన కూలీ డబ్బులు లెక్కలుకట్టి దళం ఇప్పించింది, బికాస్ సంస్థ వుండవద్దని హెచ్చరించింది. కొద్ది రోజుల తర్వాత సంస్థ తరపున వాటర్‌షెడ్ పథకం కోసం దాదాపు వెయ్యి బస్తాల బియ్యం వచ్చాయి. 21 గ్రామాల ప్రజలకు దళం ఈ బియ్యాన్ని పంచింది. బికాస్ సంస్థలో పని చేసి లాభాలు గడించిన పెద్ద మనుషులకు 60 వేలు, 70 వేల రూపాయల ఫైన్ వేసి వాటిని గ్రామస్తులకు అప్పజెప్పటం జరిగింది. ఈ సంస్థల బూటకత్వాన్ని, మోసాన్ని అర్థం చేయించి ఈ సంస్థ కార్యకలాపాలకు రాజీనామా చేయించి ఇక నుండి బికాస్ పనులు చేయవద్దని హెచ్చరించటం జరిగింది.

## కలప నరకటాన్ని (ఆదివాసేతరులు) బంద్ పెట్టటం

కేసల, రేంగ అడవికి ఆంధ్ర మైదాన ప్రాంతం వాళ్లు వచ్చి పెద్ద ఎత్తున కలపను నరికించి బండ్లతో తరలించుకుపోతున్నారు. అలా దొరికిన వారిని ఒక పూట దళం వద్ద వుంచి విషయం చెప్పి తిరిగి

ఎప్పుడూ రావద్దని హెచ్చరించి వదిలిపెట్టింది. దానితో ఇప్పుడు కలప నరకడం బంద్ అయ్యింది.

బొరిగి, నాగులబెడ్డ, వల్లాడ, అలమండ పంచాయితీలో బొగ్గులు కాల్చి అమ్ముకోవటం వుంది. ప్రధానంగా ప్రజలు దీని మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలకు అర్థం చేయిస్తూ అడవిని నాశనం చేయటం వలన వచ్చే దుష్పరిణామాలపై వాయిస్‌లు, పోస్టర్లు వేసి ప్రచారం చేస్తూ, భూ పోరాటం చేసి భూములను స్వాధీనం చేసుకోవటమే సరైన మార్గమని, అందుకు ప్రజలు పోరాటాల్లో కదలాలని దళం చైతన్యపరిచింది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో చెట్లు నరకటం, బొగ్గు కాల్చటం బంద్ పెడుతున్నారు.

## నిర్బంధానికి వ్యతిరేకంగా

కోరాపుట్ ఏరియాలో ఆదివాసేతర దోపిడీదార్ల మోసాలకు, పీడనలకు గురవుతున్న ఆదివాసీ ప్రజలు, పార్టీ రాజకీయాలతో ప్రభావితులై, పార్టీ నాయకత్వంలో అడవిపై హక్కు కోసం, దోపిడీ పీడనల నుండి విముక్తి కోసం సంఘటితమై, అనేక పోరాటాలలో భాగస్వాములవుతున్నారు. భూ పోరాటాలు చేసి భూములు స్వాధీనం చేసుకుంటున్నారు. దోపిడీదార్ల ఇళ్లపై దాడులు చేసి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. తమ కష్టంతో సాగు చేసిన పంటలను స్వాధీనం చేసుకుని పంచుకుంటున్నారు. క్రమంగా తెగ పెత్తందార్లను, ఆదివాసేతర దోపిడిని వ్యతిరేకిస్తూ, వర్గ సంగాలలో సమీకృతులౌతున్నారు. మిలీషియా నిర్మాణాల్లో భాగస్వాములు అవుతున్నారు. ఈ రకంగా ప్రజల కదలికను, ప్రజా పోరాటాలను అణచివేయాలనే కుట్రపూరిత ఆలోచనతో, ఆదివాసేతర దోపిడిదార్ల సహాయ సహకారంతో ప్రభుత్వం, పోలీసులు ఈ గ్రామాలపై దాడులు చేయటం, ఆదివాసీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయటం కోసం హఠాత్తుగా గ్రామాలపై పడి దొరికిన వాళ్లను దొరికినట్టు కొట్టటం, అరెస్టులు చేయటం, గ్రామం అంతా పోలీస్ స్టేషన్‌కు వచ్చి సరెండర్ అయితే విడిచిపెడతాం అని నిర్బంధించటం, ప్రజల ఆస్తులను ధ్వంసం చేయటం, సరెండర్ నోటీసులను పంపటంతోపాటు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పర్చుకోవటం, కూంబింగ్‌లు వగైరా చేస్తున్నాడు. అయినప్పటికీ ప్రజలు శత్రు ఎత్తులను ఓడిస్తూ ఈ నిర్బంధాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రతిఘటనకు సిద్ధమవుతున్నారు.

నాగులబెడ్డ గ్రామంలో మాజీ సంఘనాయకుడు, బికాస్ సంస్థలో పని చేస్తున్న జగ్గారావును అరెస్టు చేయటంతో పెద్ద మొత్తంలో ప్రజలు కదిలి వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ ప్రజల నాయకుడు ఆరిక నారాయణ పార్టీతో సన్నిహితంగా వుండేవాడు. తమ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేస్తున్నాడనే దాంతో ఆదివాసేతరులైన సుండీలు ఇతనిని హత్య చేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరించారు. ఈ విషయంలో హంతకులను అరెస్టు చేయాలనే డిమాండ్‌తో సుమారు 400 మంది ప్రజలు కదిలారు.

పెద్ద ఇటికి (బొరిగి పంచాయితీ) గ్రామంపై పోలీసులు 2008, జూలై 8న దాడి చేసి ఆరుగురిని అక్రమంగా అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ, వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 250 మంది ప్రజలు కదిలి 2008, జూలై 10న నారాయణపట్నంలో ధర్నా చేసి పోలీసులను నిలదీశారు.

మంగళాపురం గ్రామస్తుడు ఎర్రు, గండవలస గ్రామస్తుడు సిక్కులను పోలీసులు అరెస్టు చేస్తే గండవలస, లెల్లిపాయి, మంజరిగూడ గ్రామాల ప్రజలు ముసలీ ముతక అంతా కలిసి సుమారు వంద మంది కర్రలు పట్టుకుని కదిలారు. ఈ అరెస్టులు బొరిగి సొండి వాళ్లే కుట్రతో చేయిస్తున్నారు, దీనికి వాళ్లే బాధ్యత వహించాలని, తమ గ్రామస్తులను విడిపించుకురావాలని డిమాండ్ చేస్తూ బొరిగిలో దళంతో కలిసి వెళ్లి ప్రజలు సొండి వాళ్లను హెచ్చరించారు.

కోరాపుట్ ఏరియాలో ప్రజలు 30 మందికిపైగా అరెస్టు కాగా, 6గురు ఇంకా జైళ్లలోనే వున్నారు.

కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్బంధానికి వ్యతిరేకంగా జూన్ 26 నుండి జూలై 2 వరకు నిరసన వారాన్ని విజయవంతం చేసేందుకు దళం రెండు వారాలపాటు కేంద్రీకరించింది. బంద్‌కు ముందుగా రెండు వారాలపాటు సుమారు 13 గ్రామాల నుండి 150 మంది మిలీషియాను బ్యాచ్‌లుగా చేసి ఒక్కో బ్యాచ్‌కి ఒక రోజు బూబీట్రాప్ ట్రెయినింగ్ ఇచ్చింది. నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం మిలీషియా 20 బ్యానర్లు, 200 పోస్టర్లు, 15 వాయిస్‌లను వేయటం జరిగింది.

మూడుచోట్ల చెట్లను నరికి రోడ్లను దిగ్బంధించడం, చెక్ పోస్టులను ధ్వంసం చేయటం వంటి కార్యక్రమాల్లో ప్రజలు, మిలీషియా కలిసి 250 మంది వరకు పాల్గొని బంద్‌ను, నిరసన వారాన్ని విజయవంతం చేశారు.

దీంట్లో భాగంగానే పి.ఎల్.జి.ఎ. బలగాలు జగ్గాడ, నారాయణపట్నం గ్రామాల్లో వున్న రెండు రిలయన్స్ సెల్ టవర్లను ధ్వంసం చేశారు.

## అమరవీరుల సంస్మరణ సభలు

2008, జూలై 28న అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా కోరాపుట్ ఏరియాలో 3 పాకెట్ స్థాయి సభలను (మంగళాపురం, బార్లమండ, లొచ్చ)లలో దళం నిర్వహించింది. దీంట్లో ఒక్కో పాకెట్‌లో 300 మంది ప్రజలు పాల్గొన్నారు. బిర్ల, మంజరిగూడ, ఉల్లుబడి గ్రామాల్లో గ్రామస్థాయి సభలను కూడా దళం నిర్వహించింది. దీంట్లో గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల కోసం ముందుగానే రెండు క్యాంపెయిన్ టీంలు ఏర్పడ్డాయి. వీళ్లు ఏరియాలో ప్రచారం చేస్తూ పొడబద్ర పాకెట్లోని గ్రామాలు, అలమండ పాకెట్‌లో 4 గ్రామాలలో సభలను నిర్వహించారు. మొత్తం 150 పోస్టర్లు, 20 వాయిస్‌లు, 20 బ్యానర్లను వేశారు. ప్రతి సభ దగ్గరా రెడీమేడ్ స్థూపాలను నిర్మాణం చేసి, ఎర్రజెండా ఎగురవేసి విప్లవ సాంప్రదాయం ప్రకారం మౌనం పాటించి అమరులకు వినమ్రంగా జోహార్లర్పించి సంస్మరణ సభలను విజయవంతంగా జరుపుకున్నారు.

## ఇన్‌ఫార్మర్ల ఇళ్లు కూల్చివేత

కురుపాం మండలం చాపరాయిగూడ గ్రామానికి చెందిన అనిల్ గత కొద్ది రోజులు పార్టీలో పని చేసి దళం నుండి చెప్పకుండా దొంగతనంగా పారిపోయి నీలకంఠాపురం పోలీస్‌లకు లొంగిపోయి కె.బి.డి. ఏరియాలో పోలీసులతో తిరిగి సంఘ నాయకులను, సానుభూతిపరులను అరెస్టు చేయించి చిత్రహింసలు పెట్టి తప్పుడు కేసులు పెట్టించాడు. కొన్ని డంపులు చూపించాడు. కొంత కాలం తర్వాత నీలకంఠాపురం పోలీసులు పెళ్లి చేసి పార్వతీపురం మార్చారు. అక్కడ పోలీసులతో కూంబింగ్‌కు వెళ్లేవాడు. ఒక ఎన్‌కౌంటర్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. ఇందులో కామ్రేడ్ నిర్మల అమరురాలయింది.

అనిల్ తల్లిదండ్రులు బొడ్డిగాడుగూడ గ్రామంలో వుంటూ దళం సమాచారం పోలీసులకు ఫోన్ ద్వారా చేరవేస్తున్నారు. దళం అయిదు గ్రామాల ప్రజలతో మీటింగ్ చేసి ఊరు వదిలి వెళ్లిపొమ్మని చెప్పింది. కానీ వినకుండా అదే గ్రామంలో వుంటూ అనిల్ తండ్రి సానుభూతిపరులను కొట్టడం చేసాడు. మళ్లీ దళం, ప్రజలు వెళ్లి అడిగితే దొంగతనంగా పారిపోయాడు. పార్టీ, ప్రజలు అనిల్ ఇల్లు కూల్చి వేశారు. ఇందులో అయిదు గ్రామాలకు చెందిన 200 మంది ప్రజలు పాల్గొన్నారు. పోలీసులకు సమాచారం ఇస్తున్న ఇన్‌ఫార్మర్లకు ఈ సంఘటన ఒక హెచ్చరికగా వుంటుంది.

## ప్రచారం

గొడ్డుసుల్లిడి పాకెట్‌లో, కొండబారిడి ఏరియాలో వివిధ అంశాలపై నెల రోజులపాటు పోస్టర్లు, వాయిస్‌లు, బ్యానర్లు, కరపత్రాల రూపంలో ప్రచారం జరిగింది. సెప్టెంబర్ 21న పార్టీ 4వ వార్షికోత్సవాలను వివరిస్తూ వేయి కరపత్రాలు పంచారు. 18 బ్యానర్లు, 200 పోస్టర్లు వేశారు. ఏడుచోట్ల జెండాలు ఎగురవేసారు. ఆంధ్రలో ఈ రోజు ప్రభుత్వం తీసుకొస్తున్న బహుముఖ దాడిలో భాగంగా ప్రభుత్వ సంస్కరణలను బహిర్గతం చేస్తూ వంద పోస్టర్లను వేశారు. ఆదివాసీ గ్రామాలలో సారా సమస్య తీవ్రంగా వుంది. సారా వలన కలిగే నష్టాలను వివరిస్తూ, సారా వ్యాపారం మానకపోతే తగిన పరిణామాలు వుంటాయని హెచ్చరిస్తూ వంద పోస్టర్లు వేశారు. సెల్ టవర్ల వలన కలిగే నష్టాలు వివరిస్తూ, వాటిని నిర్మించడం ఆపకపోతే తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, పోలీసు నిర్బంధం, ప్రభుత్వ సంస్కరణలు, పార్టీని నిర్మూలించడానికి పోలీసులు చేపట్టే కార్యక్రమాలు బహిర్గతపరుస్తూ, రాజకీయ నాయకులు ప్రజల సమస్యలు పట్టించుకోవటంలేదని, పోలీసులు ప్రయాణిస్తున్న బస్సుల్లో ప్రజలను ఎక్కవద్దని విజ్ఞప్తి చేస్తూ ఈ అంశాలన్నింటిని కలిపి 50 వాయిస్‌లను వేశారు. ప్రచార కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని పోస్టర్లు అంటించడం, కరపత్రాలు పంచడం, బ్యానర్లు కట్టడం చేశారు. ముఖ్యంగా యువత స్వతంత్రంగా రాసి అంటించారు. ప్రచారం ఒడియా, తెలుగు భాషలలో జరిగి ఏరియా వ్యాప్తంగా మంచి ప్రభావాన్ని వేసింది. ప్రజలలో మంచి స్పందన కనిపించింది.

# ఎన్.టి.

## కె.కె.డబ్ల్యు. డివిజన్

### నిర్బంధం

ఉద్యమ నిర్మూలనకు తీసుకుంటున్న కార్యక్రమంలో భాగంగా ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియాలో ప్రభుత్వం నిర్బంధం తీవ్రం చేస్తున్నది. పార్టీని ప్రజల నుండి దూరం చేయడానికి పార్టీకి సహకరిస్తున్నారనే నెపంతో 15-20 మంది సానుభూతిపరులను అరెస్టులు చేసి, అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేశారు. ఇందులో వ్యాపారస్తులు, డాక్టర్లు వున్నారు. వీరిని పార్టీకి సామాన్లు తెస్తున్నారని, ద్విచక్ర వాహనాలను ఇస్తున్నారనే నెపంతో అరెస్టులు చేస్తున్నారు.

మాజీలను ప్రతిరోజు ఏరియా సమాచారం రాబట్టే విధంగా పోలీసులు షరతులు పెడుతున్నారు. ప్రతిరోజు ఒక గ్రామం నుండి విడి విడిగా, ఒకరు లేదా ఇద్దరు మాజీలను స్టేషనుకు రప్పిస్తూ దళ సమాచారాన్ని రాబట్టడానికి ఒత్తిడి చేస్తున్నారు. చెప్పనివారిని చిత్రహింసలు పెడుతున్నారు. కాబట్టి మాజీలు సమాచారం తెలిస్తే

చెప్పడానికి కూడా సిద్ధపడుతున్నారు. దీనితో శత్రువు కూంబింగ్స్ చేపడుతున్నాడు.

పెద్దపల్లి, చిట్యాల ఏరియాలో పోలీసులు ఇన్ఫార్మర్ల వ్యవస్థ ద్వారా సమాచారం తెలుసుకుని ముందు ఒకరిని అరెస్టు చేసి వారిని చిత్రహింసలు పెడుతూ, వారే అందరిపేర్లు చెప్పినట్టుగా అరెస్టులు చేస్తున్నారు. పెద్దపల్లిని ఆనుకొని వున్న హుజురాబాద్‌లో 17 మందిని, పెద్దపల్లిలో 5గురిని అరెస్టు చేసి జైలుకు పంపారు. చిట్యాలలో దాదాపు 75 మందిని పిలిపించి కొంత మందిపై కేసులు పెట్టి జైలుకు పంపినారు. ఇలా ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అరెస్టులు చేసి చిత్రహింసలు పెట్టి రహస్యాలు రాబట్టడం, కేసులు పెట్టి జైలుకు పంపడం, మాజీలకు షరతులు విధించడం చేస్తున్నారు.

కొత్తగూడెం, నర్సంపేట ఏసీ పరిధిలో శత్రు బహుముఖ దాడిలో భాగంగా ఉద్యమాన్ని నిర్మూలించేందుకు ప్రజలను భయోత్పాతానికి గురిచేస్తూ ఏజెన్సీ ప్రాంతంలో పార్టీ కదలికలు అర్థం కావటంతో పెద్దఎత్తున గ్రేహౌండ్స్ బలగాలతో కూంబింగ్స్ కొనసాగిస్తున్నారు.

ఏరియాలో మావోయిస్టు కార్యకర్తలను, సంఘనాయకులను పెద్దఎత్తున అరెస్టులు చేస్తూ, స్టేషన్ల చుట్టూ తిప్పుతూ దళాల ఆచూకి చెప్పమని డబ్బుల ఆశచూపుతూ మానసికంగా వేధిస్తున్నారు.

కొత్తగూడెం, నర్సంపేట ఏసీ పరిధిలో ఉద్యమాన్ని నిర్మూలించేందుకు పెద్ద ఎత్తున కూంబింగ్‌లు కొనసాగిస్తూ సంఘనాయకులను అరెస్టులు చేస్తూ, చిత్రహింసలకు గురిచేస్తూ రోజులతరబడి వారిని రహస్యంగా బంధించి, పార్టీ రహస్యాలు చెప్పమని డబ్బుల ఆశ చూపుతూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. ఇందులో భాగంగా గుండాల మండలం దామెరతోగులో పాయం రామారావు, చంద్రం, కత్తి లక్ష్మయ్యలను, ఇల్లందు మండలం కాశనపల్లి గ్రామంలో పూనెం నరసింగారావును, తాడ్వాయి మండలం నర్సపురం గ్రామంలో సుతారి బుచ్చన్నను, టేకులపల్లి మండలం చింతన చెలుక గ్రామంలో ముత్యాలు, నర్సయ్యలను, కొత్తగూడెం మండలం మరగూడంలో భూమన్న, వెంకన్న, అశోక్‌లను అరెస్టులు చేశారు.

పార్టీ నాయకత్వానికి ఉన్న రివార్డులను వారి ఫోటోలను వాల్ పోస్టర్ల ద్వారా ప్రకటిస్తూ ఆచూకి చెప్పినవారికి రివార్డ్‌లు ఇస్తామని ప్రచారం కొనసాగిస్తున్నారు.

అజ్ఞాతమా, స్వేచ్ఛనా అనే కార్యక్రమంతో పత్రికా ప్రకటనల ద్వారా దుష్ప్రచారం చేస్తూ అజ్ఞాతంలో ఉన్నవారి కుటుంబాలతో కౌన్సిలింగ్‌లు చేస్తూ కుటుంబాలమీద వత్తిడి చేస్తున్నాడు.

## ఇన్‌ఫార్మర్, ప్రజావ్యతిరేకి ఖతం

ఏటూరునాగారం మండలంలో కన్నాయిగూడెంకు చెందిన పైడి రాజు అనే ఉపాధ్యాయున్ని 2008, నవంబర్ 27న మావోయిస్టు యాక్షన్ టీం ఖతం చేసింది. పైడి రాజు పోలీసు ప్రలోభాలకు లొంగి గత 5 సంవత్సరాలుగా పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ నిరంతరం పార్టీ సమాచారాన్ని పోలీసులకు చేరవేసేవాడు. కూంబింగ్‌కు వచ్చే పోలీసు బలగాలకు గైడ్‌గా వుండేవాడు. పలుమార్లు దళాలు తృటిలో ప్రమాదం నుండి తప్పుకున్నాయి.

ఉపాధ్యాయ వృత్తికి ఎగనామం పెడుతూ గ్రామాలలో తిరుగుతూ సమాచారం సేకరిస్తూ, ప్రభుత్వ సంస్కరణలను ప్రచారం చేస్తూ, నూతన అటవీ చట్టం పేరుతో గిరిజనులకు పట్టాలు ఇప్పిస్తామని చెబుతూ, యువకులను తాగుడుకు బానిసలు చేస్తూ, ఇన్‌ఫార్మర్స్‌ను తయారు చేస్తున్నాడు.

ఇతను ఇచ్చిన సమాచారం వల్ల ఎందరో ప్రజలు, సానుభూతిపరులు అరెస్టు అయి జైళ్లలో వున్నారు. వ్యక్తిగతంగా వైరుధ్యాలు వున్న వారిని కూడా పార్టీలో సంబంధాలున్నట్లు చిత్రీకరిస్తూ అరెస్టులు చేపించేవాడు.

దీనితో విసిగిన ప్రజలు ఈ ద్రోహిని ఖతం చేయాలని దళాన్ని కోరడంతో, ప్రజల సహకారంతో దళం ఇతన్ని ఖతం చేసింది. దీనితో ప్రజలు ఇన్‌ఫార్మర్, ప్రజావ్యతిరేకి పీడ విరగడైందని సంతోషించారు. ఇన్‌ఫార్మర్లు ఎవరికైనా ఇదే గతి పడుతుందని మిగతా ఇన్‌ఫార్మర్లు భయపడే విధంగా ఏరియాలో ప్రభావం పడింది.

నిరంతరం కూంబింగ్ మధ్యనే అదే రోజు పోలీస్ బ్యాచ్ పెట్రోలింగ్ చేసి వెళ్లిన 10 నిమిషాల తర్వాతనే ఈ యాక్షన్ జరగడంతో శత్రువు ఖంగుతిన్నాడు.

## ప్రచారం

నర్సంపేట-కొత్తగూడెం ఎసి పరిధిలో పినపాక మండలం అనంతారం గ్రామంలో కొమ్మ వెంకన్న, సాంబశివరావు అనే కరడుగట్టిన భూస్వాముల భూములను గతంలో సాగుచేయనీయకుండ పార్టీ నిలిపివేయటం జరిగింది. శత్రు నిర్బంధంలో పార్టీ కదలికలు తగ్గుముఖం పట్టడంతో భూస్వాములు కొమ్మ వెంకన్న, సాంబశివరావు ప్రభుత్వం పోలీసులతో కుమ్మక్కై వారి భూములను అమ్మడం ప్రారంభించారు.

భూస్వాములు భూముల్ని అమ్మడం, కొనడం వెంటనే నిలిపివేయాలని. అమ్మినవారు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, కొన్నవారు భూమిని సాగుచేయటం నిలిపివేయాలని అక్కడి ➡

(...44వ పేజీ తరువాయి)

అవసరాలు తీర్చడం కోసం మహిళలు తమ శ్రమను ఎంత చౌకగానయినా, ఎంత దుర్భర పరిస్థితుల్లోనయినా అమ్ముకోవాల్సి వస్తుంది. నైట్ షిఫ్ట్‌ల్లో పని చేయడం తప్పనిసరై అభద్రతా సమస్య మరింత పెరుగుతుంది. మధ్యతరగతి మహిళలు కూడా శ్రమను అమ్ముకోవడం అనివార్యమౌతుంది. ఏ పనులూ దొరక్క మహిళలు తమ శరీరాలను అమ్ముకోవాల్సిన దుస్థితి కూడా దాపురిస్తుంది. వుపాధి కోల్పోయి వత్తిడిని తట్టుకోలేని పురుషులు తాగుడువంటి వ్యసనాలకు గురై మహిళలను హింసించడం పెరుగుతుంది. వరకట్న హింసకూడా పెరుగుతుంది. మొత్తంగా కుటుంబ జీవనం అల్లకల్లోలమై మహిళల మానసిక, శారీరక ఆరోగ్యాలను ప్రభావితం చేస్తాయి. ఇప్పటికే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వ్యవసాయ, చేనేత రంగాలను ప్రస్తుత సంక్షోభం మరింత దిగజారుస్తుంది. ఈ రంగాల్లోని శ్రామిక మహిళలపై దీని ప్రభావం విషమంగా వుంటుంది. ఇలా చెప్పుకుంటూపోతే ప్రస్తుత సంక్షోభ ప్రభావం మహిళ మీద, అందులోనూ ప్రధానంగా శ్రామిక మహిళలమీద చాలా తీవ్రంగా పడుతోంది.

వ్యక్తిగత లాభాపేక్ష పునాదిపై ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో వికృతమైన పోటీలకు దారితీస్తూ ఆర్థిక సంక్షోభాలు అనివార్యమవుతాయి. అంతేగాక వస్తూత్పత్తి పునాదిగాకాక స్పెక్యులేషన్ పునాదిగా మారిన ఒక విపరీత స్థితి నేటి ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలో పడేసింది. పెట్టుబడిదారి విధానం శాశ్వతం అని బూర్జువా ఆర్థిక వేత్తలు చేసిన నిర్ధారణలు తప్పని వస్తుగతంగా నిరూపించబడింది.

ప్రజల అవసరాలు, అభివృద్దే గీటురాయిగా వుండే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ మాత్రమే ఇటువంటి సంక్షోభాలకు నిజమైన పరిష్కారం. కనుక ఈ మార్చి 8 సందర్భంగా శ్రామిక మహిళలంతా సంఘటితంగా కదిలి అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దిన వారసత్వాన్ని కొనసాగిస్తూ, కామ్రేడ్ అనురాధ నెలకొల్పిన ఆదర్శాలనూ, పోరాట విలువలనూ ఎత్తిపడుతూ, ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికీ, దాన్ని మన నెత్తిమీదికి తెచ్చిన సామ్రాజ్యవాదానికీ, సామ్రాజ్యవాదానికి దన్నుగా వున్న భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలకూ వ్యతిరేకంగా పోరాడమని 'క్రాంతి' పిలుపునిస్తోంది. ★

## మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలలో

## పోలీసు బలగాలను ఆంబుష్‌లలో మట్టుబెట్టిన పి.ఎల్.జి.ఎ.కు జేజేలు

2009, ఫిబ్రవరి 1న ఉత్తర గడ్చిరోలి డివిజన్ గారపత్తి పోలీసు స్టేషన్ పరిధిలోని మోరిగాం గ్రామం వద్ద నడిచివస్తున్న సి.60 కమాండో బలగాలపై, గెరిల్లాలు ఆంబుష్ చేసి ఒక ఎస్.ఐ.తో సహా 15 మందిని మట్టుబెట్టి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ గత 10 సంవత్సరాలలోనే ఇది ఒక పెద్ద ఘటన. అణచివేస్తామని విర్రవీగుతున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసులకు చెంపపెట్టులాంటి చర్య ఇది.

2009, ఫిబ్రవరి 8న బీహార్ రాష్ట్రం నవద జిల్లా ఝార్ఖండ్ సరిహద్దు ప్రాంతంలో రాత్రిపూట రవిదాస్ వుత్సవాలకు రక్షణ కోసం వస్తున్న బీహార్ మిలటరీ పోలీసు బలగాలపై గెరిల్లాలు ఆంబుష్ చేసి 10 మందిని మట్టుబెట్టి, ఇద్దరిని తీవ్రంగా గాయపరిచారు. ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వీరోచిత చర్య ద్వారా బీహార్ ప్రభుత్వానికి, పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేశారు.

డి.కె, బీహార్-ఝార్ఖండ్ ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకువెడుతున్న పి.ఎల్.జి.ఎ. విజయాలు భారతవిప్లవ ప్రజలకు గొప్ప ఉత్తేజాన్నిస్తాయి.

➡

చుట్టుపక్కల గ్రామాలైన గొడుగుబండ, కొత్తూరు, పద్మపురంలో 50 వాల్‌పోస్టర్లు వేయటం జరిగింది.

కొత్తగూడెం-నర్సంపేట ఏరియా పరిధిలో కొత్త అటవీ చట్టం లొసుగులను ఎండగడుతూ, ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత విధానాలను మోసపూరిత పద్ధతులను బహిర్గతం చేస్తూ పాకాల కొత్తగూడెం మండలంలోని గ్రామాలైన కోమట్లగూడెం, కట్టుగారం, ఎల్లాపురం, భాగురుగొండ, చింతగూడెంలలో పోస్టర్లు వేసి ప్రచారం చేశారు. ★

# అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం వర్ధిల్లాలి!

## కామ్రేడ్ అనురాధా గాంధీ నెలకొల్పిన విప్లవాదర్శాలనూ, పోరాట విలువలనూ ఎత్తిపడుదాం!!

## ఆర్థిక సంక్షోభంలో నలిగిపోతున్న శ్రామిక మహిళలు పోరుబాట పట్టాలి!!!

2009, మార్చి 8ని పురస్కరించుకొని మన ప్రియతమ మహిళానేత, సిసి సభ్యురాలూ కామ్రేడ్ అనురాధా గాంధీ నెలకొల్పిన విప్లవ ఆదర్శాలనూ, పోరాట విలువలనూ సమున్నతంగా ఎత్తిపట్టాలనీ, విస్తృతంగా ప్రచారం చేయాలనీ, అలాగే ప్రస్తుత ఆర్థిక సంక్షోభంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మహిళలను పోరాటాల్లోకి సంఘటితం చేయాలనీ సి.పి.ఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

ప్రపంచవ్యాప్తంగా పీడిత మహిళా లోకానికి సంక్రమించిన ఒక ఉత్తేజపూరితమైన వారసత్వం మార్చి 8. ఈ వారసత్వాన్ని మనకు అందించడం కోసం మన ముందు తరాలు చేసిన పోరాటం సుదీర్ఘమైనది, సగర్వమైనది చారిత్రాత్మకమైనది. 1908, మార్చి 8న న్యూయార్క్‌లోని దుస్తుల పరిశ్రమలో పనిచేసే మహిళా కార్మికులు స్వల్ప వేతనాలకూ, అధిక పని గంటలకూ, దుర్భమైన పని పరిస్థితులకూ వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ పోరాట స్ఫూర్తిని ప్రపంచవ్యాప్తంగా పీడిత మహిళలకు అందించడం కోసం 'మార్చి 8'ని అంతర్జాతీయ మహిళా పోరాట దినంగా జరుపుకోవాలని కామ్రేడ్ క్లారాజెట్కిన్ 1910లో కోపెన్‌హేగన్‌లో జరిగిన రెండవ ఇంటర్‌నేషనల్ మహాసభలో ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనను మహాసభ ఆమోదించింది. అప్పట్నుంచీ 'మార్చి 8' ఒక పోరాట కేతనమై దేశ దేశాల్లో, వీధి వీధుల్లో, గుండె గుండెల్లో రెప రెపలాడుతూ స్ఫూర్తినిస్తోంది.

ఆ స్ఫూర్తిని అందుకొని, మార్చి 8 పోరాట పిలుపును దేశవ్యాప్తంగా వ్యాపింప చేయడానికి తీవ్రమైన కృషి చేసినటువంటి విశేషంగా ఎన్నదగిన వారిలో కామ్రేడ్ అనురాధా గాంధీ ఒకరు. కామ్రేడ్ అనురాధా గాంధీ బొంబాయి మహానగరంలో మధ్యతరగతి విద్యావంతుల కుటుంబంలో పుట్టింది. ఉన్నతమైన చదువులు చదివి అధ్యాపక వృత్తిని చేపట్టింది. విద్యార్థి దశలోనే నక్సల్బరీ వసంత మేఘ గర్జనకు స్పందించింది. ఆ మార్గాన నడిచింది. ఆ మార్గాన్ని మరింత విస్తృతం చేయడం కోసం ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించింది. విద్యార్థి, హక్కుల, సాంస్కృతిక, దళిత, కార్మిక, ఆదివాసీ, రైతాంగ, మహిళా పోరాటాలకు స్వయంగా నాయకత్వం అందించింది. పట్టణాల్లో నగరాల్లో కార్మికులను సాయుధ పోరాట రాజకీయ మార్గంలోకి సంఘటితం చేసిన ఆమె, దండకారణ్యంలో సాయుధమై ఆదివాసీ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించింది. అద్భుతమైన మేధస్సుతో పార్టీలో సైద్ధాంతిక రంగంలో విశేషంగా ఎన్నదగిన కృషి చేసిన కా. అనురాధ మహారాష్ట్ర పార్టీ కమిటీ సభ్యురాలిగా, సుదీర్ఘకాలం పని చేసింది. 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో కేంద్రకమిటీ సభ్యురాలిగా ఎన్నికైంది. కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఆమె భారతదేశ మహిళా ఉద్యమ సారధ్యాన్ని చేపట్టి 'ఆకాశంలో సగాని'కి సగర్వమైన ప్రతినిధి అయింది. ఆ కృషిలో భాగంగా బీహార్-ఝార్ఖండ్‌లో మహిళా కామ్రేడ్స్‌కు రాజకీయ-సైద్ధాంతిక తరగతులను బోధించడానికి వెళ్లి అక్కడ సెరిబ్రల్ మలేరియా వ్యాధికి గురైంది. ఆ వ్యాధితో 2008, ఏప్రిల్ 12న ఆమె అమరురాలైంది.

కామ్రేడ్ అనురాధ జీవితం ఆద్యంతం స్ఫూర్తిదాయకం, ఆమె నెలకొల్పిన విలువలూ, ఆదర్శాలు అందరికీ అనుసరణీయం. ఆమె నడిచిన ఉన్నతమైన మార్గంలో పయనించమని దేశవ్యాప్త పీడిత మహిళలకు ఈ మార్చి 8 సందర్భంగా పిలుపునిద్దాం.

ప్రస్తుతం ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం కుదిపేస్తోంది. పీడిత ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేసే ఈ సంక్షోభం శ్రామిక మహిళల జీవితాలను మరింత అధ్వాన్నం చేస్తున్నది. పరిశ్రమలు మూతబడ్డంతో శ్రామిక మహిళలు ఉద్యోగాలు కోల్పోతున్నారు. భర్తలు, కొడుకులు ఉద్యోగాలు కోల్పోవడం వలన కూడా మహిళలపై వత్తిడి బాగా పెరుగుతున్నది. ఒకవైపు ఉపాధి కోల్పోవడం మరోవైపు సంక్షోభం కారణంగా నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటడం... ఈ ప్రభావం ఆర్థిక యూనిట్‌గా వున్న కుటుంబంపైనా కుటుంబ నిర్వహణ భారం వహించే మహిళలపైనా మొదటపడుతుంది. కుటుంబ ప్రాథమిక

*(మిగిలాది 43వ పేజీలో...)*